www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 20-11-2024 | పేజీలు: 14 | వెల (Price): Rs. 6.50 | సంపుటి (Volume): 22 సంచిక (Issue): 232
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: పంచమి సా. 4.50 తదుపరి షష్ఠి; నక్షత్రం: పునర్వసు మ. 2.50 తదుపరి పుష్యమి వర్జ్యం: రా. 11.05-12.44; దుర్ముహూర్తం: ఉ. 11.38-12.22; అమృతఘడియలు: మ. 12.26-2.02; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.26; సూర్యాస్తమయం: 5.34 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ జీవో అక్రమం

చట్టప్రకారం నేరుగా ఉద్యోగాలను భర్తీచేయండి
ఇప్పటికే క్రమబద్ధీకరించిన వారిని తొలగించొద్దు
జీవో ద్వారా చట్టంలో సవరణలు చేయడం చెల్లదు
జీవో 16 ద్వారా చేర్చిన సెక్షన్ 10-ఏ చట్టవిరుద్ధం
ఆ సెక్షన్‌ను కొట్టివేస్తున్నాం: హైకోర్టు ధర్మాసనం
3





కేసీఆర్.. కాస్కో

మా కార్యకర్తల పౌరుషమా.. నీ కుట్రలు, కుతంత్రాలా.. తేల్చుకుందాం

చర్చకు రమ్మంటే కేసీఆర్ రారు.. ఇద్దరు చిల్లరగాళ్లను ఊరి మీదికి వదిలి.. ఏది పడితే అది మాట్లాడిస్తున్నారు. పది నెలల్లో ప్రజలు ఏదో కోల్పోయారని అంటున్నారు. ఎవరూ ఏమీ కోల్పోలేదు.. కేసీఆర్ ఇంట్లో నాలుగు ఉద్యోగాలు తప్ప..
- ముఖ్యమంత్రి రేవంత్

అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పి మరీ ఓడించాం
లోక్‌సభలో సవాల్ చేసి సున్నాకు పరిమితం చేశాం
కేసీఆర్ అనే మొక్కను మళ్లీ మొలకెత్తనివ్వం
అధికారంలో ఉంటే దోచుకోవటం..
విపక్షంలో ఉంటే ఫామ్‌హౌస్‌లో పడుకోవడమేనా?
దమ్ముంటే శాసనసభలో చర్చకు రా.. తేల్చుకుందాం!
తేదీ, టైమ్ నువ్వే చెప్పు.. ఆ రోజే అసెంబ్లీ పెట్టిస్తా
నువ్వు చెప్పేది సహేతుకమైతే సరి చేసుకుంటాం
తాగుబోతుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా కేసీఆర్
18 వేల కోట్ల ఆదాయంలో వడ్డీకే 6,500 కోట్లు
తెలంగాణను అవమానించిన మోదీకి
కిషన్‌రెడ్డి గులాంగిరీ.. రాష్ట్రంలో ఉండే అర్హత లేదు
సోనియా కాళ్లు కడిగి నెత్తిన చల్లుకున్నా తక్కువే
పది నెలల్లోనే అనేక సంక్షేమ పథకాల అమలు
హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధి
వరంగల్ ప్రజాపాలన విజయోత్సవ సభలో రేవంత్

వరంగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్‌ను ఓడిస్తానని ఆనాడు చెప్పి మరీ ఓడించానని, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కకుండా చేస్తానని చెప్పి మరీ గుండు సున్నా తెప్పించానని అన్నారు. కేసీఆర్ అనే మొక్కను తెలంగాణ గడ్డపై మళ్లీ మొలకెత్తనివ్వబోనని ప్రకటించారు. "కేసీఆర్.. కాస్కో.. మా కార్యకర్తల పౌరుషమా.. నీ కుట్రలు, కుతంత్రాలా.. తేల్చుకుందాం" అని సవాల్ చేశారు. మంగళవారం హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "ఫామ్‌హౌస్‌లో మౌనంగా పడుకుంటే ఆయన సంగతి నాకు తెలియదనుకున్నాడేమో! ఆయన ముందు తెలుసు.. వెనుక తెలుసు. ఆయన ఉపాయం తెలుసు.. ఉబలాటం తెలుసు. అన్నింటికీ కుక్కకాటుకు చెప్పుదెబ్బ అనే మందు నా దగ్గర సిద్ధంగా ఉంది. తప్పకుండా ఆ మందును ఆయనకు పెడతా" అని కేసీఆర్ నుద్దేశించి రేవంత్ వ్యాఖ్యానించారు. పది నెలల్లో ప్రజలు ఏదో కోల్పోయారని కేసీఆర్ అంటున్నారని, కానీ.. ఎవరూ ఏమీ కోల్పోలేదని రేవంత్ చెప్పారు. కేసీఆర్ ఇంట్లో మాత్రం నలుగురు ఉద్యోగాలు కోల్పోయారని ఎద్దేవా చేశారు. తండ్రీకొడుకుల నౌకరీ ఊడగొడితే తెలంగాణ యువతకు 50 వేల ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. వరి వేసుకుంటే ఉరేనని ఆనాడు కేసీఆర్ మాట్లాడారని, ఆయన ఫామ్‌హౌస్‌లో 110 ఎకరాల్లో వరి సాగు చేస్తే ఆ బండారం తాము బయట పెట్టామని సీఎం రేవంత్ అన్నారు. నేడు బాజాప్తా

మిగతా 13వ పేజీలో...



హనుమకొండ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభకు భారీగా హాజరైన ప్రజలు

కాళోజీ కళాక్షేత్రం ప్రజలకు అంకితం
ప్రజాకవి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి
వరంగల్ మాస్టర్‌ప్లాన్-2041కు ఆమోదం 13
మహిళాశక్తి భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన

చేసింది చెప్పలేక కేసీఆర్‌ను తిడతావా?
ఆయన నామస్మరణ చేసినంతనే నీ పాపం పోదు
శాతగానోనికి మాటలు.. చేవలేనోనికి బూతులెక్కువ
కాంగ్రెస్ జరపాల్సింది అపజయోత్సవాలు: హరీశ్ 12

మీ స్థాయెంత? మీ బతుకెంత?
రేవంత్.. నోరు అదుపులో పెట్టుకో
మోదీని విమర్శించడంపై ఈటల
సచివాలయంలో చర్చకు సవాల్ 14



సురేశ్‌ను పరీక్షల కోసం కొడంగల్ ఆస్పత్రికి తీసుకొచ్చిన పోలీసులు

లగచర్ల ఏ-2 సురేశ్‌రాజ్
లొంగుబాటు

న్యాయవాదులతో కలిసి కొడంగల్ కోర్టుకు..
గ్రామంలో అధికారులపై దాడి ఘటన అనంతరం పరారీ
ఈ కేసులో మరో ఇద్దరిని కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
14 రోజుల రిమాండ్.. సంగారెడ్డి జైలుకు.. కస్టడీకి పిటిషన్
రేవంత్ గుర్తుపెట్టుకో.. రాకెట్‌లా తిరిగొస్తా: సురేశ్
లగచర్ల ఘటనపై రాష్ట్రపతి కార్యాలయం ఆరా!

వికారాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లగచర్లలో అధికారులపై దాడి ఘటనలో కీలక పాత్రదారి, రెండో నిందితుడు (ఏ-2) బోనగాని సురేశ్ రాజ్ కోర్టులో లొంగిపోయాడు. మంగళవారం మధ్యాహ్నం తన న్యాయవాదులతో కలిసి వచ్చి కొడంగల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో

మిగతా 14వ పేజీలో...

నిమ్స్ సేవలన్నీ
ఆరోగ్యశ్రీలోకి

కార్డు ఉంటే రూ.10 లక్షల దాకా ఉచిత వైద్యం
పేద, మధ్య తరగతి వర్గాల వారికి ప్రయోజనం
ఒకే చికిత్సకు ఆరోగ్యశ్రీ, ఎల్‌వోసీ వాడకం..
దుర్వినియోగం మంత్రి దామోదర దృష్టికి..
దీంతో కీలక నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆస్పత్రిలో లభించే అన్ని రకాల వైద్య సేవలు, శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో పేద, మధ్య తరగతి వర్గాలకు వైద్యసేవల పరంగా ఎంతో మేలు జరగనుంది. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చాలు.. రూ. 10 లక్షల వరకూ అన్ని రకాల వైద్య సేవలనూ నిమ్స్‌లో ఉచితంగా పొందే వెసులుబాటు కలగనుంది. నిమ్స్ ఆస్పత్రిలో చాలా రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ.. వాటిలో కొన్ని మాత్రమే ఆరోగ్యశ్రీ పరిధిలోకి వస్తున్నాయి. ఆ పరిధిలో లేని చికిత్స/సర్జరీ చేయించుకోవాలంటే ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి 'లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)' తెచ్చుకోవాల్సి వచ్చేది. అంటే.. చికిత్సకు



మిగతా 12వ పేజీలో...



దృశ్య నాణ్యతకు యాంటీ స్మాగ్ గన్ వినియోగిస్తున్న దృశ్యం

ఢిల్లీ డేంజర్

500 దాటిన గాలి నాణ్యత సూచీ
ప్రపంచంలోనే కాలుష్య నగరంగా దేశ రాజధాని
యూపీపైనా తీవ్ర ప్రభావం.. పలు చోట్ల వాహనాల ఢీ
హరియాణా సహా 7 రాష్ట్రాలకు పొగమంచు హెచ్చరికలు
నవంబరు-జనవరి నెలల మధ్య నివాస యోగ్యమే కాదు
ఇంకా ఢిల్లీని రాజధానిగా కొనసాగించాలా?: శశి థరూర్

న్యూఢిల్లీ/లఖ్‌నవూ, నవంబరు 19: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. విజిబులిటీ స్థాయులు దారుణంగా పడిపోతున్నాయి. గాలి నాణ్యత(ఏక్యూఐ) కూడా కొన్ని చోట్ల 500 మార్కును దాటింది. సగటు గాలి నాణ్యత 494గా ఉంది. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ రికార్డుకెక్కింది. ఎంతలా అంటే.. రెండో స్థానంలో

మిగతా 2వ పేజీలో...

హైహై హైదరాబాద్
వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో టాప్
కలిసి వస్తున్న పాలన సౌలభ్యం, ఆర్థిక-సామాజిక పరిస్థితులు, స్థిరాస్తి, మౌలిక సదుపాయాలు
రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ నైట్ ఫ్రాంక్ నివేదిక 11



విడిపోనున్న రెహమాన్ దంపతులు
29 ఏళ్ల వివాహ బంధానికి స్వస్తి 10
రెహమాన్ సతీమణి తరపు లాయర్ వెల్లడి



పసిడి రుణాలకూ ఈఎంఐ!
నెలవారీ వాయిదాల్లో అసలు, వడ్డీ చెల్లించొచ్చు
బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల సన్నాహాలు 11

కోహీర్ @ 9.5
సంగారెడ్డి జిల్లాలో 10 డిగ్రీలలోపు ఉష్ణోగ్రత 13
సీజన్‌లో తొలిసారి.. వారంలో 7 డిగ్రీలు పతనం
రాష్ట్రంలో వచ్చే 3 రోజులకు యెల్లో అలెర్ట్ జారీ

నేడే 'మహా' పోలింగ్
మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలకు ఓటింగ్
ఝార్ఖండ్‌లో తుది దశ, యూపీ ఉప ఎన్నికలకూ
ఈ నెల 23న ఓట్ల లెక్కింపు 2

ప్రజలే ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టుకోవాలా?
జనంపై భారం మోపే ప్రయత్నం తగదు
ఇబ్బంది పెట్టేలా మరో తుగ్లక్ చర్య 12
విద్యుత్తు నిర్వహణ చేతగాని సర్కార్: కేటీఆర్
టీఎస్ఎస్‌పీడీసీఎల్ నోటీసులపై ఆగ్రహం
సీఎం రేవంత్ స్పందించాలని డిమాండ్



2

రోడ్లపై రక్త చరిత్ర
2023లో గంటకు 20 మంది దుర్మరణం
ప్రమాదాలపై కేంద్ర రవాణాశాఖ నివేదిక
ఢిల్లీలో గంటకు సగటున 55 దుర్ఘటనలు
2022తో పోలిస్తే 4.2% పెరుగుదల

ప్రపంచ యుద్ధం ముప్పు?

రష్యాపై ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి క్షిపణి దాడులు
అమెరికా పంపిన అటాకమ్స్ మిస్సైళ్ల ప్రయోగం
రష్యా భూభాగంలో దాడికి బైడెన్ అనుమతి
రష్యా మీద గగనతల దాడిచేస్తే అణుయుద్ధమే
ఉక్రెయిన్ దాడి చేసినా నాటో దాడిగా పరిగణిస్తాం
కొత్త అణ్వాయుధ విధానం ప్రకటించిన పుతిన్
లెక్క చేయకుండా అదేరోజు దాడికి దిగిన ఉక్రెయిన్
ప్రపంచ యుద్ధం వస్తుందని నాటో దేశాల వణుకు



ఉక్రెయిన్ నుంచి రష్యా వైపు దూసుకెళ్తున్న క్షిపణులు

న్యూఢిల్లీ, నవంబరు 19: ఉక్రెయిన్, రష్యా యుద్ధం కీలక మలుపు తీసుకుంది. యుద్ధం మొదలై వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఉక్రెయిన్ మంగళవారం రష్యా మీద క్షిపణి దాడికి దిగింది. అమెరికా సరఫరా చేసిన దీర్ఘశ్రేణి క్షిపణులను(అటాకమ్స్)ను రష్యా భూభాగం మీదకు ప్రయోగించింది. 300 కిలోమీటర్ల దూరం వరకు లక్ష్యాన్ని ఛేదించగల మొత్తం ఆరు క్షిపణులను ప్రయోగించగా, ఐదింటిని రష్యా మధ్యలోనే అడ్డుకొని కూల్చేసింది. ఆరో క్షిపణిని కూడా మధ్యలోనే పేల్చేసినప్పటికీ శకలాలు సైనిక శిబిరం మీద పడ్డాయని, అగ్ని ప్రమాదం తప్ప ప్రాణనష్టమేమీ జరగలేదని రష్యా ప్రకటించింది. సరిహద్దుకు 115 కిలోమీటర్ల ఆవల ఉన్న రష్యా ఆయుధ డిపోను పేల్చేశామని ఉక్రెయిన్

మిగతా 2వ పేజీలో...

వెయ్యి రోజుల యుద్ధం.. కోటి తగ్గిన ఉక్రెయిన్ జనాభా 2

సీపీఎస్‌లో సర్కారు వాటా ఏదీ?

ఏడాదిగా ఖాతాలకు జమకాని ప్రభుత్వ సొమ్ము
2023 అక్టోబరు నుంచి 10% చెల్లించని ప్రభుత్వం
షేర్ మార్కెట్ పెట్టుబడుల్లో ఆ మేరకు లోటు
లాభాల్లో వాటా నష్టపోతామంటున్న ఉద్యోగులు
సీపీఎస్ స్ఫూర్తి దెబ్బ తింటోందని ఆందోళన

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెన్షన్ల భారం తగ్గించుకొనేందుకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని(సీపీఎస్)ను ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని కూడా సక్రమంగా చెల్లించడం లేదు. ఏడాది కాలంగా ఉద్యోగుల సీపీఎస్ ఖాతాల్లో తన వాటా సొమ్మును

మిగతా 12వ పేజీలో...

టీఎం కృష్ణకు 'సంగీత కళానిధి' అవార్డుకు బ్రేక్

చెన్నై, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మద్రాసు మ్యూజిక్ అకాడమీ 2024 సంవత్సరానికిగాను ప్రముఖ గాత్ర విద్వాంసుడు టీఎం కృష్ణకు ఇవ్వదలచిన 'సంగీత కళానిధి' అవార్డుకు మద్రాస్ హైకోర్టు బ్రేక్ వేసింది. ఎమ్మెస్ సుబ్బులక్ష్మి మనవడు శ్రీనివాసన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు మంగళవారం ఈ మేరకు స్టే విధించింది. 2004లో ఎమ్మెస్ సుబ్బులక్ష్మి మరణానంతరం మద్రాసు మ్యూజిక్ అకాడమీ ప్రముఖ ఆంగ్ల పత్రిక నిర్వాహకులతో కలిసి ఆమె పేరుతో ఏటా ప్రతిభావంతులైన కర్నాటక సంగీత విద్వాంసులకు 'సంగీత కళానిధి' అవార్డును ప్రదానం చేస్తోంది. ఈ యేడాది ఈ అవార్డుకు గాత్ర విద్వాంసుడు టీఎం కృష్ణను ఎంపిక చేసింది. అయితే తన బామ్మ సుబ్బులక్ష్మి కీర్తిప్రతిష్ఠలకు భంగం కలిగించేలా గతంలో విమర్శలు చేసిన టీఎం కృష్ణకు ఆమె పేరుతో అవార్డు ఇవ్వకూడదని శ్రీనివాసన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీజయచంద్రన్.. ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పేరుతో టీఎం కృష్ణకు అవార్డును ప్రదానం చేయడాన్ని నిలుపుదల చేశారు. అయితే, టీఎం కృష్ణకు మరో పేరుతో అవార్డు ప్రదానం చేసుకోవచ్చని సూచించారు.

అవమానకరంగా ఉన్న కులాల పేర్లు మార్చాలి

» సుప్రీంకోర్టులో పిటిషన్..కేంద్రానికి కోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, నవంబరు 19: అవమానం కలిగించే విధంగా ఉన్న కులాల పేర్లను మార్చాలన్న వినతిపై సమాధానం చెప్పాలని సుప్రీంకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కించపరిచే విధంగా ఉన్న కులాల పేర్లను ధ్రువీకరణ పత్రాల్లో పేర్కొనకూడదని, ఆ పదాలను ఉపయోగించడాన్ని కూడా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నేరంగా పరిగణించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ మేరకు నోటీసులు ఇచ్చింది. అఖిల భారతీయ గిహారా సమాజ్ పరిషద్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎస్సీ ఉప కులాలైన చురా, చమార్, భంగీ, కంజార్ వంటి పేర్లు కించపరిచేవిగా ఉన్నాయని, వాటిని తొలగించాలని పిటిషన్‌లో కోరారు. అవమానపరచాలన్న ఉద్దేశంతో కులం పేరును ప్రస్తావించినా అది నేరం కిందే వస్తుందని ఒకవైపు చట్టాల్లో చెబుతుండగా, మరో అదే కులం పేరుతో ప్రభుత్వమే ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం ఏమిటని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశ్నించారు.

ప్రొఫెసర్ సాయిబాబా స్మృత్యర్థం ఏర్పాటైన ఫిల్మ్ ఫెస్టివెల్‌ను అడ్డుకున్న ఆర్‌ఎస్‌ఎస్

జైపూర్, నవంబరు 19: ప్రొఫెసర్ సాయిబాబా, పాలస్తీనా చిన్నారుల స్మృత్యర్థం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన '9వ ఉదయ్‌పూర్ ఫిల్మ్ ఫెస్టివెల్‌'ను ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థలు అడ్డుకున్నాయి. నగరంలోని రవీంద్రనాథ్ ఠాగూర్ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో మూడు రోజుల చలన చిత్రోత్సవాన్ని జరపటానికి నిర్వాహకులు అన్ని అనుమతులు తీసుకొని శుక్రవారం ప్రారంభించారు. రెండోరోజైన శనివారం.. పలువురు సంఘ్ కార్యకర్తలు అక్కడికి వచ్చి.. సాయిబాబా మీద, పాలస్తీనా మీద చిత్రాలు ప్రదర్శించటం దేశ వ్యతిరేకమని, దేశ ప్రజల్ని క్షమాపణ కోరుతూ వీడియో విడుదల చేయాలంటూ వీరంగం వేశారు. ఫిల్మ్ ఫెస్టివెల్‌ను బలవంతంగా అడ్డుకున్నారు. దీంతో చలనచిత్రోత్సవాన్ని నగరంలోనే మరో చోట ఏర్పాటు చేసిన ఓ తాత్కాలిక గుడారంలోకి మార్చుకొని కార్యక్రమాన్ని కొనసాగించారు. .

హిమాచల్ భవన్‌ను వేలం వేసుకొని మీకు రావాల్సిన బకాయిలు తీసుకోండి

» విద్యుత్తు సంస్థకు హిమాచల్ హైకోర్టు అనుమతి

సిమ్లా, నవంబరు 19: ఓ విద్యుత్తు సంస్థకు రూ.150 కోట్ల బకాయిలు చెల్లించడంలో హిమాచల్ ప్రభుత్వం విఫలమయినందున ఢిల్లీలోని హిమాచల్ భవన్‌ను స్వాధీనం చేసుకొని వేలం వేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సెలి హైడ్రోపవర్ ఎలక్ట్రికల్ కంపెనీకి అనుకూలంగా సోమవారం జస్టిస్ మదన్ మోహన్ గోయల్ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. లహౌల్, స్పిటి జిల్లాల్లో చెనాబ్ నదిపై 340 మెగావాట్ల విద్యుత్తు ఉత్పాదన ప్రాజెక్టు నిర్మించేందుకు సెలి కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆ కంపెనీ రూ.64 కోట్లను బయానా రూపంలో చెల్లించింది. అయితే ప్రాజెక్టు పనులను ప్రారంభించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం.. కేటాయింపు లేఖను రద్దు చేయడంతో పాటు, బయానాగా చెల్లించిన రూ.64 కోట్లను కూడా జప్తు చేసింది. దీనిపై ఆ కంపెనీ మధ్యవర్తి (ఆర్బిట్రేటర్)ని ఆశ్రయించింది. బయానా సొమ్మును వడ్డీతో సహా చెల్లించాలని ఆర్బిట్రేటర్ ఆదేశించారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆ కంపెనీ హైకోర్టులో అప్పీలు చేసింది. కంపెనీ బయానాగా ఇచ్చిన డబ్బుకు 7% వడ్డీ కలిపి రూ.150 కోట్లు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. దీన్ని వసూలు చేయడానికి హిమాచల్ భవన్‌ను వేలం వేసుకోవచ్చని ఆ కంపెనీకి సూచించింది.

100 కోట్ల సైబర్ నేరంలో చైనా వ్యక్తి అరెస్టు

న్యూఢిల్లీ, నవంబరు 19: వాట్సాప్ ద్వారా ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ చేస్తున్నానని నమ్మించి రూ.100 కోట్ల మేర మోసగించిన ఓ చైనా జాతీయుడిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వాట్సాప్ గ్రూపుల పేరుతో మోసం చేసిన ఫాంగ్ ఛెంజిన్‌ను సఫ్దర్‌జంగ్ ఎన్‌క్లేవ్‌లో అరెస్టు చేశామని షాహ్‌దారా డీసీపీ ప్రశాంత్ గౌతమ్ తెలిపారు. ఆన్‌లైన్ స్టాక్ మార్కెట్ శిక్షణ పేరుతో తనను మోసగించినట్టు సురేష్ కొలిచియిల్ అచ్యుతన్ అనే బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. పోలీసుల దర్యాప్తులో సైబర్ క్రైం పోర్టల్‌లో ఛెంజిన్‌పై 17 క్రిమినల్ కేసులు ఉన్నట్టు తేలింది. ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రెండు మనీలాండరింగ్ కేసులతోనూ ఛెంజిన్‌కు సంబంధం ఉన్నట్టు వెల్లడైంది.

జీ20 గ్రూప్ ఫొటోలో బైడెన్‌కు దక్కని చోటు!

రియో డి జనెరియో, నవంబరు 19: జీ20 దేశాధినేతల గ్రూప్ ఫొటోలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, కెనడా ప్రధాని ట్రూడో, ఇటలీ ప్రధాని మెలానీలకు చోటు దక్కలేదు. బ్రెజిల్‌లో జరుగుతున్న జీ20 శిఖరాగ్ర సదస్సుకు ప్రపంచ దేశాధినేతలు హాజరైన విషయం తెలిసిందే. వారంతా సోమవారం సందడి చూస్తూ దిగిన గ్రూప్ ఫొటోలో ఈ ముగ్గురూ గల్లంతవడం చర్చనీయాంశమైంది. ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తదితర దేశాధినేతలంతా గ్రూప్ ఫొటో దిగిన సమయంలో ద్వైపాక్షిక చర్చలు జరుపుతున్న బైడెన్, ట్రూడో.. ఆ చర్చలు ముగించుకొని వచ్చేసరికి గ్రూప్ ఫొటో తీయడం పూర్తై, నేతలంతా తలోదిక్కుకు వెళ్లిపోయారు. జార్జియా మెలోనీ కూడా ఆలస్యంగా రావడంతో ఆమెకు కూడా గ్రూప్ ఫొటోలో చోటు దక్కలేదు.

కెనడాలో విద్యార్థుల పని గంటలు 24కి పెంపు

న్యూఢిల్లీ, నవంబరు 19: తమ దేశంలో ఉండి చదువుకునే విదేశీ విద్యార్థుల పని గంటల విషయంలో కెనడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌తోపాటు ఇతర విదేశీ విద్యార్థులకు క్యాంపస్ వెలుపల వారంలో 20 గంటలు పనిచేసుకునే వెసులుబాటు ఉండేది. అయితే ఈ నెల 8వ తేదీ నుంచి దీన్ని 24 గంటలకు పెంచుతున్నట్టు కెనడా ప్రకటించింది. ఇది ఆ దేశంలో ఉండి చదువుకునే విద్యార్థులకు మేలు చేయనుంది. వారు తమ చదువులు కొనసాగిస్తూనే మరింత ఎక్కువ సమయం పనిచేసేందుకు అవకాశం ఉంటుంది. అలాగే పని గంటలు పెరిగితే విద్యార్థుల చదువుపై ప్రభావం చూపొచ్చనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.

మణిపూర్ హింసపై తక్షణమే జోక్యం చేసుకోండి

» రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మల్లికార్జున ఖర్గే లేఖ

న్యూఢిల్లీ, నవంబరు 19: శాంతిభద్రతలు దిగజారిన మణిపూర్‌లో ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు తక్షణం జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంగళవారం లేఖ రాశారు. గత 18 నెలలుగా ఆ రాష్ట్రంలో పరిస్థితులు పూర్తిగా దిగజారినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చక్కదిద్దడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. మరోవైపు, మణిపూర్‌లో ఎన్డీయే ఎమ్మెల్యేలు 27 మంది ఆ రాష్ట్రంలోని జిరిబమ్ జిల్లాలో మహిళలు, పిల్లల హత్యలకు కారకులైన కుకి మిలిటెంట్ల కోసం ప్రత్యేక ఆపరేషన్ జరపాలని తీర్మానించారు. మణిపూర్ హక్కుల కార్యకర్త ఇరోం షర్మిల ఆ రాష్ట్ర సీఎం బీరేన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని స్వయంగా జోక్యం చేసుకొంటే తప్ప పరిస్థితులు చక్కబడవని తెలిపారు. కాగా సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని మణిపూర్‌లోని కొన్ని ప్రాంతాల్లో మళ్లీ అమలుచేయడాన్ని వ్యతిరేకిస్తూ ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో పలు పౌర సంఘాలు మంగళవారం కర్ఫ్యూని ఉల్లంఘించి ర్యాలీని నిర్వహించాయి.

ప్రపంచ యుద్ధం ముప్పు?

(మొదటి పేజీ తరువాయి)



ప్రకటించింది. రెండు నెలల్లో పదవి నుంచి దిగిపోతున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్‌లో మోహరించిన అటాకమ్స్‌ను రష్యా భూభాగం మీద ప్రయోగించేందుకు అనుమతి ఇస్తూ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయం ఇప్పటికీ అధికారికంగా ప్రకటించనప్పటికీ ఆదివారమే విషయం బయటకు వచ్చింది. ఇప్పటిదాకా అటాకమ్స్‌ను ఉక్రెయిన్ భూభాగంలో ఉన్న రష్యా సైనికుల మీద ప్రయోగించడానికి మాత్రమే అమెరికా అనుమతి ఇచ్చింది. ఇప్పుడు ఏకంగా రష్యా భూభాగం మీద కూడా క్షిపణి దాడి చేయడానికి బైడెన్ అనుమతించారు. బైడెన్ చర్య మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుందనే ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కాబోయే అధ్యక్షుడు ట్రంప్ తనయుడు జూనియర్ ట్రంప్ కూడా ఇది మూడో ప్రపంచ యుద్ధాన్ని తీసుకొచ్చే చర్యేనని మండిపడ్డారు. రెండు నెలల్లో దిగిపోతున్న అమెరికా దేశాధ్యక్షుడు ప్రపంచ భద్రతనే ప్రమాదంలోకి నెట్టారని హంగరీ విదేశాంగ మంత్రి ధ్వజమెత్తారు. బైడెన్ నిర్ణయం ఆదివారమే వెలువడినప్పటికీ రష్యా మంగళవారం స్పందించింది. ఉక్రెయిన్ యుద్ధం మొదలై వెయ్యి రోజులు పూర్తి అయిన సందర్భంగా తన అణ్వాయుధ ప్రయోగ విధానాన్ని సమీక్షిస్తూ కొత్త విధానాన్ని ప్రకటించింది. తన మీద విమానాలు, క్షిపణులు, డ్రోన్లు వేటితో గగనతల దాడులు చేసినా తన సార్వభౌమాధికారాన్ని సవాలు చేసినట్లుగానే భావిస్తామని చెప్పింది. కొత్త విధానం ప్రకారం అణ్వాయుధ శక్తి లేని (ఉక్రెయిన్ లాంటి) దేశం ఏదైనా అణ్వాయుధ సంపత్తి ఉన్న (అమెరికా లాంటి) దేశం సాయంతో దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యా మీద ప్రయోగిస్తే దాన్ని రెండు దేశాలు కలిసి(ఉక్రెయిన్-అమెరికా) చేసిన దాడిగా పరిగణించాలని నిర్ణయించారు. ఉక్రెయిన్ రష్యా మీద కాని, దాని మిత్రదేశం బెలారస్ మీద కాని అణ్వాయుధాలతో కానీ సంప్రదాయ ఆయుధాలతో కానీ దీర్ఘ శ్రేణి క్షిపణలను ప్రయోగిస్తే రష్యా సార్వభౌమాధికారం మీద జరిగిన దాడిగా పరిగణిస్తారు. అప్పుడు అణ్వాయుధ ప్రయోగానికి సంబంధించి అన్ని అవకాశాలను పరిశీలించే అధికారం రష్యాకు ఉందని అందులో పేర్కొన్నారు. ఏదైనా కూటమిలో ఒక దేశం దాడి చేసినా మొత్తం కూటమి దాడి చేసినట్లుగా పరిగణిస్తామని చెప్పారు. అంటే, అమెరికా ప్రోద్బలంతో ఉక్రెయిన్ దాడి చేస్తే మొత్తం నాటో కూటమి యుద్ధం భయాన్ని చవిచూడాలన్న మాట. రష్యా ఇంతటి భీకర ప్రకటన చేసినప్పటికీ ఉక్రెయిన్ లెక్క చేయలేదు. అమెరికా ఇచ్చిన అనుమతితో రష్యా భూభాగం మీదకు క్షిపణులను ప్రయోగించింది. రష్యా కొత్త అణు విధానాన్ని ప్రకటించిన రోజే దాన్ని ఉక్రెయిన్ సవాలు చేయడం గమనార్హం.


పౌరులకు నాటో దేశాల హెచ్చరికలు

బైడెన్ అనుమతి, రష్యా హెచ్చరికల నేపథ్యంలో నాటోలో భాగంగా ఉన్న నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, డెన్మార్క్ దేశాల్లో యుద్ధ భయాలు మొదలయ్యాయి. యుద్ధం తలెత్తితే ఏం చేయాలనే విషయమై తమ పౌరులను అప్రమత్తం చేయడం మొదలు పెట్టాయి. కొన్ని దేశాలు నివాస ప్రాంతాల్లో కరపత్రాలు చల్లుతుండగా, కొన్ని దేశాలు పౌరులకు నేరుగా ఈమెయిల్స్ పంపుతున్నాయి.మొత్తం జనాభా కోసం ఎప్పుడో భూగర్భ షెల్టర్లు నిర్మించిన స్వీడన్ మూడు రోజులకు సరిపడా రేషన్‌తో చెప్పినప్పుడు షెల్టర్లలో పోవడానికి సిద్ధంగా ఉండాలని పౌరులకు సమాచారం ఇచ్చింది.

ఉక్రెయిన్ జనాభా కోటి తగ్గిపోయింది

కీవ్, నవంబరు 19: ఉక్రెయిన్ రష్యా యుద్ధానికి వెయ్యి రోజులు పూర్తయ్యాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్ ఎదుర్కొన్న అత్యంత తీవ్రమైన యుద్ధం ఇదే. ఈ యుద్ధంలో ఇరువైపులా పది లక్షల మంది చనిపోవడమో, తీవ్రంగా గాయపడటమో జరిగింది. 21వ శతాబ్దంలో ఇప్పటివరకు చవిచూసిన అత్యంత తీవ్రమైన యుద్ధం కూడా ఇదే. ఉక్రెయిన్‌లో నగరాలు, పట్టణాలు, గ్రామాలు నేలమట్టమై శిథిలాలుగా మిగిలాయి. ఉక్రెయిన్ సైన్యంలో 80 వేల మంది చనిపోయారు. నాలుగు లక్షల మంది గాయపడి కదలలేని పరిస్థితుల్లో ఉన్నారు. రష్యా వైపు సైన్యంలో మరణాలు రెండు లక్షల వరకు ఉంటాయని అంచనా. క్షతగాత్రులు నాలుగు లక్షల వరకు ఉంటారు. నిజానికి రెండు దేశాల్లోనూ యుద్ధం లేని సమయంలోనే జనాభా తరుగుదల సమస్యను ఎదుర్కొంటున్నారు. యుద్ధంతో పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. ఉక్రెయిన్‌లో ప్రజలు 12 వేల మంది చనిపోయారు. 25 వేల మంది గాయపడ్డారు. యుద్ధం మొదలైన తర్వాత ఉక్రెయిన్‌లో పిల్లల్ని కనేవారు మరింత తగ్గిపోయారు. రెండున్నరేళ్ల క్రితం ఉన్న జననాల రేటు మూడోవంతు పడిపోయింది. యుద్ధాల వల్ల కాకుండా సహజ మరణాలు, వలసలు, జననాల రేటు తగ్గిపోవడం కారణంగా ఉక్రెయిన్‌లో గత రెండున్నర ఏళ్లలో కోటి మంది జనాభా తగ్గిపోయారు. నాలుగు కోట్ల మంది ఉన్న జనాభా మూడు కోట్లు అయ్యారు. ఏకంగా 67 లక్షల మంది వలస వెళ్లారు. ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ మూడోవంతు కుంచించుకుపోయింది. ఆస్తి నష్టం 13 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా.

లోకం తీరు



శంకర్‌దాదాలు.. ఉత్తుత్తి దవాఖానా తెరిచారు

» ప్రారంభోత్సవం జరిగిన మర్నాడే మూసివేత.. సూరత్‌లో ఘటన

సూరత్, నవంబరు 19: 'జనసేవా మల్టీస్పెషాల్టీ హాస్పిటల్' ఈ పేరుతో గుజరాత్‌లోని సూరత్‌లో భారీ ఆస్పత్రి వెలిసింది. విశిష్ట అతిథులుగా పోలీసు అధికారులొచ్చి ఆదివారం ప్రారంభించారు. అయితే మర్నాడే అంటే సోమవారమే ఆ ఆస్పత్రిని ప్రభుత్వ అధికారులు మూసేశారు. కారణం.. దాన్ని స్థాపించిన వైద్యులంతా నకిలీ వైద్యులేనని తేలింది. ఈ ఆస్పత్రిని ఐదుగురు వైద్యులు స్థాపించగా.. అందులో ఇద్దరివి పూర్తి నకిలీ డిగ్రీలని.. మిగతా ముగ్గురి విద్యార్హతల పత్రాలపైనా సందేహాలున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఆస్పత్రి స్థాపకుల్లో శుక్లా, దూబేలపై ఇప్పటికే గుజరాత్ మెడికల్ ప్రాక్టీషనర్స్ యాక్ట్ ప్రకారం కేసులున్నాయని పోలీసులు తెలిపారు.

ఈడ వేసినం.. ఆడా ఓటేస్తం!

ఆసిఫాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈడ ఓటు వేసినం.. ఆడా ఎన్నికల్లోనూ ఓటేస్తం... మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు వివాదంలో ఉన్న 12 గ్రామాల్లోని ఓటర్ల ఉత్సాహమిది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలంలోని 12 గ్రామాలు.. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా రాజురా నియోజకవర్గం జీవతి తాలూకా పరిధిలో కూడా ఉన్నాయి. పరందోళి, అంతాపూర్, మహారాజ్‌గూడ, శంకర్‌లొద్ది, ముక్దంగూడ, లెండిగూడ, గౌరి, పద్మావతి, ఇసాపూర్, ఇందిరానగర్, బోలాపటార్ గ్రామాల ప్రజలకు ఇక్కడ తెలంగాణతోపాటు మహారాష్ట్రలోనూ ఓటు హక్కు ఉంది. ఈ 12 గ్రామాల్లోని ఓటర్ల కోసం మహారాష్ట్ర ఎన్నికల సంఘం పరందోళి, అంతాపూర్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అంతాపూర్‌లో 1,612 మంది, పరందోళిలో 1,422 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

నేడే 'మహా' పోలింగ్

న్యూఢిల్లీ, నవంబరు 19 : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. శాసనసభలోని మొత్తం 288 స్థానాలకు బుధవారం పోలింగ్ జరగనుంది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఓటింగ్ జరుగుతుంది. నవంబరు 23, శనివారం ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 9,70,25,119 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరి కోసం 1,00,186 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. కాగా, శివసేన(ఉద్ధవ్ థాక్రే వర్గం), ఎన్‌సీపీ(శరద్ పవార్ వర్గం), కాంగ్రెస్ పార్టీ కలిసి మహావికాస్ అఘాడీ పేరుతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తోంది. అలాగే, శివసేన(ఏక్‌నాథ్‌శిందే), ఎన్‌సీపీ(అజిత్‌పవార్), బీజేపీ కలిసి మహాయుతి పేరుతో పోటీ చేస్తున్నాయి. 149 నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీలో ఉండగా 101 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. శివసేన(ఉద్ధవ్ థాక్రే వర్గం) 95, ఎన్‌సీపీ(శరద్ పవార్ వర్గం) 86, శివసేన(ఏక్‌నాథ్ శిందే) 81, ఎన్‌సీపీ(అజిత్‌పవార్) 59 స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దించాయి. ఇది కాక, బీఎస్పీ 237 స్థానాల్లో పోటీ చేస్తుండగా ఎంఐఎం 17 స్థానాల్లో పోటీ పడుతోంది. అన్ని పార్టీలు, స్వతంత్రులు, రెబల్స్ కలిపి మొత్తం 4,136 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోలింగ్ కోసం ఎన్నికల సంఘం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. ఒక్క ముంబైలోనే 30వేల మందికిపైగా పోలీసులు ఎన్నికల విధు లు నిర్వహిస్తున్నారు. కాగా, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రెండో, తుది దశ ఎన్నికల పోలింగ్ బుధవారం జరగనుంది. 38 శాసనసభ స్థానాలకు బుధవారం ఓటింగ్ నిర్వహించి నవంబరు 23న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఝార్ఖండ్‌లోని 43 స్థానాలకు సంబంధించిన పోలింగ్(తొలి దశ ఎన్నికలు) నవంబరు 13న జరిగింది. మరోవైపు, బీజేపీ, శివసేన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న యూపీలోని 9 శాసనసభ స్థానాల ఉపఎన్నికకు పోలింగ్ కూడా బుధవారమే జరగనుంది. 23న ఓట్లను లెక్కిస్తారు. కాంగ్రెస్ ఈ పోటీకి దూరంగా ఉంది.

25 నుంచి పార్లమెంటు

» డిసెంబరు 20 దాకా సమావేశాలు

» 'ఒక దేశం-ఒకే ఎన్నిక', వక్ఫ్ బిల్లులే కీలకం

న్యూఢిల్లీ, నవంబరు 19: పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఈ నెల 25న ప్రారంభం కానున్నాయి. డిసెంబరు 20 వరకు జరుగనున్నాయి. వక్ఫ్ సవరణ బిల్లు, 'ఒక దేశం-ఒకే ఎన్నిక' బిల్లులను ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని మోదీ ప్రభుత్వం భావిస్తోంది. వీటిని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండీ కూటమి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నెల 23న మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్‌డీఏ, ఇండీ కూటమి ప్రతిష్ఠాత్మకంగా తలపడుతున్నాయి. మహారాష్ట్రలో ఎన్‌డీఏ పక్షాల ఆధ్వర్యంలో మహాయుతి ప్రభుత్వం నడుస్తుండగా.. జార్ఖండ్‌లో జేఎంఎం, కాంగ్రెస్ ప్రధాన పక్షాలుగా ఇండీ కూటమి అధికారంలో ఉంది. జార్ఖండ్‌లో ఎలాగైనా పాగా వేయాలని బీజేపీ భావిస్తుండగా.. మహారాష్ట్రలో తమ గెలుపు ఖాయమని కాంగ్రెస్, ఎన్‌సీపీ, ఉద్ధవ్ శివసేన ధీమాతో ఉన్నాయి. ఎవరు గెలుస్తారో 23న తేలనున్న నేపథ్యంలో శీతాకాల సమావేశాలకు ప్రాధాన్యం ఏర్పడింది. 24వ తేదీ ఆదివారం 11 గంటలకు పార్లమెంటు భవనంలో అఖిల పక్ష సమావేశం జరగనుంది. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మంగళవారం 'ఎక్స్'లో వెల్లడించారు. స్వతంత్ర భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లయిన సందర్భంగా ఈ నెల 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాలులో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

రోడ్లపై రక్త చరిత్ర!

గంటకు 20 మంది దుర్మరణం

» 2023లో రోడ్డు ప్రమాదాలపై కేంద్ర రవాణాశాఖ నివేదిక



న్యూఢిల్లీ, నవంబరు 19: దేశవ్యాప్తంగా రహదారులు రక్తమోడుతున్నాయని కేంద్ర రోడ్డు రవాణాశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. రోడ్డు ప్రమాదాల కారణంగా గంటకు 20 మంది ప్రాణాలు కోల్పోతున్నట్టు తెలిపింది. ఈ మేరకు 2023 సంవత్సరంలో దేశవ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాలపై తాజాగా ఓ నివేదికను వెలువరించింది. దీని ప్రకారం గత ఏడాది 4,80,583 రోడ్డు ప్రమాదాలు జరిగినట్టు తెలిపింది. 2022 సంవత్సరంతో పోల్చుకుంటే 2023లో 4.2 శాతం మేరకు ప్రమాదాలు పెరిగాయని వివరించింది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీ రహదారులు మృత్యు మార్గాలుగా మారాయని కేంద్రం ఆవేదన వ్యక్తం చేసింది. ఢిల్లీలో సగటున గంటకు 55 చొప్పున వాహనాలు ఢీ కొంటున్నాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలలో జరుగుతున్న ప్రమాదాల విషయానికి వస్తే ఢిల్లీలో అత్యధికంగా 1,457 మంది రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోయారు. ఇక, దేశంలో రోజుకు 26 మంది చిన్నారులు ప్రమాదాల్లో జీవితాలను కోల్పోతున్నారు. గత ఏడాది 9,489 మంది ప్రాణాలు కోల్పోయారు.

నివేదికలోని ముఖ్యాంశాలు..

- 2023లో రోడ్డు ప్రమాదాల కారణంగా 1,72,890 మంది చనిపపోయారు. 4,62,825మంది గాయపడ్డారు.
- 2022తో పోల్చుకుంటే మృతులు 2.6 శాతం, గాయాలపాలైన వారు 4.4 శాతం చొప్పున పెరిగారు.
- రాష్ట్రాల పరంగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లో 23,652 మంది, తమిళనాడులో 18,347 మంది, మహారాష్ట్రలో 15,366 మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారు. ప్రధాన నగరాల్లో చూస్తే ఢిల్లీలో 1,457 మంది చనిపోగా, తర్వాత స్థానాల్లో బెంగళూరు(915 మంది), జైపూర్(849 మంది) ఉన్నాయి.
- రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న రాష్ట్రాల్లో తమిళనాడు తొలిస్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో 2023లో 67,213 ప్రమాదాలు జరిగాయి.
- మితిమీరిన వేగం కారణంగా 68.1 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో ద్విచక్ర వాహనదారులే దాదాపు నగం మంది ఉన్నారు. మొత్తం మృతుల్లో వీరు 44.8 శాతం మంది ఉన్నారు.
- రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారిలో పాదచారులు 20% మంది ఉన్నారు.
- రహదారుల లోపం కారణంగా 4.9 శాతం మంది, వాహనాలు ఢీ కొనడం ద్వారా 59.3 శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారు.
- రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న వారిలో 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వారే ఎక్కువగా ఉంటున్నారు. వీరిలో పురుషులే ఎక్కువగా ఉంటున్నారని నివేదిక వెల్లడించింది.
- రహదారులపై మృతి చెందుతున్న వారిలో పురుషుల సంఖ్య 85.2 శాతంగా ఉండగా, మహిళల సంఖ్య 14.8 శాతంగా ఉంది.
- రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో గ్రామీణులు 68.4 శాతం మంది ఉండగా, పట్టణ ప్రాంతాలకు చెందిన వారు 31.5 శాతం మంది ఉన్నారు.
- ప్రపంచ రహదారుల గణాంకాలు-2020 ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో భారత్ తొలిస్థానంలో ఉంది.

అమెరికాకు మన విద్యార్థులు ఇచ్చింది..

అక్షరాలా రూ.లక్ష కోట్లు!

» అగ్రరాజ్యంలో 3.31 లక్షల మంది భారతీయుల విద్యాభ్యాసం

» 15 ఏళ్ల తర్వాత చైనాను దాటి నెంబర్‌వన్ స్థానంలో మనం



వాషింగ్టన్, నవంబరు 19: గతేడాది అమెరికా ఆర్థిక వ్యవస్థకు భారతీయ విద్యార్థులు 1180 కోట్ల డాలర్లు అందించారు. ఇది అక్షరాలా దాదాపు రూ.లక్ష కోట్లకు సమానం. కచ్చితంగా చెప్పాలంటే రూ.99,581 కోట్లు. అమెరికాలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థుల్లో భారతీయులే అత్యధికం. వారి సంఖ్య 3,31,692. గతేడాది కంటే ఇది 23% అధికం. సంఖ్యాపరంగా చైనాను (ఆ దేశ విద్యార్థులు 2.7 లక్షలు) కూడా ఈసారి మనం అధిగమించాం. గతంలో అమెరికాలో విదేశీ విద్యార్థుల పరంగా భారత్ నెంబర్‌వన్ స్థానంలో ఉండేది. కానీ, చైనా ఆ స్థానాన్ని కైవసం చేసుకుంది. 15 ఏళ్ల తర్వాత తిరిగి భారత్ అగ్రస్థానంలో నిలిచింది. 'ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్, 2024' పేరుతో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి విడుదలైన ఓపెన్‌డోర్స్ నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. అమెరికాలోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్' అనే సంస్థ ప్రభుత్వ సహకారంతో సర్వే జరిపి ఈ నివేదికను విడుదల చేస్తుంది. తాజాగా వచ్చిన నివేదిక ప్రకారం, ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికాకు వచ్చిన భారతీయ విద్యార్థుల్లో 64.5% మంది ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరగా, మిగిలిన 35.5% మంది ప్రైవేటు విద్యాసంస్థల్లో చేరారు. ఇక సబ్జెక్టుల వారీగా చూస్తే.. ఐటీ తదితర ఇంజనీరింగ్ కోర్సుల్లో 67.4% మంది, బిజినెస్ మేనేజిమెంట్‌లో 11.2% మంది, సైన్స్ కోర్సుల్లో 5.4% మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో గ్రాడ్యుయేట్ కోర్సులు చేస్తున్న వారే ఎక్కువ (దాదాపు రెండు లక్షల మంది). విద్యాభ్యాసం అనంతరం 'ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్' (ఓపీటీ)లో కొనసాగుతున్న వారి సంఖ్య కూడా గణనీయంగా ఉంది (దాదాపు లక్ష మంది). కాగా, భారత విద్యార్థుల సంఖ్య గతేడాదితో పోల్చితే 23% పెరగగా, చైనా విద్యార్థుల సంఖ్య 4% తగ్గటం విశేషం.

విదేశీ విద్యార్థులతో రూ.4.21 లక్షల కోట్లు

2023లో అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో 6% మంది (11 లక్షల మందికిపైగా) విదేశాల నుంచి వచ్చిన వారు. వీరంతా కలిసి ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు 5 వేల కోట్ల డాలర్ల (రూ.4,21,953 కోట్లు) భారీ మొత్తాన్ని అందజేశారు. అమెరికాలో విదేశీ విద్యార్థులు చదువుకుంటున్న టాప్-3 రాష్ట్రాల్లో కాలిఫోర్నియా, న్యూయార్క్, టెక్సాస్ ఉన్నాయి. భారత్, చైనా, బంగ్లాదేశ్, కొలంబియా, ఘనా, ఇటలీ, నేపాల్, పాకిస్థాన్, స్పెయిన్‌ల నుంచి ఎక్కువగా విద్యార్థులు అమెరికాకు తరలి వస్తున్నారు. ఇటీవలి కాలంలో ఆఫ్రికా దేశాల విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతోంది. దీనిపై అమెరికా విద్యా, సాంస్కృతిక వ్యవహారాల విభాగం సీనియర్ అధికారి స్కాట్ విన్‌హోల్డ్ స్పందిస్తూ.. 'అమెరికాలో విద్యాభ్యాసం ఆయా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దారి వేయటమే కాదు, పరస్పరం అనుసంధానమైన ప్రస్తుత ప్రపంచం భవిష్యత్తును కూడా తీర్చిదిద్దుతోంది' అని పేర్కొన్నారు. కాగా, అమెరికాలోనే కాదు.. బ్రిటన్‌లోనూ భారతీయ విద్యార్థులు సత్తా చాటుతున్నారు. ఆ దేశంలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థుల్లో 1.7 లక్షల మందితో భారతీయులే నెంబర్‌వన్ స్థానంలో ఉన్నారు.

ఢిల్లీ డేంజర్

(మొదటి పేజీ తరువాయి)



ఉన్న బంగ్లాదేశ్ రాజధాని ఢాకాతో పోలిస్తే.. ఢిల్లీలో 4 రెట్ల అధిక కాలుష్యం కొనసాగుతోంది. దీనిపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఎక్స్‌లో తీవ్రంగా స్పందించారు. "ఇలాంటి పరిస్థితుల్లో కూడా దేశ రాజధానిగా ఢిల్లీ కొనసాగాల్సిన వసరం ఉందా?" అని ప్రశ్నించారు. "ఈ విపత్కర పరిస్థితిని కొన్నేళ్లుగా చూస్తున్నాం. నవంబరు-జనవరి నెలల మధ్య అసలు ఈ నగరం నివాసయోగ్యంగానే ఉండడం లేదు. మిగతా సమయాల్లోనూ జీవనం కొనసాగించడం అంతంతమాత్రమే..! ఈ పరిణామాల మధ్య ఢిల్లీని ఇంకా రాజధానిగా కొనసాగించాలా?" అంటూ ట్వీట్ చేశారు. కాగా.. వాయు కాలుష్య తీవ్రత, విజిబులిటీ దారుణంగా ఉండడంతో ఢిల్లీలో 22 రైళ్లు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. గాలి నాణ్యత పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోనూ దారుణంగా తయారైంది. మంగళవారం ఉదయం నోయిడాలో ఈస్టర్న్-పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వేపై వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు ద్విచక్రవాహనదారులు మృతిచెందగా.. డజన్ల కొద్దీ వాహనదారులు గాయపడ్డారు. పానిపట్ నుంచి మథుర వెళ్తున్న ఓ బస్సు.. రోడ్డు పక్కన పార్క్ చేసిన ట్రక్కులను ఢీకొన్న ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. మరోవైపు, మధ్యప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, యూపీ, హరియాణా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు భారత వాతావరణ శాఖ పొగమంచు హెచ్చరికలను జారీ చేసింది. హరియాణాలో గాలి నాణ్యత పడిపోవడంతో.. బడులను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, రాజస్థాన్‌లో చలి తీవ్రత పెరిగింది. సికార్‌లోని ఫతేపూర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6.5 డిగ్రీలుగా నమోదయ్యాయి. భరత్‌పూర్‌లో విజిబిలిటీ 50 మీటర్లకంటే తక్కువగా ఉంది.

సమగ్ర ఇంటింటి సర్వే 83 శాతం పూర్తి

- 99 శాతంతో ములుగు ప్రథమం
- 50% తో జీహెచ్ఎంసీ చివరి స్థానంలో..

హైదరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతోన్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల గణన ఇంటింటి సర్వే 83.64 శాతం పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,16,14,349 ఇళ్లలో.. మంగళవారం వరకు 83,64,331 ఇళ్లలో సర్వే పూర్తయిందని ప్రభుత్వం ప్రకటించింది. అత్యధికంగా సర్వే పూర్తయిన జిల్లాల్లో 99 శాతంతో ములుగు ప్రథమ స్థానంలో నిలవగా, 95 శాతంతో నల్గొండ, 93.3 శాతంతో జనగాం తృతీయ స్థానంలో నిలిచాయి. 50.3 శాతంతో జీహెచ్ఎంసీ చివరి స్థానంలో ఉంది. 87,807 మంది సిబ్బంది, 8,788 మంది పర్యవేక్షక అధికారులు సర్వేలో పాల్గొంటున్నారు. సర్వేకు ప్రజల స్పందన బాగుందని అధికారులు అంటున్నారు.

ఏసీబీ అదుపులో అంతర్గాం తహసీల్దార్

- ఇసుక ట్రాక్టర్‌ను విడిచిపెట్టేందుకు రూ.25వేలు లంచం డిమాండ్

అంతర్గాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల తహసీల్దార్ రమేశ్‌ను ఆయన కార్యాలయంలోనే ఏసీబీ అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. లింగాపూర్ గ్రామ శివారులో గోదావరి నది నుంచి అక్టోబరు 28న రామగుండం పట్టణానికి చెందిన అలకుంట సంపత్ అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించారు. ట్రాక్టర్‌ను వదిలిపెట్టాలంటే రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుందని నిందితుడు సంపత్‌కు తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ శ్రీధర్ చెప్పారు. అంత మొత్తం చెల్లించలేనని సంపత్ బతిమిలాడగా.. రూ.25 వేల డీడీ తీయాలన్నారు. ఈ నెల 13న డీడీ పట్టుకుని సంపత్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా, తమకు కూడా రూ.25 వేలు ఇవ్వాలని తహసీల్దార్, ఆర్ఐ డిమాండ్ చేశారు. రూ.12 వేలకు ఒప్పందం కుదిరింది. అయితే, తహసీల్దార్, ఆర్ఐపై కరీంనగర్ ఏసీబీ అధికారులకు సంపత్ ఫిర్యాదు చేశాడు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రూ.12 వేలు ఆర్ఐ శ్రీధర్‌కు ఇచ్చాడు. శ్రీధర్ తహసీల్దార్ చాంబర్‌లోకి వెళ్తూ ఏసీబీ అధికారులను చూసి డబ్బులు కార్యాలయం బయట పడేసి పారిపోయాడు. తహసీల్దార్ లంచం డిమాండ్ చేసిన దృశ్యాలు బాధితుడి స్పై కెమెరాలో రికార్డు కావడంతో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తహసీల్దార్ రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఈ నెలాఖరుకు రైళ్లకు.. అదనంగా వెయ్యి బోగీలు

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నవంబరు చివరి నాటికి 370 రైళ్లకు అదనంగా 1000 జనరల్ కోచ్‌లను జత చేయనున్నట్టు రైల్వే అధికారులు తెలియజేశారు. ప్రయాణికుల డిమాండ్ పెరగడంతో గడిచిన మూడు నెలల కాలంలో 600 సాధారణ కోచ్‌లను అనుసంధానం చేసినట్టు వివరించారు. రానున్న రెండేళ్ల కాలంలో అదనంగా 10వేలకు పైగా జనరల్ కోచ్‌లను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ జీవో అక్రమం

చట్టప్రకారం నేరుగా ఉద్యోగాలను భర్తీచేయండి.. ఇప్పటికే క్రమబద్ధీకరించిన వారిని తొలగించాల్సిన పని లేదు: హైకోర్టు



హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-16పై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ జీవో ద్వారా 'తెలంగాణ రెగ్యులేషన్ ఆఫ్ అపాయింట్‌మెంట్స్ టు పబ్లిక్ సర్వీసెస్ అండ్ రేషనలైజేషన్ ఆఫ్ స్టాఫ్ ప్యాటర్న్ యాక్ట్-1994'లో చేర్చిన సెక్షన్-10ఏ అక్రమమని తేల్చి చెప్పింది. . జీవో ద్వారా చట్టంలో సవరణలు చేయడం/సెక్షన్లను చేర్చడం చెల్లదని, అది రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించింది. ఆ సెక్షన్‌ను కొట్టివేస్తున్నామని మంగళవారం స్పష్టం చేసింది. ఇప్పటి వరకు రెగ్యులరైజ్ చేసిన ఉద్యోగులను తొలగించాల్సిన అవసరం లేదని పేర్కొంది. జూనియర్ లెక్చరర్లు, పాలిటెక్నిక్, డిగ్రీ లెక్చరర్లు, ఇతర కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు 2016 ఫిబ్రవరి 26న అప్పటి సర్కారు జీవో-16ను జారీ చేసింది. కొలువులను నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయాలే తప్ప.. ఇలా క్రమబద్ధీకరించుకుంటూ పోతే.. ఉద్యోగార్థులకు అన్యాయం జరుగుతుందంటూ పలువురు నిరుద్యోగులు హైకోర్టులో వేర్వేరుగా ఆరు వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు ఫణిభూషన్, బి.రాజేశ్వరి, పి.రామశరణశర్మ, సురేందర్‌రావు, మాదిరాజు శ్రీనివాసరావు తదితరులు వాదనలను వినిపించారు. "అర్హులైన నిరుద్యోగులు తమ అర్హతలకు తగ్గట్లుగా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందాలన్న చట్టబద్ధమైన ఆకాంక్షను, ప్రాథమిక హక్కును ఉల్లంఘించేలా జీవో-16 ఉంది. చట్ట ప్రకారం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా కొలువులను భర్తీ చేయాలని. కానీ, దొడ్డిదారిన కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చెల్లదు. కాంట్రాక్ట్ ఉద్యోగుల భర్తీ విషయంలోనూ పారదర్శకమైన విధానాలను పాటించలేదు. నోటిఫికేషన్ లేదా కాంట్రాక్ట్ ఉద్యోగాల భర్తీ ప్రకటన(పత్రికల్లో అడ్వర్టైజ్‌మెంట్) ఇవ్వకుండా.. దొడ్డిదారిలో(బ్యాక్‌డోర్) ఉద్యోగులను నియమించుకున్నారు. అలా నియమితులైన వారి సేవలను క్రమబద్ధీకరించడం వల్ల అన్నిరకాల సర్వీసు నిబంధనలు, చట్టాలను తుంగలో తొక్కారు. పారదర్శక విధానం లేకుండా సర్వీసుల్లోకి వచ్చిన వారు.. క్రమబద్ధీకరణకు అనర్హులు" అని వ్యాఖ్యానించారు. అయితే.. రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు మాత్రం జీవో-16 ద్వారా చేర్చిన సెక్షన్-10ఏను సమర్థించారు. ఉమాదేవి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు లోబడే సెక్షన్-10ఏ మార్గదర్శకాలను జారీ చేసినట్లు వివరించారు. సుప్రీంకోర్టు కూడా 'వన్‌టైమ్ మెజర్' కింద క్రమబద్ధీకరణ సబబేనని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఇలా వన్‌టైమ్ మెజర్ కింద 5,544 పోస్టులను క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. "భవిష్యత్‌లో నేరుగా ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చాం. ఇది పిటిషనర్ల హక్కులకు భంగం వాటిల్లినట్లు కాదు" అని వివరించారు. రెగ్యులరైజ్ అయిన పలువురు ఉద్యోగుల తరఫు న్యాయవాది వ్లాదిమిర్ ఖటూన్ మాట్లాడుతూ.. క్రమబద్ధీకరణ అయిన 5,544 మంది ఉద్యోగులను ప్రతివాదులుగా చేర్చకుండా.. వారికి వ్యతిరేకంగా ఆదేశాలివ్వడం కుదరదని స్పష్టం చేశారు. గతంలో ఈ అంశంపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసిన విషయాన్ని గుర్తుచేశారు. వాదోపవాదాలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. జీవో-16 ద్వారా చేర్చిన సెక్షన్-10ఏ చట్ట విరుద్ధమని పేర్కొంటూ.. ఆ సెక్షన్‌ను కొట్టివేసింది. అయితే.. ఇప్పటికే ఈ సెక్షన్ మేరకు కొలువుల క్రమబద్ధీకరణ జరిగిన ఉద్యోగులను తొలగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇకపై ప్రభుత్వం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా కొలువులను భర్తీ చేయాలని.. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ సరికాదని హితవు పలికింది.

హైటెక్ సిటీలో 'ఎవర్ నార్త్'

- గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు
- మొదటి విడతలో వెయ్యిమందికి ఉద్యోగాలు

హైదరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలకు ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆరోగ్య సంరక్షణ రంగానికి టెక్నాలజీ సొల్యూషన్లు అందించే ప్రముఖ ఆరోగ్య సేవల సంస్థ ఎవర్‌నార్త్.. హైదరాబాద్ హైటెక్ సిటీలోని సాత్వా నాలెడ్జ్ పార్కులో ఏర్పాటు చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను (జీసీసీ) మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎవర్ నార్త్ 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యకలాపాలు నిర్వహిస్తుందని, తొలి దశలో వెయ్యిమందికి ఉద్యోగాలు కల్పిస్తుందని, పరోక్షంగా చాలామందికి ఉపాధి దొరుకుతుందని శ్రీధర్‌బాబు తెలిపారు. ఆరోగ్య సేవల రంగంలో ఆవిష్కరణలకు ఇది దోహదపడుతుందని వెల్లడించారు. ఎవర్ నార్త్ 1.9 కోట్ల మంది భారతీయులకు ఆరోగ్య సేవల సాంకేతికతను అందిస్తోందని, సంస్థకు 30 పైగా దేశాల్లో 75 వేలమంది ఉద్యోగులు, 18.6 కోట్ల వినియోగదారులు ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. కాగా.. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో ప్రతిభకు పదును పెట్టడమే లక్ష్యంగా తాము ప్రస్తుతం వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని కంపెనీ డైరెక్టర్ (హెచ్‌ఆర్) యదుకిశోర్ తెలిపారు. ఒక్కో బ్యాచ్‌లో 40 మంది చొప్పున విద్యార్థులకు హెల్త్‌కేర్ రంగానికి సంబంధించిన టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చి వారిలో మంచి ప్రతిభ గల వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటామని ఆయన చెప్పారు. మరిన్ని కళాశాలలతో ఇలాంటి భాగస్వామ్యాలు కుదుర్చుకునే యోచన ఉన్నదన్నారు.



ఎవర్ నార్త్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

నాపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టండి

కాటారం, నవంబరు 19: భూపాలపల్లి జిల్లా కాటారం మండలానికి చెందిన బీజేపీ నాయకుడు చల్లా నారాయణరెడ్డి తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, వాటిపై విచారణ చేపట్టి నిజాలు నిగ్గుతేల్చాని డీజీపీ జితేందర్‌కు మంత్రి శ్రీధర్‌బాబు ఫిర్యాదు చేశారు. మంథని నియోజకవర్గంలోని కొందరు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో ఏం మాట్లాడినా చెల్లుతుందనే ధోరణి పెరిగిపోయిందని, ఈ నీచ సంస్కృతికి చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు చేయించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరినట్లు వెల్లడించారు.

ఇంజన్, కల్టివేటర్ మధ్య నలిగి రైతు మృతి

- పొలం దున్నుతుండగా ట్రాక్టర్ పైకి లేచి ప్రమాదం
- భువనగిరి జిల్లాలో ఘటన



నర్సింహ(ఫైల్)



రామన్నపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ మీద పడి రైతు మృతిచెందిన ఘటన మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని తుమ్మలగూడెం గ్రామంలో జరిగింది. ఎస్ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రైతు పెద్దగోని నర్సింహ(54) జీవనోపాధి కోసం ట్రాక్టర్ కూడా నడుపుతుంటాడు. మంగళవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలం దున్నుతుండగా ట్రాక్టర్ ఇంజన్ ఒక్కసారిగా పైకిలేచి నర్సింహ మీద పడింది. ఈ ఘటనలో ఇంజన్‌కు వెనుక ఉన్న కల్టివేటర్ మధ్య ఇరుక్కున్న అతను అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. నర్సింహ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, నర్సింహకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

డీజీపీకి మంత్రి ఫిర్యాదు

తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టాలని శ్రీధర్‌బాబు విజ్ఞప్తి

కాటారం, నవంబరు 19: భూపాలపల్లి జిల్లా కాటారం మండలానికి చెందిన బీజేపీ నాయకుడు చల్లా నారాయణరెడ్డి తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, దీనిపై విచారణ చేపట్టి నిజనిజాలు నిగ్గుతేల్చాని డీజీపీ జితేందర్‌కు మంత్రి శ్రీధర్‌బాబు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. నిష్పక్షపాతంగా ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు చేయించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరినట్లు వెల్లడించారు. మంథని నియోజకవర్గంలోని కొందరు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం కుట్రలు చేసి నీచ సంస్కృతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో ఏది మాట్లాడినా చెల్లుతుందనే ధోరణి పెరిగిపోయిందని, దీనికి చరమగీతం పాడాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు.

అర్హతలేని వైద్యులు.. అక్రమ క్లినిక్‌లు

- మెడికల్ కౌన్సిల్ ఆకస్మిక తనిఖీల్లో బహిర్గతం
- ఖమ్మం జిల్లాలో 40మంది ఆర్ఎంపీలపై కేసు

ఖమ్మం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య మండలి(మెడికల్ కౌన్సిల్) ఖమ్మం జిల్లాలో చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో ఎంబీబీఎస్ అర్హత లేకుండానే కొంతమంది వ్యక్తులు క్లినిక్‌ల పేరిట ఏకంగా ఆస్పత్రులే నిర్వహిస్తున్న విషయం వెలుగులోకొచ్చింది. ఇందుకుగాను 41మంది రిజిష్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్(ఆర్ఎంపీ)లపై కేసు నమోదైంది. కేవలం ప్రాథమిక చికిత్సా కేంద్రాలు నిర్వహించాల్సిన ఆర్ఎంపీలు... మెడికల్ కౌన్సిల్ నిబంధనలు విరుద్ధంగా ఇంజక్షన్లు, ఫ్లూయిడ్స్ ఇవ్వడంతో పాటు అన్ని రకాల వైద్యసేవలు చేస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. విజిలెన్స్ అధికారి మామిడాల రాము ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు నిర్వహిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం ఖమ్మం సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఖమ్మం జిల్లా సెంట్రల్ క్రైం స్టేషన్(సీసీఎస్) పోలీసులు 41 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితులు ఖమ్మం పట్టణంలో 13మంది ఉండగా, ముదిగొండ, నేలకొండపల్లి, రఘునాథపాలెం, తల్లాడ తదితర ప్రాంతాల్లో మిగిలిన వారిని గుర్తించారు. అయితే ఆర్ఎంపీల అక్రమ క్లినిక్‌ల నిర్వహణపై జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోగా.. ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన మెడికల్ కౌన్సిల్ అధికారులని తప్పుబడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి... కౌన్సిల్ సభ్యులతో వాగ్వాదానికి దిగారన్న ప్రచారం జరుగుతోంది. తమకు సమాచారం ఇవ్వకుండా ఎలా తనిఖీలు చేస్తారంటూ కౌన్సిల్‌లోని కొంతమంది సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు వినికిడి. కాగా ఏకకాలంలో 41 మందిపై కేసు నమోదవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

పూడికతీతతో పైసలు

- ప్రాజెక్టుల పూడికతీతలో జాతీయ విధానం
- కడెం రిజర్వాయర్‌లో ప్రయోగాత్మకంగా అమలు
- మంత్రివర్గ ఉప సంఘం సిఫారసులకు ఆమోదం.. ప్రభుత్వ ఉత్తర్వులు

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ నీటి ప్రాజెక్టుల్లో పూడికతీత పనుల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఓ వైపు పూడికతీత పనులు చేపట్టి ప్రాజెక్టుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించడంతోపాటు పూడికతీతతో వచ్చిన ఇసుక, మట్టి విక్రయాలతో ఆదాయాన్ని సమకూర్చుకోవాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి మంత్రి వర్గ ఉప సంఘం చేసిన సిఫారసులకు, పూడికతీత పనుల్లో జాతీయ పూడికతీత విధానం అమలుకు ఆమోదం తెలిపింది. తొలుత కడెం రిజర్వాయర్‌లో ప్రయోగాత్మకంగా ఈ విధానాలను అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వుల(జీవో నెం 316)ను నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం జారీ చేశారు. పూడికతీతలో జాతీయ విధానాన్ని అమలు చేయడంపై అధ్యయనానికి ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం చేసిన ఆయా సిఫారసులను అక్టోబరు 26న మంత్రివర్గం ఆమోదించిన సంగతి తెలిసిందే.

ఆదాయం ఇలా..

రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో తీసే పూడికలో ఇసుక ఉంటే వాణిజ్య అవసరాలకు విక్రయిస్తారు. బంకమట్టి ఉంటే రైతులకు ఉచితంగా ఇస్తారు. అయితే, మట్టిని తరలించుకునే బాధ్యత రైతులదే. ఇక, మట్టిని పెళ్లల రూపంలో తయారు చేసి ఇటుకల తయారీ పరిశ్రమలకు విక్రయిస్తారు. ఆయా విధానాలను కడెం రిజర్వాయర్ పూడికతీత పనుల్లో అమలు చేసి.. ఫలితాల అనంతరం ఇతర ప్రాజెక్టుల వద్ద ఈ పద్ధతిని పాటించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం తెలంగాణ ఇంజనీరింగ్ పరిశోధన కేంద్రం(టీజీఈఆర్ఎల్) సహకారం తీసుకోనుంది. జలాశయంలో ఎంత పూడిక ఉంది ? ఇసుక, రాళ్లు, బంక మట్టి ఏమేరకు ఉన్నాయి ? వంటి వాటిపై టీజీఈఆర్ఎల్ అధ్యయనం చేసిన తర్వాత పూడికతీత ఆసక్తివ్యక్తీకరణ కోరుతూ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వనుంది. ఏటా నవంబరు లేదా డిసెంబరు నుంచి మరుసటి ఏడాది జూన్ మధ్య పూడికతీత పనులు నిర్వహించనున్నారు.

సాగర్‌లో 100 టీఎంసీలకు పైగా నష్టం

ఏళ్లుగా పేరుకుపోయిన పూడిక రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని తగ్గించేస్తోంది. ముఖ్యంగా 408 టీఎంసీల నీటి సామర్థ్యం కలిగిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూడిక వల్ల 108 టీఎంసీల మేర సామర్థ్యాన్ని కోల్పోయింది. 308 టీఎంసీల సామర్థ్యం కలిగిన శ్రీశైలం ప్రాజెక్టు 93 టీఎంసీల సామర్థ్యాన్ని కోల్పోయింది. నారాయణపూర్ ప్రాజెక్టు 26.84 శాతం, మంజీరా 36.79 శాతం, నిజాంసాగర్ 55.14 శాతం. జూరాల 19.23 శాతం. తుంగభద్ర 23.87 శాతం, శ్రీరాంసాగర్ 28.49 శాతం మేర నీటి నిల్వ సామర్థ్యాలను కోల్పోయాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మార్పు కోసం...

శ్రీలంక అధ్యక్షుడు అనురకుమార దిస్సనాయకే సోమవారం కొత్తమంత్రివర్గాన్ని నియమించారు. ప్రధానిగా హరిణి అమరసూర్యను కొనసాగించి, రక్షణ, ఆర్థికం వంటి కొన్ని కీలకమైన శాఖలు తన వద్దే ఉంచుకున్నారు. ఇరవైఒక్కమందితో కూడిన చిన్న మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడమంటే, ఖర్చులు తగ్గిస్తానని ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమేనని, ముప్పైమంది మంత్రులతో దేశాన్ని ఏలగలిగే అవకాశం ఉండికూడా, ఆయన ఈ సంఖ్యకే పరిమితం కావడం లంక ఆర్థికస్థితిపట్ల ఆయనకున్న భయాన్ని తెలియచేస్తోందని ఆయన పార్టీ జేవీపీ చెప్పుకుంటోంది. మంత్రివర్గంలో కొత్తమొఖాలు అనేకం. ముఖ్యంగా ఐదుగురు ప్రొఫెసర్లకు పదవులు దక్కడం విశేషం. మత్స్యశాఖమంత్రి రామలింగం తమిళంలో ప్రమాణస్వీకారం చేసి, అధ్యక్షులవారు మైనారిటీలకూ సముచిత ప్రాతినిథ్యం కల్పించారని గుర్తుచేశారు. మహిళాశిశు సంక్షేమశాఖ కూడా తమిళమూలాలున్న ఓ మహిళకు దక్కింది. అనురకుమారను తమ అధ్యక్షుడుగా ఇటీవలే ఎన్నుకున్న శ్రీలంక ప్రజలు రెండునెలల్లోనే జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో సైతం తిరుగులేని మెజారిటీని కట్టబెట్టిన విషయం తెలిసిందే.

పతనావస్థలో ఉన్న దేశాన్ని దిస్సనాయకే తిరిగి నిలబెట్టగలడన్న నమ్మకం ప్రజల్లో ఉంది. నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) అలయెన్స్‌కు జనం తిరుగులేని బలాన్ని ఇచ్చారు. కేవలం ముగ్గురు ఎంపీలున్న ఆయన ఇప్పుడు మూడువంతులు దాటిన మెజారిటీతో దేశాన్ని ఏలబోతున్నారు. 220 స్థానాలున్న సభలో ఆయన కూటమికి 160 కట్టబెట్టి, ప్రజలు అవధులు లేని అధికారాలు ఇచ్చారు. ప్రస్తుత ఎన్నికల విధానాన్ని రూపొందించుకున్న 1978 తరువాత, ఒక సంకీర్ణం ఇంతటి ఘనంగా నెగ్గుకురావడం ఎన్నడూ లేదు. మతాలు, జాతుల పరంగా చీలిపోయి, ముస్లింలు, తమిళులు, సింహాళీయుల మధ్య అవిశ్వాసం అధికంగా ఉండే లంక సమాజం ఈ ఎన్నికల్లో అద్భుతమైన ఐక్యతను ప్రదర్శించింది. అటు తమిళులు, ఇటు ముస్లింలు కూడా దిస్సనాయకే నాయకత్వం వహిస్తున్న ఒక సింహళపార్టీని, దాని కూటమిని ఇంతగా నమ్మడం ఆశ్చర్యం. అన్ని రకాల వివక్షలనూ, విభేదాలను పక్కనబెట్టి దేశప్రజలంతా ఒక్కటై తనకు బ్రహ్మరథం పడతారని దిస్సనాయకే కూడా ఊహించి వుండరు. తమిళుల కంచుకోటలను సైతం ఆయన బద్దలు కొట్టి, సంప్రదాయ తమిళపార్టీలను మట్టికరిపించిన తొలి సింహళపార్టీగా చరిత్ర సృష్టించారు.

లంక తమిళులు దిస్సనాయకేను ఇంతగా విశ్వసిస్తుంటే, వైగో మాత్రం ఈ పరిణామం వారికి తీవ్రమైన నష్టంచేస్తుందని, భారతప్రభుత్వం వెంటనే దిస్సనాయకే మీద ఒత్తిడితెచ్చి తమిళుల ప్రయోజనాలను పరిరక్షించాలని అంటున్నారు. దశాబ్దాల నాటి జనతా విముక్తి పెరుమన ప్రవర్తనను గమనించినప్పుడు సింహళ జాత్యహంకార పార్టీగా అది ఎన్నడూ తన తమిళవ్యతిరేకను దాచుకోలేదు, వారికి దక్కవలసిన అధికారాలూ ప్రయోజనాలూ దక్కనివ్వలేదు. భారత్–లంక ఒప్పందాన్ని అది తీవ్రంగా వ్యతిరేకించింది, తమిళులను ఊచకోతలను సమర్థించింది, వారికి ఏ విధమైన హక్కులూ ఉండకూడదని పోరాడింది. కానీ, ఇటీవల ఆ పార్టీ వైఖరిలోనూ, నాయకత్వంలోనూ మార్పువచ్చింది. దిస్సనాయకేను మార్క్సిస్టు అనేకంటే, ఆచరణవాది అనడం సముచితమని విశ్లేషకుల అభిప్రాయం. విమర్శకులు మాత్రం అవకాశవాది అంటారు.

దేశం అన్ని విధాలుగా దెబ్బతినివున్న స్థితిలో ప్రజలు దశాబ్దాలుగా రాజకీయాల్లో పాతుకుపోయి ఉన్న రాజపక్సేలు, విక్రమసింఘేలు, ప్రేమదాసలను ఏ మాత్రం విశ్వసించలేదని, వారిని అవమానకరంగా తరిమికొట్టారని ఈ ఫలితాలు తెలియచేస్తున్నాయి. రాజపక్సేలకు వ్యతిరేకంగా రెండేళ్ళ క్రితం సాగిన ప్రజాఉద్యమం (అరగాలయ)లో ఇప్పటి ఎన్‌పిపి భాగస్వామ్య పక్షాలు కీలకభూమిక నిర్వహించిన విషయం తెలిసిందే. ఒక సమూలమైన మార్పు, కొత్త రాజకీయ సంస్కృతికి హామీ పడుతూ సాగిన ఈ ఉద్యమం తమిళులను, ముస్లింలను దగ్గరకు తీసుకుంది, వారిలో విశ్వాసాన్ని నెలకొల్పింది. లంకప్రజలు ఇప్పుడు ఎన్నడూ లేనంత సంఘటితంగా ఉన్నారు. శ్రీలంకను ఒడ్డునపడేయడానికి దిస్సనాయకేకు విస్తృతమైన అధికారాలు ఇచ్చారు. అప్పుల ఊబిలో మునిగి, ప్రధానంగా చైనా కబంధ హస్తాల్లో చిక్కుకొనివున్న లంకను కాపాడాల్సిన బాధ్యత ఆయనమీద ఉంది. తమిళులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు, భారత్‌తో సత్సంబంధాలు నెలకొల్పుకోవడం ఆయనకు మరింత అవసరం.

బంగ్లా చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తున్నారని జార్ఖండ్ సర్కార్‌ను మోదీ ప్రభుత్వం నిందిస్తోంది. మరి ఆ అక్రమ వలసకారులు మన దేశ భూభాగంలో అడుగుపెడుతుండగా, సరిహద్దు సమీప భూభాగాలపై అజమాయిషీ ఉన్న కేంద్రం, ఎందుకు అడ్డుకోలేకపోయింది?

రాజకీయ అస్త్రాలుగా 'చొరబాట్లు'

దేశ సరిహద్దుల భద్రత అనేది ప్రపంచంలోని ఏ దేశానికైనా అత్యంత కీలకం, ప్రాధాన్యమున్న అంశం. ఒక్క భూమార్గంలోనే కాకుండా జల, ఆకాశ మార్గాలలో కూడా పహారా కాస్తుంటారు. ముంబాయి, న్యూఢిల్లీల కంటే కూడా ఎక్కువగా జార్ఖండ్ – పశ్చిమ బెంగాల్ గగనంలో ఎగిరే ప్రతి పక్షిపై సైతం భారత వాయుసేన కన్నేసి ఉంచుతుంది అంటే ఆశ్చర్యం కలుగుతుంది. దేశ సరిహద్దులను కాపాడటం సాయుధ బలగాల విధి. ఈ దృష్ట్యా భారతదేశ సరిహద్దుల భద్రత అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం.

సరిహద్దుల ఆవలి వైపు నుండి ఎవరైనా అక్రమంగా మన మాతృభూమికి అడ్డదారిన వస్తున్నారంటే అది ఒక రకమైన భద్రతా వైఫల్యం. కేంద్రంలో గత పదేళ్లుగా నరేంద్ర మోదీ ప్రభుత్వం అక్రమ చొరబాటుదారుల విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తోంది. ప్రత్యేకించి ఎన్నికల సందర్భంగా చొరబాటుదారుల గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ ఆ తర్వాత మిన్నకుండిపోతుంది! సరిహద్దుల్లోని అస్సాం, పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో ఖుస్పైటియా (చొరబాటుదారులు)ల గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదే పదే ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇప్పుడు సరిహద్దు రాష్ట్రాలు దాటి వాటిని ఆనుకుని ఉన్న రాష్ట్రాలలో కూడ చొరబాటుదారులు అనే ఒక అంశాన్ని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ శ్రేణులు ఎన్నికల ప్రచారాస్త్రంగా వాడుకుంటున్నారు. జార్ఖండ్ శాసనసభ ఎన్నికలలో కేవలం బంగ్లాదేశ్ చొరబాటుదారులు అనే ఏకైక అంశం ఆధారంగా బీజేపీ అగ్రనాయకత్వం ప్రచారం చేస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దేశంలో కెల్లా ఎక్కువ ఖనిజ సంపద ఉన్న రాష్ట్రంగా ఉన్నా పేదరికంలో ముగ్గుతున్న జార్ఖండ్‌లో అభివృద్ధి, సంక్షేమంకు బదులుగా చొరబాటుదారులు అనే అంశాన్నే కమలనాథులు ప్రచారాస్త్రంగా ఉపయోగించుకుంటున్నారు.

గల్ఫ్ లేఖ

ప్రాంతీయ రాజకీయ పక్షాలకు సైద్ధాంతిక విరోధి అయిన బీజేపీ జార్ఖండ్ రాష్ట్రంలోని బలీయమైన జె.యం.యం.ను రాజకీయంగా నిలువరించడానికి విస్తృతంగా చేస్తున్న చొరబాటుదారుల ప్రచారం, ఒక రకంగా, దేశ సరిహద్దులపై నిరంతరం పహరా కాస్తూ మాతృభూమి రక్షణకై ప్రాణాలు అర్పించే వీర జవాన్‌లను అవమానపరచడమే కాదూ? అంతర్జాతీయ సరిహద్దులు కలిగిన రాష్ట్రాలలో సాధారణంగా, సరిహద్దులకు సమీపంలో ఉన్న భూభాగం కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలో ఉంటుంది. ఆ విధంగా




పశ్చిమ బెంగాల్‌లో బంగ్లాదేశ్ సరిహద్దుకు 50 కిలోమీటర్ల దూరం వరకు భారత భూభాగం రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో కాకుండా కేంద్ర హోం శాఖ అధీనంలో ఉంటుంది. మరి బంగ్లాదేశ్ చొరబాటుదారులు అమిత్ షా అజమాయిషీలోని 50 కిలోమీటర్ల దూరాన్ని సురక్షితంగా దాటితే గానీ మమత బెనర్జీ రాష్ట్రానికి, ఆ తరువాత దాన్ని దాటి జార్ఖండ్‌కు చేరుకోలేరు కదా.

అక్రమంగా, అడ్డదారిన ఒక్క జార్ఖండే అని ఏమిటి, దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రానికి అయినా ఎవరైనా విదేశీయులు వస్తే నిస్సందేహంగా అడ్డుకోవాలి, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండకూడదు. అయితే చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తున్నారని జార్ఖండ్ సర్కార్‌ను నిందిస్తున్న కేంద్రం, మరి చొరబాటుదారులు దేశ భూభాగంలో అడుగు పెడుతుండగా ఎందుకు అడ్డుకోలేకపోయింది? ఇదీ ఇప్పుడు అడగవలసిన ప్రశ్న.

అధికారికంగా, దర్జగా వీసా పొంది భారత్‌లోకి అడుగుపెట్టే అవకాశం ఉన్నప్పుడు అడ్డదారిన ఎవరు, ఎందుకు వస్తారు? ఇక అధికారికంగా గమనిస్తే, ప్రపంచంలోకెల్లా అత్యధిక భారతీయ వీసాలు పొందే దేశం బంగ్లాదేశ్. ఆశ్చర్యం ఏమిటంటే అత్యంత సన్నిహిత దేశానికి మాత్రమే వీసా రుసుం చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది, బంగ్లాదేశీయులు ఒక్క రూపాయి కూడ చెల్లించవల్సిన అవసరం లేకుండా భారతీయ వీసా పొందె అవకాశాన్ని మోదీ సర్కారు కల్పించింది. ఈ రకంగా సందర్శక వీసాలు పొందినవారు తమ దేశానికి తిరిగి వెళ్లిపోతారు. అయితే ఒకవేళ ఆఫ్రికన్ల తరహా భారతదేశంలో తిష్ఠ వేస్తే వారిని గుర్తించి, పట్టుకుని వెనక్కి పంపే నిఘా వ్యవస్థ ఎంత వరకు పని చేస్తుందనేది కూడా ఒక ప్రశ్నే.

ఆదివాసీ తెగల సంఖ్య తగ్గిపోతుందని బీజేపీ చేస్తున్న వాదన సరైనదే. అయితే ఈ పరిస్థితి ఒక్క జార్ఖండ్‌కే పరిమితం కాలేదు. తెలుగునాట ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఛత్తీస్‌ఘడ్ దాకా గిరిజనుల ప్రాబల్యం అన్ని ప్రాంతాలలోనూ తగ్గిపోయింది. కారణమేమిటి? అటవీ ప్రాంతాలలో అభివృద్ధి కొరవడి జీవనోపాధికై మైదాన ప్రాంతాలకు వలసలు వెళ్ళడం వలన గిరిజనుల జనాభా తగ్గిపోతోంది.

కేవలం బెంగాలీ భాష మాట్లాడుతున్నందుకు భూమి పుత్రులు అయిన స్థానికులను కూడ మతం ఆధారంగా బంగ్లాదేశీయులు అని ముద్ర వేస్తున్నారు. ఇది ఆందోళనకరం. జార్ఖండ్ ఓటర్లలో సగభాగంగా ఉన్న ఆదివాసీ, ముస్లిం ఓటర్లలో అత్యధికులు హేమంత్ సోరెన్ నాయకత్వానికి బాసటగా నిలుస్తున్నారన్న రాజకీయ అక్కసుతో బీజేపీ నాయకత్వం బంగ్లా చొరబాటుదారుల అంశాన్ని ప్రస్తావిస్తుందని విమర్శకులు చేస్తున్న వాదనలో సహేతుకత ఉంది.

చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి, దీనిపై ఎవరికీ ఆక్షేపణ లేదు. అయితే చొరబాట్లను ప్రతి ఎన్నికలలో ఒక రాజకీయ అంశంగా ప్రస్తావించడం దేనిని సూచిస్తుంది? చొరబాట్లను నిర్మూలించలేమనే కాదూ? ఇది ఓటర్లకు ఒక తప్పుడు సంకేతం పంపుతుంది. అంతే కాదు, దేశ సరిహద్దుల రక్షణకు నిరంతరం అప్రమత్తంగా శ్రమించే వీర జవాన్ల త్యాగాలను అవమానించడమే అవుతుంది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

హస్తినలో తెలుగు నేతల హల్‌చల్



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

తెలుగుదేశం కేంద్రంలో కీలక పాత్ర పోషించడం ఇది మొదటిసారి కాదు. 1989లో ఎన్టీఆర్ హయాంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించాం. 1996–1998 మధ్యలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలోనూ, ఆ తర్వాత ఆరున్నర సంవత్సరాలు వాజపేయి ప్రభుత్వంలోనూ తెలుగుదేశం ప్రధాన భూమిక నిర్వహించింది. పార్లమెంట్‌లో ఒకప్పుడు ప్రతిపక్ష పాత్ర పోషించిన ఏకైక ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం. ఆ సమయంలో బీజేపీకి రెండు సీట్లు లభిస్తే తెలుగుదేశంకు 35 సీట్లు లభించాయి' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత వారం హిందూస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సమ్మిట్‌లో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నిజంగా అవి దేశ రాజధానిలో తెలుగువారికి సంబంధించి బంగారు రోజులు. తొలుత ఎన్టీఆర్‌ను, తర్వాత చంద్రబాబునాయుడును కలుసుకునేందుకు జాతీయ స్థాయి నేతలు ఆసక్తి ప్రదర్శించిన రోజులవి. యునైటెడ్ ఫ్రంట్ రోజుల్లో చంద్రబాబునాయుడు బస చేసే ఏపీ భవన్ ఫ్రంట్ ప్రధాన కార్యాలయంలా ఉండేది. వాజపేయి కూడా అనేక కీలక అంశాలపై ఆయనతో చర్చించేవారు. తరుచూ రాష్ట్ర సమస్యలను పరిష్కరించేందుకేకాక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకోసం చంద్రబాబు తరుచూ వచ్చి సుడిగాలిలా కేంద్ర మంత్రులను కలిసేవారు. ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్లు పారిశ్రామికవేత్తలను ఆకర్షించేవి. ఎన్నోసార్లు ఆయన జాతీయ స్థాయిలో జరిగిన మీడియా సదస్సుల్లో పాల్గొనేవారు.

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మరోసారి తెలుగుదేశం పార్టీకి జాతీయ స్థాయిలో ప్రాధాన్యత ఏర్పడింది. హిందుస్థాన్ టైమ్స్ మాత్రమే కాదు, మరో జాతీయ పత్రిక 'ఇండియా టుడే' కూడా దేశంలో అత్యంత శక్తిమంతులైన పది మంది నాయకుల్లో ఒకరుగా చంద్రబాబును గుర్తించింది. తెలుగుదేశంకు చెందిన 16 మంది ఎంపీలు లేకపోతే మోదీ ప్రభుత్వం మెజారిటీకి చేరువలోకి వచ్చేది కాదని ఇండియా టుడే పేర్కొంది. దేశంలో అత్యంత సీనియర్ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు బూడిదలోంచి పునరుత్థానమయ్యే ఫీనిక్స్ పక్షిలా మళ్లీ జాతీయ స్థాయిలో ప్రత్యక్షమయ్యారని ఆ పత్రిక ప్రశంసించింది. ఆయన హయాంలో స్థాపించిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, ఆయన కలలు కంటున్న స్వర్ణాంధ్రప్రదేశ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది.


చంద్రబాబునాయుడు మాదిరి ఢిల్లీలో చర్చకు వచ్చిన తెలుగు రాష్ట్రాల అధినేతలు తక్కువే. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 33 మంది ఎంపీలు రాష్ట్రం నుంచి గెలిచినప్పటికీ ఆయన రాష్ట్ర రాజకీయాలకే పరిమితమయ్యేవారు. జాతీయ సదస్సుల్లో ఆయన ఏనాడూ పాల్గొనలేదు. యూపీఏ హయాంలో భాగస్వామిగా ఉన్న కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నప్పటికీ ఏనాడూ జాతీయ స్థాయిలో తన ముద్ర వేసేందుకు ప్రయత్నించలేదు. కేంద్ర మంత్రిగా ఆయన తన మంత్రిత్వశాఖకు కూడా పెద్దగా హాజరు కాలేదు. ఆ విషయం పార్లమెంట్‌లో కూడా చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో ఆయన ఢిల్లీ వచ్చి జాతీయ మీడియాతో మాట్లాడిన సందర్భాలు అతి తక్కువ. ఫెడరల్ ఫ్రంట్ గురించి మాట్లాడినప్పుడు, పార్టీని బీఆర్ఎస్‌గా మార్చినప్పుడు కూడా జాతీయ మీడియా అంతగా చర్చించలేదు. ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కేసీఆర్ రోజుల తరబడి తుగ్లక్ రోడ్ నివాసంలో ఉన్నప్పటికీ ఆయనను ఎవరూ పట్టించుకోలేదు. నిజానికి తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు బాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగిన శక్తి ఉన్నప్పటికీ ఢిల్లీలో మీడియాతో ఎందుకు మాట్లాడడం లేదని నేను ఒకసారి అడిగితే ఆయన ఆ అవసరం లేదని కొట్టిపారేశారు. 22 మంది ఎంపీలు ఉన్నప్పటికీ వైసీపీ అధినేత జగన్ కూడా కేసీఆర్ మాదిరి కూపస్తమండూకంలా వ్యవహరించారు. ఏపీలో అభివృద్ధి గురించి మాట్లాడేందుకు కానీ, పెట్టుబడులను ఆహ్వానించేందుకు కానీ ఆయన ఏనాడూ ప్రయత్నించలేదు. వ్యక్తిగత ప్రయోజనాలకోసం, కేసుల కోసం మాత్రమే ఆయన నరేంద్రమోదీ, అమిత్ షాలను కలుసుకునేందుకు వచ్చేవారు. వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్న విజయసాయిరెడ్డి మోదీ దృష్టిలో పడేందుకు మాత్రమే తాపత్రయపడేవారు. మిగతా ఎంపీలు కూడా అస్తిత్వం లేనట్లే ఉండేవారు. పోనీ గత అయిదేళ్లలో ఏ-1, ఏ-2లపై ఉన్న కేసుల్లో ఒక్క సెక్షన్ అయినా తగ్గించుకోగలిగారా అంటే అదీ లేదు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే తెలుగు రాష్ట్రాల్లో మరో ముఖ్యమైన నేతగా గుర్తింపు పొందిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్ల కూడా ఢిల్లీలో రాజకీయ వర్గాలు, మీడియా ఆసక్తి ప్రదర్శించడం. కేసీఆర్‌ను ఓడించడంలో రెండుసార్లు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు విఫలమైన తర్వాత రేవంత్‌రెడ్డి వెలుగులోకి రాగలిగారు. అనతి కాలంలోనే వివిధ రాష్ట్రాలకు చెందిన వృద్ధ నేతలు తమ స్వంత రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తేలేక చతికిలపడ్డ సమయంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చి ఆ పార్టీకి భవిష్యత్తుపై ఆశ కల్పించారు. బీజేపీ 240 సీట్లు దాటదని సార్వత్రిక ఎన్నికల ముందు ఇండియా టీవీ రజత్ శర్మ షోలో ప్రకటించిన తర్వాత జాతీయ మీడియా దృష్టిలో పడ్డారు. రేవంత్ హిందీ, ఇంగ్లీషుల్లో అనర్గళంగా మాట్లాడుతూ ఎదురు దాడులు చేయగలగడంతో కాంగ్రెస్ పార్టీ ఆయనను మహారాష్ట్రలో స్టార్ కాంపైనర్‌గా కూడా మొహరించింది. తెలంగాణలో కాంగ్రెస్ హయాంలో పథకాలను అమలు చేయడం లేదన్న మోదీ ఆరోపణలను ఆయన తిప్పికొట్టడమే కాక, మహారాష్ట్రకు రావల్సిన ప్రాజెక్టులను గుజరాత్ తరలించుకుపోవడాన్ని ఎత్తి చూపి బీజేపీ ఆగ్రహానికి గురయ్యారు. కాంగ్రెస్ రాజకీయాల్లో జాతీయ స్థాయిలో భవిష్యత్తు ఉన్న నేతల్లో ఒకరుగా ఆయన ఇప్పటికే గుర్తింపు పొందారు.

ఈ రీత్యా ఢిల్లీలో చాలా కాలం తర్వాత తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు ముఖ్యమంత్రులు ఒకరు ఎన్డీఏలోనూ, మరొకరు కాంగ్రెస్‌లోనూ కీలకపాత్ర పోషిస్తుండడం గమనార్హం. కాని ఢిల్లీలో ఎంతగా గుర్తింపు పొందినప్పటికీ చంద్రబాబుతో పోలిస్తే రేవంత్‌కు ఉన్న అవరోధాలు ఎన్నో. ఇది ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీకీ ఉన్న తేడా లాంటిది. చంద్రబాబు మాదిరి రేవంత్ ఢిల్లీలో ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించడం లేదు. అంతేకాక చంద్రబాబు ఒక ప్రాంతీయ పార్టీ అధినేత. పూర్తి పార్టీ ఆయన పట్టులో ఉంటుంది. వైసీపీలో ఎవరైనా విమర్శించినా, ఆఖరుకు సోషల్ మీడియాలో దుమ్మెత్తిపోసినా అందుకు బలమైన జవాబు ఇచ్చేందుకు తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. చంద్రబాబు తనకు కావల్సిన టీమ్‌ను ఏర్పర్చుకోగలరు. అధికార యంత్రాంగంపై పట్టుబిగించగలిగిన శక్తి ఆయనకు ఉన్నది. కాంగ్రెస్ అనే ఒక పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలో రేవంత్ ఉన్నారు. కనుక రాష్ట్ర పార్టీపై ఆయన పట్టు అంతగా బిగించలేకపోతున్నారు. రేవంత్‌ను ఎవరైనా విమర్శిస్తే అంతే స్థాయిలో విరుచుకుపడే సీనియర్ నేతలు పెద్దగా లేరు. అంతేకాక ప్రత్యర్థులు విమర్శిస్తుంటే అందుకు ఒకటి రెండు విమర్శలు జోడించి ఢిల్లీకి చేరవేసేవారు ఎక్కువగా ఉంటారు. అధికారులను, టీమ్‌ను ఎంచుకోవడంలో కూడా చంద్రబాబుకున్న సౌలభ్యం ఆయనకు లేదు. ఏది ఎక్కడి నుంచి లీక్ అవుతున్నదో కూడా చెప్పడం కష్టం. అయినప్పటికీ తనకున్న పరిమితులను అధిగమించేందుకు ఆయన ప్రయత్నిస్తూనే ఉన్నారు. 'కాంగ్రెస్ ప్రస్తుత ఫార్మాట్‌ను మార్చాల్సిన అవసరం ఉన్నది. ట్వంటీ ఓవర్ల మాచ్‌లో ఆడాల్సినట్లు ఆడే బదులు ఇంకా టెస్ట్ మ్యాచ్ మాదిరి ఆడుతున్నాం' అని కాంగ్రెస్ పార్టీలో ఉన్న లోపాల గురించి ఎక్స్‌ప్రెస్ అడ్డా షోలో ధైర్యంగా చెప్పగలగడం రేవంత్‌కే సాధ్యమైంది.

చంద్రబాబు, రేవంత్‌ల తర్వాత ఢిల్లీలో బీఆర్ఎస్ నేత కేటీఆర్ ప్రవేశించి రంగంలోకి దిగడం మరో ఆసక్తికరమైన పరిణామం. అమృత్ టెండర్లు, లగచర్ల ఘటనల గురించి ఆయన గత వారం రోజుల్లో రెండుసార్లు ఢిల్లీలో జాతీయ మీడియాలో మాట్లాడారు. ఆశ్చర్యకరంగా కేటీఆర్‌కు జాతీయ మీడియా కీలక ప్రాధాన్యత నిచ్చింది. కనీసం డజన్ ఛానళ్లు ఆయనతో ముఖాముఖి ఇంటర్వ్యూలు చేశాయి. ఆయన కూడా ఇంగ్లీషు, హిందీలో అనర్గళంగా మాట్లాడగలరు. మహారాష్ట్ర ఎన్నికల సమయంలో ఆయన రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలను విమర్శించడం, అదే సమయంలో రాష్ట్ర బీజేపీ నేతలు కూడా లగచర్ల ఘటనపై విరుచుకుపడడం యాదృచ్ఛికం కాదు. నిజానికి కేసీఆర్ హయాంలో కూడా మల్లన్నసాగర్ వంటి ఘటనలు జరిగినప్పటికీ కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీలో పెద్దగా మాట్లాడలేదు సరికదా, జాతీయ మీడియాలో సైతం చర్చకు రాలేదు. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఢిల్లీ మద్యం కుంభకోణంలో అప్రతిష్టపాలు కావడం, తమ పుట్టల్లో పాములేమున్నాయా అని రేవంత్‌రెడ్డి సర్కార్ త్రవ్వే యత్నం చేయడంతో బీఆర్ఎస్ జీవన్మరణ సమస్యలో పడింది. అందువల్ల కేటీఆర్ ఢిల్లీలో ప్రవేశించి ఊరూవాడ ఏకం చేసి మద్దతు కోసం ప్రయత్నించడంలో ఆశ్చర్యం లేదు. కాంగ్రెస్ కంటే ఎక్కువగా సోషల్ మీడియాపై కేటీఆర్ పట్టు బిగించినట్లు స్పష్టమవుతోంది. గత రెండు నెలలుగా కేసీఆర్ ఏమి చేస్తున్నారో తెలియకపోవడంతో పార్టీ పగ్గాలు పూర్తిగా కేటీఆర్ చేతుల్లోకి వచ్చాయన్న విషయం స్పష్టమవుతోంది. అయితేనేం, కనీసం నాలుగు సంవత్సరాలు ఆయన పోరాడక తప్పదు. కాని మహారాష్ట్ర ఎన్నికల తర్వాత బీజేపీ జాతీయ నాయకత్వం పూర్తిస్థాయి దృష్టి కేంద్రీకరిస్తే తెలంగాణ రాజకీయాలు మరో మలుపు తిరిగే అవకాశాలున్నాయి. ఇంటగెలిచిన తర్వాతే రచ్చగెలుచుకోగలమని చంద్రబాబు ఎప్పుడో గ్రహించారు. రేవంత్ ఇంకా తెలుసుకోవాల్సి ఉన్నది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



గత రెండు నెలలుగా కేసీఆర్ ఏమి చేస్తున్నారో తెలియకపోవడంతో పార్టీ పగ్గాలు పూర్తిగా కేటీఆర్ చేతుల్లోకి వచ్చాయన్న విషయం స్పష్టమవుతోంది. అయితేనేం, కనీసం నాలుగు సంవత్సరాలు ఆయన పోరాడక తప్పదు. మహారాష్ట్ర ఎన్నికల తర్వాత బీజేపీ జాతీయ నాయకత్వం పూర్తి స్థాయి దృష్టి కేంద్రీకరిస్తే తెలంగాణ రాజకీయాలు మరో మలుపు తిరిగే అవకాశాలున్నాయి. ఇంటగెలిచిన తర్వాతే రచ్చగెలుచుకోగలమని చంద్రబాబు ఎప్పుడో గ్రహించారు. రేవంత్ ఇంకా తెలుసుకోవాల్సి ఉన్నది.

పిల్లలకు స్థైర్యం నేర్పుదాం!

1959 నవంబర్ 20న బాలల హక్కుల ఒప్పందాన్ని ఆమోదించిన సందర్భంగా ఐక్యరాజ్యసమితి ఆ తేదీని 'ప్రపంచ బాలల దినోత్సవం'గా గుర్తించింది. ఈ ఏటి బాలల దినోత్సవాన 'భవిష్యత్తును వినండి' అంటూ పెద్దలకు పిలుపునిచ్చారు. బాలల ఆలోచనలకు, ప్రాధాన్యతలకు అనుకూలంగా పెద్దల చర్యలు ఉండాలంటే మరి వారు పిల్లలు చెప్పేది వినాల్సిందే!

ఏ దేశానికైనా అత్యంత విలువైన ఆస్తి పిల్లలే. భారత జనాభాలో 40 శాతం మంది 18 ఏళ్ల లోపు బాలలే. అయితే, జాతీయ నేర రికార్డుల బ్యూరో లెక్కల ప్రకారం, 2022లో బాలలపై 1,62,449 నేరాలు నమోదయ్యాయి. అంటే ప్రతి నాలుగు నిమిషాలకు పిల్లలపై ఒక నేరం జరుగుతున్నది. 2021తో పోలిస్తే సాధారణ నేరాలు 4.5శాతం తగ్గాయి. కానీ బాలలపై నేరాలు మాత్రం 8.7శాతం పెరిగాయి. మరోవైపు విద్యార్థుల ఆత్మహత్యలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. 2022లో పది వేల మంది బాలలు ఆత్మహత్య చేసుకున్నారు!

ఇలాంటి పరిస్థితుల్లో మనం బాలలకు వ్యాకరణంలా, గణితంలా స్థైర్యాన్ని కూడా బోధించక తప్పదు. చిన్నతనం నుండే అపారమైన సవాళ్లను అధిగమించిన వ్యక్తుల స్ఫూర్తిదాయక జీవిత చరిత్రలు బాలలను సాహసవంతులుగా మార్చగలవు. వారిని వారు రక్షించుకోవటమే కాదు, ఇతరులనూ కాపాడగలిగే స్థైర్యాన్ని నింపగలవు. ఇలాంటి స్థైర్యాన్ని ప్రదర్శించిన వారిని ప్రభుత్వమూ విధిగా గుర్తించాలి. ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వాలు సాహస బాలలను గుర్తించి అవార్డులతో సత్కరించాలి. వారి సాహస గాథలను ప్రచారం చేయాలి. బాలకృష్ణుడి వలె ప్రమాదాల నుంచి క్షేమంగా తప్పుకొనే నైపుణ్యాన్ని బాలలకు నేర్పించాలి.

ఉదాహరణకు నేరాలు ఒంటరి బాలలపై జరుగుతాయి. కాబట్టి పిల్లలు స్నేహితులతో కలిసి తిరగడం కీలకం. ఒక్కరు తోడున్నా నేరం జరిగే అవకాశాలు బాగా తగ్గుతాయి. 'వద్దు' అని స్థిరంగా చెప్పగలగటం, 'కాపాడండి' అని గట్టిగా అరవడం, వేగంగా పరుగెత్తడం, చొరవతో సాయం కోరడం... వంటివి పిల్లలకు నేర్పాలి. బాలల వయసు బట్టి ఈ నైపుణ్యాల బోధన ఆధారపడి ఉండాలి. అలాగే 100, 1098 వంటి హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయడం, సహాయక ఏప్‌లను వినియోగించడం సాధ్యమైనంత త్వరగా పిల్లలకు నేర్పాలి. జట్టుగా ఆడే ఆటల్లో పాల్గొనటం, సేవా కార్యక్రమాలలో భాగస్వాములవడం కూడా బాలల్లో స్థైర్యాన్ని నింపుతాయి. బాలల పత్రికలు, బాలల చలన చిత్రాల పాత్ర కూడా ఎంతో కీలకం.

ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు లేవు. కాబట్టి ఏ సమస్య వచ్చినా పిల్లలు తల్లిదండ్రులకు మాత్రమే చెప్పుకోగలరు. నిస్సంకోచంగా అలా చెప్పుకునే అవకాశం వారికి ఉండాలి. అందుకు తగ్గట్టుగా తల్లిదండ్రులు పిల్లలతో స్నేహంగా మెలగాలి. "భారతదేశం నా మాతృభూమి" అనీ "నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్నీ గౌరవిస్తాను" అనీ ప్రతి రోజూ మన స్కూళ్లలో పైడిమర్రి వెంకట సుబ్బారావు రచించిన ప్రతిజ్ఞను బాలలు పలుకుతారు. కానీ మరి తల్లిదండ్రుల మాటేమిటి? ఐస్‌లాండ్ వంటి కొన్ని దేశాలలో తల్లిదండ్రులకూ ప్రతిజ్ఞను తప్పనిసరి చేశారు. పిల్లలకు తగు సమయం కేటాయిస్తామని, వారు మంచి పనులు చేసినప్పుడు ప్రశంసిస్తామని, అవసరమైనప్పుడు 'నో' చెప్పినా స్వీకరిస్తామని, పిల్లలు తగిన ఆహారమూ నిద్రా వ్యాయామమూ లభించేట్టు చూస్తామని తల్లిదండ్రులు ప్రతిజ్ఞ చేస్తారు. ఇందువల్ల ఐస్‌లాండ్‌లో పదహారేళ్ళ లోపు యువతలో 1998 నుంచి 2016 మధ్యలో తాగుడు అలవాటు 42 శాతం నుంచి 5 శాతానికి, సిగరెట్ అలవాటు 23 శాతం నుంచి 3 శాతానికి, గంజాయి అలవాటు 17 శాతం నుంచి 7 శాతానికీ తగ్గిపోయింది.



"భారతదేశం నా మాతృభూమి" అనీ "నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్నీ గౌరవిస్తాను" అనీ ప్రతి రోజూ మన స్కూళ్లలో పైడిమర్రి వెంకట సుబ్బారావు రచించిన ప్రతిజ్ఞను బాలలు పలుకుతారు. కానీ మరి తల్లిదండ్రుల మాటేమిటి? ఐస్‌లాండ్ వంటి కొన్ని దేశాలలో తల్లిదండ్రులకూ ప్రతిజ్ఞను తప్పనిసరి చేశారు.

లైంగిక నేరాల నుంచి బాలలను రక్షించేందుకు తెచ్చిన పోక్సో చట్టం 2012, నిబంధన 3(5) ప్రకారం సమగ్రమైన బాలల పరిరక్షక విధానాన్ని రూపొందించి, రాష్ట్రంలోని అన్ని సంస్థలలోనూ అది అమలయ్యేట్టు చూడాలి. పోక్సో చట్టం సెక్షన్ 19 ప్రకారం ఏదైనా సంస్థ పరిధిలో బాలలపై నేరం జరిగినా, జరిగే అవకాశం ఉన్నా ఆ సంస్థ యజమాని వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. తప్పనిసరిగా రిపోర్ట్ చేయాల్సిన బాధ్యతను నిర్వర్తించడంలో వారు విఫలమైతే వారికి ఏడాది జైలు శిక్ష విధించవచ్చు. పోక్సో చట్టం నిబంధన 3(4) ప్రకారం బాలలు సందర్శించే అన్ని సంస్థలు, పాఠశాలలు, క్రెష్‌లలో సిబ్బందికి, ఉపాధ్యాయులకు ఏమైనా నేర చరిత్ర ఉన్నదా అని పోలీసు శాఖ చేత క్రమబద్ధంగా తనిఖీ చేయాలి. పోక్సో చట్టం కింద పడే శిక్షల తీవ్రత గురించి అవగాహన పెంచితే నేరాలు తగ్గవచ్చు.

పోక్సో చట్టం ప్రకారం ఏర్పాటైన ప్రత్యేక న్యాయస్థానాలు దేశవ్యాప్తంగా విధిస్తున్న తీవ్రమైన కఠిన శిక్షల గూర్చి తెలిసిన వారెవరైనా పిల్లలను హింసించాలన్న ఆలోచనకే భయపడతారు. 18 ఏళ్ళ లోపు బాలలపై లైంగిక హింసకు పాల్పడితే ఇరవై ఏళ్ళ వరకు జైలు శిక్ష విధిస్తారు. ఈ నేరం చేసింది బంధువులు, ప్రభుత్వ ఉద్యోగులు, పాఠశాల సిబ్బంది, వసతి గృహ సిబ్బంది ఐతే మరణ శిక్షకు కూడా ఆస్కారం ఉంటుంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో ప్రత్యేక న్యాయస్థానాలు త్వరితంగా విచారణ పూర్తి చేసి నేరస్థులకు మరణశిక్షలు విధించాయి.

భారత ప్రభుత్వ లైంగిక నేరస్థుల జాతీయ డేటాబేస్‌లో 10.69 లక్షల మంది లైంగిక నేరస్థుల వివరాలు– పేర్లు, చిరునామాలు, ఫోటోలతో సహా పోలీస్ శాఖకు అందుబాటులో ఉన్నాయి. ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి కొద్ది దేశాలలో మాత్రమే ఈ అవకాశం ఉన్నది. అమెరికాలోనైతే ఈ నేరస్థుల సమాచారం సామాన్యులకు కూడా అందుబాటులో ఉన్నది. భారత్ కూడా ఈ దిశగా ముందడుగు వేయాలి. బాలల హక్కులను పరిరక్షించడం సమిష్టి బాధ్యత.

■ శ్రీనివాస్ మాధవ్
(నేడు ప్రపంచ బాలల దినోత్సవం)

కులగణన స్ఫూర్తి గ్రహించక కువిమర్శలు!

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఎన్నో విప్లవాత్మక సామాజిక నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నది. లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా కులగణన జరగాలన్న డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో కూడా కులగణన చేపడతామన్న అంశాన్ని పొందుపరిచింది. కాంగ్రెస్ మేనిఫెస్టో 'పాంచ్ న్యాయ్'లో భాగంగా 'హిస్సేదార్ న్యాయ్'లో దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని, రిజర్వేషన్‌పై ఉన్న 50శాతం పరిమితిని తొలగిస్తామని రెండు కీలకమైన వాగ్దానాలను రాహుల్‌గాంధీ చేశారు. ఆయన ఆలోచనలకు రూపంగా తెలంగాణలో మహోన్నతమైన కులగణన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి నవంబర్ 6న శ్రీకారం చుట్టారు.

వెనుకబడిన తరగతుల ఆర్థిక స్థితిగతులను తెలుసుకోవడానికి భూసాని వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో డెడికేషన్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతోంది. ఇందుకుగాను రూ.150 కోట్లను కేటాయించగా, 80 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు సర్వేలో భాగస్వాములవుతూ, ప్రజల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. 1953లో కాకా కలేల్కర్ కమిషన్, 1978లో మండల్ కమిషన్, 2017లో జస్టిస్ రోహిణి కమిషన్‌లు కూడా సామాజిక ఆర్థిక అసమానతలు తెలుసుకోవడానికి కులగణన జరగాలని అభిప్రాయపడ్డాయి. తెలంగాణలో దాదాపు 154పైగా బీసీ కులాలు, ఉప కులాలు ఉన్నాయి. ఇప్పటికీ కనీస గుర్తింపుకు నోచుకోని కులాలు ఉన్నాయి. ఇవన్నీ సామాజికంగాను, ఆర్థికంగాను, అక్షరాస్యతలోను వెనుకబడి ఉన్నాయి. రాజకీయపరంగా, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందక, సరైన గుర్తింపు లేక దుర్భర జీవనాన్ని కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కులగణనతో అలాంటి వారి జీవన విధానం మారనున్నది.

ఓటు బ్యాంకు రాజకీయాలకు స్వస్తి పలుకుతూ ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంలోనూ, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో అర్హులకు అందేట్టు చేయడంలోనూ ఈ కులగణన సర్వే ఎంతో కీలకం కానున్నది. గతంలో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళలో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టారు. కానీ ఆ గణాంకాలను స్వార్థపూరిత కుల రాజకీయాలకు వాడుకున్నారు తప్పితే రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమీ లేదు. ప్రతిపక్ష పార్టీలు సదరు గణాంకాలు రాష్ట్ర ప్రజలకు తెలియపరచాలని ఎంత మొత్తుకున్నా ఏనాడూ వెల్లడించలేదు. కేవలం కులాలను ఓటు బ్యాంకుగా మార్చుకున్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల ఆర్థిక జీవన విధానం మారాలి. దామాషా ప్రకారం ఎవరికి దక్కాల్సిన వాటా వారికి దక్కాలి. అందుకు ఈ కులగణన గణాంకాలు ఉపయోగపడతాయి. కులగణనపై విపక్షాలు బురదజల్లే ప్రయత్నాలు ఇప్పటికే మొదలు పెట్టాయి. అసంబద్ధమైన ప్రశ్నలకు ఎక్కుపెడుతున్నాయి. పైపైన కులగణనకు తాము అనుకూలం అంటూనే ప్రజల మదిలో అనుమానాలను రేకెత్తించే విధంగా గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. ప్రభుత్వం సోషియో ఎకానమీ ప్రకారం సర్వే చేస్తోంది. గతంలో బిహార్ రాష్ట్రంలో కులగణన గణాంకాల ఆధారంగా 34 శాతం మంది ప్రజల రోజువారీ ఆదాయం 200 రూపాయలని తేలింది. అంటే నెలకు రూ. 6వేలు సంపాదిస్తున్నారు. అక్కడ జనాభా ప్రకారం బీసీల రిజర్వేషన్ 33 శాతం నుంచి 42 శాతానికి పెంచారు. ఎస్సీల రిజర్వేషన్ 17 శాతం నుంచి 23 వరకు పెంచారు. అలాగే ఇక్కడ కూడా ప్రభుత్వం ప్రజల ఆర్థిక



స్థితిగతులను తెలుసుకునేందుకు వివరాలు సేకరిస్తున్నదే తప్ప గత బీఆర్ఎస్ ప్రభుత్వంలా వివరాలు దాచి పబ్బం గడుపుకోవడానికి కాదు. బీసీలు రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నది వాస్తవం. రానున్న స్థానిక ఎన్నికల్లో దామాషా ప్రకారం వారు రాజకీయ అవకాశాలను అందుకుంటారు.

2018లో పార్లమెంట్ సాక్షిగా రక్షణ శాఖ మంత్రి రాజనాథ్‌సింగ్ జనాభా గణనలో భాగంగా ఎస్సీ, ఎస్టీ కులగణన చేపడతామని చెప్పారు. కానీ ఓబీసీ కులగణన చేపట్టబోమని స్పష్టం చేసారు. దీన్ని బట్టి చూస్తే బీజేపీ స్టాండ్ ఏమిటన్నది అర్థం అవుతుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బీసీ వర్గానికి చెందిన వారైనప్పటికీ సర్వేకు విముఖత వ్యక్తం చేయడం గమనార్హం. లౌకిక దేశంలో మతాల ప్రాతిపదికన ఓట్లు దండుకోవడానికి రాజకీయాలు చేయడమే బీజేపీకి ప్రధాన ఎజెండాగా మారింది. ఆడలేక మద్దెల దరువు అన్నట్టు– దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని రాహుల్‌గాంధీ కోరితే– బీజేపీవారు అసలు రాహుల్‌గాంధీ కులం ఏమిటీ అని వ్యంగ్య విమర్శలు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఆర్థిక అసమానతలకు ప్రధాన కారణం కులమే. రాష్ట్రంలో జరుగుతున్న కులగణన ప్రక్రియ ద్వారా ప్రజల అభివృద్ధి, సామాజిక సమానత్వం, ఆర్థిక స్వావలంబన అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం సాధ్యమవుతుంది. ఈ ప్రక్రియకు అన్ని ప్రతిపక్ష పార్టీలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వాలి.

• ఇందిరా శోభన్
కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
బుధవారం 20 నవంబరు 2024



సీఎం ఆవిష్కరించిన కాళోజీ కాంస్య విగ్రహం, నివాళి అర్పిస్తున్న రేవంత్‌రెడ్డి

కాళోజీ కళాక్షేత్రం.. జాతికి అంకితం

- ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రజాకవి విగ్రహం ఆవిష్కరణ, నివాళి
- మంత్రులతో కలిసి డాక్యుమెంటరీని తిలకించిన సీఎం

8

ప్రశాంతంగా సీఎం పర్యటన

- నిరసనలకు సిద్ధమైన ప్రతిపక్ష నాయకులు, పలు విద్యార్థి సంఘాలు
- తెల్లవారుజాము నుంచే ముందస్తు అరెస్టులు
- సభ సాఫీగా సాగడంతో ఊపిరిపీల్చుకున్న పోలీసులు

8

ప్రజాపాలన సభ సక్సెస్

- భారీగా తరలొచ్చిన మహిళలు.. • కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్
- సీఎం ప్రసంగానికి కేరింతలు కొట్టిన కార్యకర్తలు

8

బాబోయ్.. ఈ పదవి నాకొద్దు..

- ఎంజీఎం సూపరింటెండెంట్ పోస్టుకు డాక్టర్ మురళీ నాజీనామా
- డైట్ కాంట్రాక్టులో తప్పుదారి పట్టించిన మినిస్ట్రీయల్ సిబ్బంది
- ఒత్తిడి, ఆధిపత్య పోరు కూడా కారణమే!

6



కుడా మాస్టర్ ప్లాన్‌ను విడుదల చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు



కళాక్షేత్రం ఆవరణలో కాళోజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం

ఓరుగల్లు.. ప్రపంచానికే ఆదర్శం

- వరంగల్ అభివృద్ధి చెందితే సగం రాష్ట్రం అభివృద్ధి చెందినట్టే..
- కాకతీయుల గడ్డ ఓ మోడల్‌గా నిలవబోతోంది..
- అందుకే రూ.6వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం..
- పూర్తయ్యే వరకు నిద్రపోను, ఎవరినీ నిద్ర పోనియ్యను
- బీఆర్ఎస్ నేతలు కాళ్లలో కట్టె పెడితే ఊరుకునేది లేదు
- ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి



సభలో నృత్యం చేస్తున్న మహిళ

హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకతీయులు ఏలిన ఓరుగల్లు ప్రపంచానికే ఆదర్శమని, చారిత్రక వరంగల్ నగరం అభివృద్ధి అయితే.. సగం రాష్ట్రం అభివృద్ధి చెందినట్టేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భవిష్యత్‌లో వరంగల్ పొరుగు జిల్లాలైన కరీంనగర్, ఖమ్మం, నల్లగొండతో సహా అన్ని జిల్లాలకు ఒక నమూనాగా ఉండబోతోందని, ఇక్కడి స్ఫూర్తితోనే యావత్ రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆకాంక్షించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ప్రజాపాలన విజయోత్సవ సభను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఒక నిర్దిష్ట లక్ష్యంతో చేపట్టిన వరంగల్ నగరాభివృద్ధి పనులు పూర్తయ్యే వరకు తాను నిద్రపోనని, ఇతరులను నిద్ర పోనియ్యనన్నారు. కాకతీయుల గొలుసుకట్టు చెరువులు, అద్భుతమైన ప్రాచీన కట్టడాలకు నిలయమైన వరంగల్ నగరం గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అరిగోసపడిందని, అభివృద్ధికి నోచుకోక సమస్యలతో కూనారిల్లిందన్నారు. ఆ పరిస్థితిని చూడలేక ఎలాగైనా వరంగల్‌ను ఒక అద్భుత నగరంగా తీర్చిదిద్దాలనే నిర్ణయానికి వచ్చామన్నారు. ఈ జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా వరంగల్ సమగ్రాభివృద్ధికి పట్టుబట్టారని, నిధులు మంజూరు చేసే వరకు తనను ముప్పతిప్పలు పెట్టారని అన్నారు. తాను కూడా వారు అలాగే అడుగుతారులే అని మొదట్లో పట్టించుకోలేదని, నగరం పట్ల వారికి ఉన్న శ్రద్ధ, నిబద్ధత చూసిన తర్వాత హైదరాబాద్ తర్వాత రెండో మహానగరంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నానని స్పష్టం చేశారు.

వరంగల్ సమగ్రాభివృద్ధికి అవసరమైన డీపీఆర్‌లను తయారు చేయడంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పూర్తి స్థాయి శ్రద్ధ తీసుకున్నారన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన ఖమ్మం జిల్లాను కాదని వరంగల్ జిల్లాకు పెద్ద పీట వేశారని ప్రశంసించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా నగరాభివృద్ధి విషయంలో పలుమార్లు తనపై ఒత్తిళ్లు తీసుకువచ్చారని సీఎం గుర్తు చేశారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల పట్టుదల వల్లనే నగరానికి రూ.6 వేల కోట్ల నిధులు రాగలిగాయన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిపోయిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. 'ఇతర రాష్ట్రాల్లో ఎక్కడకు పోయినా ఎయిర్‌పోర్టులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పలు చోట్ల విమానాశ్రయాలు ఉన్నాయి. తెలంగాణాలో మాత్రం ఒకే ఒక్క ఎయిర్‌పోర్టు ఉంది. వాటికిలాగే మనకు మాత్రం ఎయిర్‌పోర్టులు ఎందుకు ఉండకూడదనిపించింది. అందుకే మామూనూరు విమానాశ్రయాన్ని అభివృద్ధి

మిగతా 6వ పేజీలో



ప్రజాపాలన విజయోత్సవ సభకు తరలొచ్చిన మహిళలు



వరంగల్ జిల్లా రాయపర్తిలో చోరీకి గురైన ఎస్‌బీఐలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

రాయపర్తిలో భారీ దోపిడీ

- ఎస్‌బీఐలోకి చొరబడిన దుండగులు
- గ్యాస్‌కట్టర్‌తో స్ట్రాంగ్ రూమ్, సేఫ్టీ లాకర్లను తెరిచిన దొంగలు
- ప్రజలు కుదువబెట్టిన బంగారం అపహరణ
- వాటి విలువ దాదాపు రూ.14కోట్ల పైమాటేనని అంచనా
- ఆధారాలు లేకుండా సీసీ కెమెరాల డీవీఆర్ ఎత్తుకెళ్లిన వైనం
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- వివరాలను గోప్యంగా ఉంచిన ఎస్‌బీఐ అధికారులు, పోలీసులు

6

బల్దియాకు రూ.187.42కోట్లు విడుదల

- త్రైమాసిక బడ్జెట్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- వెల్లడించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్
- కాంట్రాక్టర్ల నిధులకు మోక్షం.. ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

6

ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్



నవంబర్ నెల కూపన్ నంబర్ - 2

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది నవంబర్ నెల రెండవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి నాలుగు నెలలు అయిన తర్వాత మొత్తం 12 కూపన్లను నాలుగు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.

నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.
* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.



కూపన్లు పంపవలసిన చిరునామా

అడ్రస్ : ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్,
సర్వే నెం. 1054, మడికొండ, జిల్లా హనుమకొండ. పిన్‌కోడ్ -506142
అసిస్టెంట్ మేనేజర్ (సర్క్యులేషన్) సెల్ : 9985411664, బ్రాంచ్ మేనేజర్ : 9985411661

బీఆర్‌ఎస్‌పై మంత్రుల మండిపాటు

పార్టీ, నేతల తీరును తూర్పారపట్టిన వైనం ● ఏడాది పాలన ఫలితాలను వెల్లడిస్తూ సాగిన ప్రసంగాలు ● వరంగల్ అభివృద్ధిపై సీఎంకు జిల్లా ప్రజాప్రతినిధుల కృతజ్ఞతలు

హనుమకొండ సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మహిళా శక్తి విజయోత్సవ సభలో రాష్ట్ర మంత్రులు వరంగల్ అభివృద్ధి, ఏడాదిలో రాష్ట్ర పాలన ఫలితాలను వెల్లడిస్తూ ప్రసంగించారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న సభలో మంత్రులు, జిల్లా ప్రజాప్రతినిధులు మాట్లాడారు. ఒకవైపు వరంగల్ అభివృద్ధిని ఉటంకిస్తూ.. మరోవైపు బీఆర్ఎస్ నేతలను తూర్పార పడుతూ ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనా సమర్థతను కొనియాడుతూ మాట్లాడారు. సభలో మంత్రులు ఇతర ప్రజాప్రతినిధుల ప్రసంగాలు వారి మాటల్లోనే..

సీఎంకు రుణపడి ఉంటాం : నాయిని



లోక్‌సభ ఎన్నికల క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ నగరాభివృద్ధి హామీల వర్షం గుప్పించారు. అప్పుడే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మంజూరు చేస్తానని వెల్లడించారు. మాట తప్పకుండా అనేక అభివృద్ధి వరాలు గుప్పించారు. కాళోజీ కళాక్షేత్రానికి రూ.75 కోట్ల మంజూరు చేయడంతో గడిచిన నాలుగునెలల్లో పూర్తి చేశాం. ఎయిర్ పోర్టుకు నిధులు మంజూరు, మాస్టర్‌ప్లాన్-2041 గ్రీన్‌సిగ్నల్, రూ.4,170 కోట్లతో యూజీడీ, రూ.32 కోట్లతో జీడబ్ల్యూఎంసీ పరిపాలన భవనం ఇలా ఎన్నో అభివృద్ధి వరాలు కురిపించి ఇచ్చిన మాట నేరవేర్చుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నగరం రుణపడి ఉంటుంది.

రూ.6వేల కోట్ల పనులు : ఎంపీ కావ్య



వరంగల్ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రూ.6వేల కోట్లతో వెనువెంటనే జీవోలు మంజూరు చేశారు. ఇంత పెద్ద సంఖ్యలో వరంగల్‌కు నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి సహకరించారు. ఇన్నర్‌రింగ్ రోడ్డు, ఔటర్ రింగు రోడ్డు, మెగా టెక్స్‌టైల్ పార్కు భూనిర్వాసితులకు నిధుల విడుదల చేయడం అభినందనీయం. ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీయం భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు

నగరం అభివృద్ధి : పొంగులేటి



వరంగల్ మహానగరం అద్భుతంగా అభివృద్ధి చెందనుంది. హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారు. కాళోజీ కళాక్షేత్రాన్ని పదేళ్లలో పాలించిన బీఆర్ఎస్ పూర్తిచేయలేదు. నగరాభివృద్ధికి కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదు. ఆరు నెలల నుంచి కళాక్షేత్రం పూర్తికి నిత్యం కృషి చేశాం. మాస్టర్‌ప్లాన్-2041 తీసుకొచ్చాం. రూ.4170 కోట్లతో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మూడు విడతల్లో పూర్తి అవుతుంది. ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం రూ.210 కోట్ల నిధులు మంజూరు, భద్రకాళి మాడవీదుల నిర్మాణానికి రూ.30 కోట్లు, రూ.74కోట్లు వరంగల్ బస్ స్టేషన్ ఆధునీకరణ, ఇంకా అనేక అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారు. ఇంతలా నగర అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు. బీఆర్ఎస్ నిరుపేదల భూములను లాక్కొంది. కొత్త రెవెన్యూ చట్టంతో ఆ భూములను నిరుపేదలకు అప్పగించే చర్యలు ఉంటాయి. భవిష్యత్తులో ప్రజల భూములు కొల్లగొట్టే అవకాశం లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. ధరణిలోని లోపాలను సవరించాం.

కలలను ఆవిష్కరించారు : సురేఖ



వరంగల్ నగరాభివృద్ధిపై ప్రజలు ఎన్నో కలలతో ఉన్నారు. వాటిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాస్తవ రూపంలో ఆవిష్కరించారు. రూ.6వేల కోట్లు అభివృద్ధి కోసం కేటాయించడం నిజంగా పండుగలా అనిపిస్తుంది. ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్‌రెడ్డిది ఉడుంపట్టే. నగరాభివృద్ధి కోసం ఆయన తమతో సమీక్షలు జరుపడమే కాకుండా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఫలితాలు సాధించి పెట్టారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ వరంగల్ నగరాభివృద్ధిపై ప్రజల్లో ఎన్నో ఆశలు కల్పించారు. మాటలకే పరిమితమయ్యారు. మాట ఇచ్చి నిలబెట్టుకున్న ముఖ్యమంత్రుల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తరువాత రేవంత్‌రెడ్డియే. నగర ప్రజల పక్షాన కృతజ్ఞతలు

కోటీశ్వరులను చేయాలనే.. : సీతక్క



మహిళల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఆశయంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పరిపాలన సాగిస్తే నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదే దారిలో మహిళా జీవితాల్లో వెలుగులు నింపుతున్నాడు. మహిళా సంఘాలకు వైఎస్ పావులా వడ్డీ రుణాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంఘాల్లో మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో వడ్డీ లేని రుణాలను అందిస్తున్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో రూ.21 వేల 441 కోట్ల రుణాలను ఇస్తున్నారు. మహిళా సంఘాలకు 17 రకాల వ్యాపారాలు చేసే అవకాశం దక్కింది. ఆర్టీసీ బస్సుల అద్దె నిర్వహణ, సోలార్ పవర్ ప్రాజెక్టులు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ తదితర వ్యాపారాల నిర్వహణతో మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించే మార్గాలను రేవంత్‌రెడ్డి నిర్మించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే సమాజం మరింత ఉన్నతి సాధిస్తుంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తే బీఆర్ఎస్ నాయకులు పనిగట్టుకొని దుష్ప్రచారం చేశారు. 22 జిల్లాల్లో మహిళా శక్తి భవన్ నిర్మాణాలు చేపట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించడం, నిధులు మంజూరు చేయడం మహిళా సంక్షేమం, అభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. రేవంత్‌రెడ్డికి మహిళల పక్షాన కృతజ్ఞతలు.

రాష్ట్రం అప్పుల మయం : జూపల్లి



బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల మయం చేసింది. పదేళ్లలో సాధించిన ప్రగతి శూన్యం. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి చర్యలు చేపట్టింది. రైతులకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి నిలబెట్టుకున్నారు. కాళోజీ కళాక్షేత్రాన్ని బీఆర్ఎస్ పూర్తి చేయకపోవడమే కాకుండా ఇంకా బీరాలు పలుకుతోంది. రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రిగా కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం, ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాల్గొనడం ఆనందంగా ఉంది.

కాళేశ్వరంతో దోపిడీ : పొన్నం



కాళేశ్వరం పేరిట బీఆర్ఎస్ నాయకులు దోచుకుతిన్నారు. రాష్ట్రం అప్పుల్లో చిక్కుకున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో వెనక్కు తగ్గలేదు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటి వరకు 110 కోట్ల మంది మహిళలు ప్రయాణాలు చేశారు. కుల గణన సర్వేతో నిరుపేదల జీవన అవసరాల అంచనాలు ప్రభుత్వానికి తెలుస్తాయి. ప్రతి ఒక్కరు సర్వేలో వివరాలు తెలుపండి.

మూసీ ప్రక్షాళన భేష్ : కోమటిరెడ్డి



మూసీ నది ప్రక్షాళన చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అభినందనలు. మూసీ నీటి ప్రభావం నల్లగొండ జిల్లాపై కూడా ఉంది. ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. శాశ్వత పరిష్కారంగా మూసీ ప్రక్షాళనను రేవంత్‌రెడ్డి చేపడితే ప్రతిపక్షాలు గగ్గోలు చేయడం సరి కాదు. కేటీఆర్, హరీశ్‌రావు ప్రజల మేలును తలచే వారు కాదు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



ఏడాదిలోపే రాష్ట్రంలోని వివిధవర్గాలకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంది. మరో నాలుగు సంవత్సరాల కాలంలో మరింత ద్విగుణీకృత ఉత్సాహంతో పని చేస్తాం. ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి.

ఓరుగల్లు.. ప్రపంచానికే ఆదర్శం

5వ పేజీ తరువాయి

చేసేందుకు నిధులిచ్చాను' అని రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ అభివృద్ధే ప్రజా ప్రభుత్వం అభివృద్ధి అన్నారు.

అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు

కొందరికి తెలంగాణను అభివృద్ధి చేయడం ఇష్టం లేదని, అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని, కుతంత్రాలకు పాల్పడుతున్నారన్నారని, అలాంటి వారిని గుర్తించి బొక్కలో వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. బీఆర్ఎస్ చేతగాని దద్దమ్మ పాలన వల్లే కాళోజీ కళాక్షేత్రం పదేళ్లయినా పూర్తికాలేదని, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పదే పదే తనను కలిసి పట్టుబట్టి కళాక్షేత్రం పూర్తికి రూ.45కోట్లు విడుదల చేయించుకున్నాడన్నారు. తెలంగాణవాదాన్ని వ్యాప్తిచేసిన కాళోజీ కవిత్వం చదవని వారు ఉండరని, ఒక వేళ చదవకపోతే వారు చదువుకోనివారన్నట్టేనన్నారు. అలాంటి కవిని గత ప్రభుత్వం విస్మరించడం దారుణమన్నారు. అందుకే దానిని పూర్తి చేసే బాధ్యతను తాము తీసుకున్నామన్నారు. ఎన్నికలకు ముందు ఈ వరంగల్ గడ్డపైనే రైతు డిక్లరేషన్‌ను ప్రకటించిన తర్వాత స్థితిగతుల్లో మార్పు వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందన్నారు. తమ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి, ఇందిరమ్మ రాజ్యానికి కట్టుబడి ఉందని, అందుకే ఈ విజయోత్సవ సభను ఆడబిడ్డలకు అంకితం చేస్తున్నానన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, ఇప్పుడు సీఎంగా వారి ఆశీస్సులతోనే పరిపాలనా బాధ్యతలను మోస్తున్నానని, కేసీఆర్ మంత్రి వర్గంలో ఒక్క మహిళ కూడా లేదని సీఎం గుర్తు చేశారు. కానీ తమ మంత్రి మండలిలో కొండా సురేఖ, సీతక్కకు స్థానం కల్పించామని, కడియం కావ్యను ఎంపీని చేశామని, పాలకుర్తిలో ఒక రాక్షసుడిని ఎదురించి, కొండను బద్దలు కొట్టి మరో మహిళ విజయకేతనం ఎగురవేసిందని రేవంత్‌రెడ్డి అన్నారు. చీఫ్‌సెక్రెటరీతో పాటు పలు కీలక పోస్టుల్లో మహిళలే ఉన్నారని, వరంగల్, హనుమకొండ జిల్లాలకు మహిళలే కలెక్టర్లని, మేయర్ కూడా ఆడబిడ్డేనని, వేదిక కింద ఉన్న వేలాది మంది ఆడబిడ్డలు అందించిన ఆశీర్వాదంతోనే గుండె నిండా ధైర్యంతో ఉన్నామని, ఇది ఆడబిడ్డల రాజ్యమని ప్రకటించారు. సభా ప్రాంగణంలోని స్టాళ్లలో స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రదర్శనకు పెట్టిన వివిధ రకాల ఉత్పత్తులు బడా పారిశ్రామిక వేత్తల ఉత్పత్తులను మించి ఉన్నాయని సీఎం కితాబిచ్చారు. అందుకే టాటా, బిర్లాకు సవాల్ విసిరేలా మహిళలు సౌరవిద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నామని అన్నారు.

ఇదో చారిత్రక ఘట్టం : భట్టి



సర్వతోముఖాభివృద్ధి కోసం రూ.6వేల కోట్ల నిధులను ఒక పట్టణానికి ఇవ్వడం చారిత్రాత్మక ఘట్టమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభివర్ణించారు. మహిళలను మహాలక్ష్మలని, వారి సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందుకే స్వయం సహాయక సంఘాలకు రూ.25వేల కోట్లను రుణాలుగా ఇచ్చామని పేర్కొన్నారు. రానున్న నాలుగేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలన్నది లక్ష్యమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో మహిళలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారని విమర్శించారు. మహిళా అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి అని, ఈ దిశగానే వారి కోసం వడ్డీలేని రుణాలు, ఉచిత బస్సు రవాణా, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీపై గ్యాస్ లాంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. తాజాగా స్వయం సహాయక సంఘాలు సోలార్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకునేందుకు కూడా రుణాలను అందచేస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, వారి ఆర్థికాభివృద్ధికి ఎన్ని వేల కోట్లయినా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇది మహిళల ప్రభుత్వం అని ఉద్ఘాటించారు. కుర్చీ వేసుకొని వరంగల్‌లో అభివృద్ధి పనులు చేయిస్తానని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ పదేళ్లయినా కాళోజీ కళాక్షేత్రాన్ని ఎందుకు పూర్తి చేయించలేకపోయారని ప్రశ్నించారు. అవసరమైన నిధులిచ్చి ఆరునెలల్లో కళాక్షేత్రం పూర్తి చేశామన్నారు. దానిని ఇప్పుడు చూసి బీఆర్ఎస్ నేతలు కళ్లుతిరిగి పడిపోతున్నారని ఎద్దేవా చేశారు. వరంగల్ అంటే స్వేచ్ఛ, అనేక భావజాలాలకు కేంద్రమని, అందుకే ఈ గడ్డపై నుంచి ప్రజాపాలన విజయోత్సవాన్ని మొదటగా నిర్వహించామన్నారు.

బల్దియాకు రూ.187.42కోట్లు విడుదల

- త్రైమాసిక బడ్జెట్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- వెల్లడించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్
- కాంట్రాక్టర్ల నిధులకు మోక్షం.. 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు వరంగల్ బల్దియాకు రాష్ట్ర ప్రభుత్వం కొంత బడ్జెట్ విడుదల చేసింది. వరంగల్ నగరం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ మంగళవారం త్రైమాసిక బడ్జెట్ విడుదల చేశారు. జీవో నెంబర్ 583ను ప్రకటిస్తూ రూ.187,42కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ మాసంలో జరిగిన బల్దియా బడ్జెట్ సమావేశంలో 15వ వార్షిక మిగులు బడ్జెట్ నిధుల కింద రూ.650.12 కోట్లు నిధులు వివిధ అభివృద్ధి పనులకు కేటాయించారు. ఆరు మాసాలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి 4శాతం నిధులు రూ.26కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. దీంతో చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. దీంతో ఈ నెల 4న 'బడ్జెట్ ఘనం.. ఇచ్చింది తృణం' అనే వార్త ప్రచురితం కావడంతో జిల్లా అధికారులు, పాలకవర్గం స్పందించారు. హైదరాబాద్ రాష్ట్ర మున్సిపల్ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెంచారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ సుధారాణి ప్రత్యేక శ్రద్ధతో నిధుల విడుదలకు అధికారులపై ఒత్తిడి పెంచారు.

దీంతో మంగళవారం త్రైమాసిక నిధుల కింద వరంగల్ బల్దియాకు రూ.187.32కోట్ల నిధులను ముందుగా హైదరాబాద్ ట్రెజరీ విభాగంలో జమ చేస్తున్నట్టు ప్రిన్సిపల్ సెక్రెటరీ వెల్లడించారు. ఈ బడ్జెట్ ఒకటి, రెండు రోజుల్లో వరంగల్ బల్దియా అకౌంట్స్ విభాగానికి బదిలీ చేస్తారు. అయితే గ్రేటర్ వరంగల్‌లో చేసిన అభివృద్ధి పనులతోపాటు చేపట్టబోయే పనులకు ఈ నిధులను వినియోగించాలని జీవోలో పేర్కొన్నారు. చాలా రోజుల తర్వాత పెద్ద మొత్తంలో బడ్జెట్ విడుదల కావడంతో బల్దియా అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. బల్దియా కార్పొరేటర్లు సైతం వారి వారి డివిజన్ల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తారని ఆశిస్తున్నారు. అయితే బల్దియా కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు ఈ నిధులతో చెల్లిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రాయపర్తిలో భారీ దోపిడీ

● ఎస్‌బీఐలోకి చొరబడిన దుండగులు ● ప్రజలు కుదవబెట్టిన బంగారం అపహరణ ● వాటి విలువ దాదాపు రూ.14కోట్ల పైమాటేనని అంచనా



రాయపర్తి ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట పోలీసులు

రాయపర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేసి, గ్యాస్ కట్టర్ల కిటికీ గ్రిల్స్ తొలగించి బ్యాంకులోకి చొరబడి రూ.కోట్ల విలువైన డబ్బులను కొల్లగొట్టే చోరీలను మనం చాలా సినిమాల్లో చూశాం. అదే రీతిలో వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి సొత్తును అపహరించిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసులు, బ్యాంకు అధికారులు చెప్పిన వివరాలతో పాటు విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇవీ.. రాయ పర్తి మండలకేంద్రం శివారులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకును మంగళవారం ఉద యం తెరిచిన అధికారులు లోపలికి వెళ్లి చూసేసరికి లాకర్ రూం ఓపెన్ కావడం, అందులోని సీక్రెట్ లాకర్ సైతం తీసి ఉండడంతో ఉలిక్కిపడ్డారు. వెంటనే ఎస్‌బీఐ ఉన్నతాధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. హుటా హుటిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకు న్నారు. వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రావణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వ హించారు. క్లూస్ టీం సైతం బ్యాంకులో అణువ ణువునా తనిఖీలు చేసి, వేలిముద్రలు సేకరించా రు. కానీ బ్యాంకులో ఎంత మొత్తంలో నగదు, బంగారం పోయిందనే విషయాన్ని ఎస్‌బీఐ అధి కారులు, పోలీసులు గోప్యంగా ఉంచారు. పూర్తి వివరాలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే వెల్ల డిస్తామని బదులిస్తున్నారు. ఉదయం నుంచి ఖాతాదారులను, ఇతర వ్యక్తులను, మీడియాను పోలీసులు బ్యాంకు లోపలికి అనుమతించలేదు. దీంతో లోపల ఏం జరుగుతుందో తెలియక గందరగోళం నెలకొంది.

సినిఫక్కీలో దోపిడీ

దుండగులు సినీ ఫక్కీలో బ్యాంకు లోపలికి ప్రవేశించారు. వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి పక్కనే ఉండే ఈ బ్యాంకులో దుండగులు పక్కా ప్లాన్‌తోనే చోరీ చేశారని పోలీసులు ఓ అంచనాకు వచ్చారు. తొలుత బ్యాంకుకు సరఫరా అయ్యే విద్యుత్‌ను తొలగించి.. బ్యాంకు వెనుక వైపున ఉండే కిటికీ గ్రిల్స్‌ను గ్యాస్‌కట్టర్ సాయంతో చాకచక్యంగా తీసి లోపలికి ప్రవేశించారు. లోపలికి వెళ్లిన తర్వాత స్ట్రాంగ్ రూం లాకర్‌ను కూడా గ్యాస్ కట్టర్‌తో తొలగించి లోపల ఉండే సేఫ్టీ లాకర్‌ను కూడా ఓపెన్ చేశారు. అందులో ఉన్న ఖాతాదారులు రుణం కోసం కుదవపెట్టిన బంగారం ప్యాకెట్లను దోచుకున్నారు. కానీ ఇతర ఏ లాకర్లను తెరిచేందుకు ప్రయత్నించలేదు. దొంగలు తాము వెళ్లే సమయంలో బ్యాంకులో రికార్డయ్యే సీసీ కెమెరాల ఫుటేజీ హార్డ్‌డిస్క్‌ను కూడా తమతో పాటే ఎత్తుకెళ్లారు. అయితే వివిధ గ్రామాలకు చెందిన ఖాతాదారులు తమ వ్యక్తిగత అవసరాల కోసం రాయపర్తి ఎస్‌బీఐ బ్యాంకులో బంగారాన్ని కుదవబెట్టి డబ్బులను అప్పుగా తీసుకుంటారు. అలా తాకట్టు పెట్టిన బంగారాన్ని బ్యాంకు అధికారులు నిబంధనలకు అనుగుణంగా ప్యాకెట్లలో పెట్టి సేఫ్టీ లాకర్‌లో భద్రపరుస్తారు. ఈ లాకర్‌నే ఓపెన్ చేసిన దుండగులు అందులో ఉన్న బంగారాన్ని ఎత్తుకెళ్లారు. సుమారు ఆ లాకర్‌లో 500 ప్యాకెట్లు ఉంటాయని, దాదాపు రూ.14 కోట్లకు పైగా విలువ చేసే 19 కిలోల వరకు బంగారం అపహరణకు గురై ఉంటుందని విశ్వసనీయ సమాచారం. దీంతో బ్యాంకులో తాకట్టు పెట్టిన ఖాతాదారులు భయాందోళనకు గురవుతున్నారు. బ్యాంకు మేనేజర్ అబ్దుల్ రెహ్మాన్ స్పందించి ఖాతాదారుల ఆభరణాలకు ఎలాంటి ఢోకా లేదని తప్పకుండా వారి సొమ్మును తిరిగి అందిస్తామని స్పష్టంచేశారు. అపోహలు, పుకార్లు నమ్మవద్దని పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ఆధారాలు సేకరించిన క్లూస్ టీం..

చోరీకి గురైన బ్యాంకులో క్లూస్ టీం క్షుణ్ణంగా తనిఖీలు చేసి, ఆధారాలుగా సేకరించింది. దాదాపు 6 గంటల పాటు గుర్తు జరిపిన ఈ తనిఖీల్లో పలు విషయాలపై వారు ఓ నిర్ధారణకు వచ్చారని, కిటికీ గ్రిల్స్, లాకర్‌రూం, లాకర్ తొలగించిన తీరును చూసి గ్యాస్‌కట్టర్‌ను వినియోగించినట్టు తెలసింది. అయితే బ్యాంకులో ఇతర రాష్ట్రానికి చెందిన ఓ అగ్గిపెట్టె, ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన గ్యాస్‌కట్టర్‌ను దుండగులు వదిలి వెళ్లినట్టుగా తెలుస్తోంది. ఇక ఈ చోరీలో ఇద్దరికి పైగా వ్యక్తులు పాల్గొని ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని దావణగెరె జిల్లా న్యామతి పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకులో కూడా అక్టోబరు 28న ఇదే తరహాలో దోపిడీ జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. శని, ఆదివారాల్లో బ్యాంకు సెలవులను చూసుకున్న దుండగులు పక్కా స్కెచ్‌తో బ్యాంకులోకి చొరబడ్డారు. అక్కడ కూడా దాదాపు రూ. 13 కోట్ల విలువైన సొత్తును కాజేసారు. ఇదే తరహాలో రాయపర్తి ఎస్‌బీఐలో సైతం చోరీ కావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

భద్రతలో డొల్లతనం...

బ్యాంకు భద్రతలో డొల్లతనం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2019లో ఈ బ్యాంకులోనే గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి విఫలయత్నం చేశారు. వెనక ఉన్న కిటికీలో నుంచే లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అప్పటి నుంచి కూడా బ్యాంకు అధికారులు బ్యాంకు భద్రతపై దృష్టి పెట్టలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సెక్యూరిటీ గార్డు లేకపోవడం, ఏటీఎం వద్ద సీసీ కెమెరా ఊడిపోయి కనిపించడం, గతం అనుభవాలతోనైనా కిటికీలను తొలగించి బలమైన గోడలు, లోపలి వైపున కూడా ఇతర భద్రతా వలయాలు నిర్మించకుండా ఉండడం లాంటి భద్రతలో డొల్లతనాన్ని ఎత్తిచూపుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బాబోయ్.. ఈ పదవి నాకొద్దు

- ఎంజీఎం సూపరింటెండెంట్ పోస్టుకు డాక్టర్ మురళీ రాజీనామా
- డైట్ కాంట్రాక్టులో తప్పుదారి పట్టించిన మినిస్ట్రీయల్ సిబ్బంది
- ఒత్తిడి, ఆధిపత్య పోరు కూడా కారణమే!



వరంగల్ మెడికల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'బాబోయ్.. ఈ పదవి నాకొద్దు..' అంటూ ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి సూపరింటెండెంట్ పదవికి రాజీనామా చేశారు. సోమవారం ఉదయం కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా రాష్ట్ర వైద్య, విద్యా సంచాలకుడికు తన రాజీనామా లేఖను సమర్పించారు. ఎంజీఎం డైట్ కాంట్రాక్టు అప్పగించే విషయంలో మినిస్ట్రీరియల్ సిబ్బంది తనను తప్పుదారి పట్టించి సంతకం చేయించడంతో మనస్థాపం చెందినట్లు తెలిసింది. గత జూలై 23న ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ చిలుక మురళి బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి సమస్యల వలయంలోనే విధులను చేపడుతున్నారు. ఆస్పత్రిలో ఇటు ఆర్ఎంవోలకు అటు మినిస్ట్రీయల్ సిబ్బందికి మధ్య అధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. ఈ రెండు వర్గాల మధ్య సూపరింటెండెంట్ అనేక విషయాల్లో ఒత్తిళ్ల ఎదుర్కొన్నట్లు తెలిసింది.

డైట్ కాంట్రాక్ట్ కారణమా?

ఎంజీఎం ఆస్పత్రి డైట్ కాంట్రాక్టు నిర్వహణపై ఈ మధ్య టెండర్లు పిలిచారు. ఈ టెండర్లపై అనేక వివాదాలు తలెత్తాయి. కొందరు కాంట్రాక్టర్లు కోర్టును కూడా ఆశ్రయించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే నిబంధనలకు విరుద్ధంగా సరోజిని క్యాటరింగ్ సర్వీసెస్ వారికి కాంట్రాక్టు అప్పగిస్తూ ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో సంతకం చేయించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ సంస్థకు కాంట్రాక్టు అప్పగించవద్దనే విషయంలో కోర్టులో కేసు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి కాంట్రాక్టును సదరు సర్వీసెస్‌కు అప్పగించడంతో పోటీపడిన కాంట్రాక్టర్లు.. మరోసారి కోర్టు తలుపులు తట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో స్వయంగా ప్రభుత్వ న్యాయవాది ఎంజీఎం సూపరింటెండెంట్‌ను ఆరా తీసినట్లు తెలిసింది. కలెక్టర్ కూడా ఈ విషయంలో గుర్రుగా ఉన్నట్లు సమాచారం. నాలుగు రోజులు ఈ విషయం జరిగినట్లు సమాచారం. ఈ ఒత్తిళ్ల మధ్య సూపరింటెండెంట్‌కు బీపీతోపాటు అస్వస్థతకు గురైనట్లు సమాచారం. నాలుగు రోజులుగా సెలవులో ఉండి సోమవారం రాజీనామా చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

ఎంజీఎంలో ఆధిపత్య పోరు

ఎంజీఎం ఆస్పత్రిలో కొన్నిరోజులుగా ఆర్ఎంవోలకు, మినిస్ట్రియల్ పరిపాలన అధికారికి మధ్య ఆధిపత్య పోరు నడుస్తున్నట్లు సమాచారం. ఎంజీఎం సూపరింటెండెంట్ దగ్గరికి ఎవరినీ రానివ్వకుండా, ఎవరి సలహాలు తీసుకోకుండా పరిపాలన అధికారి తప్పుదారి పట్టిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

కోట్ల నిధులు ఖర్చు

ఆరోగ్యశ్రీ నిధుల నుంచి కొన్ని నెలలుగా కోట్ల రూపాయల నిధులు కొల్లగొట్టినట్లు విశ్వసనీయ సమాచారం. గత ఏడాది వరకు నిల్వ ఉన్న నిధులు మూడు నెలల కాలంలోనే విచ్చలవిడిగా ఖర్చు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పదోన్నతులు, నియామకాల్లో అదే దూకుడు

ఎంజీఎం ఆస్పత్రిలో నాలుగో తరగతి ఉద్యోగులకు ఈ మధ్య కాలంలో విచ్చలవిడిగా పదోన్నతులు కల్పించినట్లు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అర్హత లేకున్నప్పటికీ అమ్యామ్యాలు సమర్పించుకుంటే పదోన్నతులు కల్పించినట్లు సమాచారం. కారుణ్య నియామకాలలో కూడా ముడుపులు ముట్టచెబితే క్షణాల్లో నియామకపత్రాలు ఇస్తున్నారని ఉద్యోగులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.

గాడి తప్పిన పాలన

ఎంజీఎం ఆస్పత్రిలో కొంతకాలంగా సివిల్ సర్జన్ ఆర్ఎంవో పోస్టు ఖాళీగా ఉంది. ఇక డిప్యూటీ సివిల్ సర్జన్ ఫారెన్ సర్వీస్ కాలం మరో నెల రోజుల్లో ముగిసిపోతుంది. మూడో ఆర్ఎంవోకు ఎలాంటి విధులు లేవు. వార్డుల్లో కనీసం పర్యవేక్షించే నాథుడే కరువైనట్లు సమాచారం. పైసలు వచ్చే పనులు తప్ప రోగులకు ఉపయోగపడే పనులు ఏమాత్రం ముందుకు సాగడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఎంజీఎంపై మంత్రి దృష్టి సారించాలి..

ఇప్పటికైనా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఎంజీఎం ఆస్పత్రిపై దృష్టి సారించాలని ఉద్యోగులు, రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం రోగులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



కొత్తవాడలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆటోనగర్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడలో డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు గొండ రజిత-శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి డివిజన్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డివిజన్ మహిళలకు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు గొండ శ్రీనివాస్, కొక్కుల సతీష్, రావుల రాజీవ్‌గాంధీ, బొల్లు సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 23వ డివిజన్ 80ఫీట్ల రోడ్డు వద్ద రాష్ట్ర చేనేత విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ విగ్రహానికి డివిజన్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామెర రాజ్‌కమల్, నాయకులు మండల శంకర్, దామెర సర్వేశ్, బండి రమేష్, బొల్లు సతీష్, బండి రమేష్‌పాల్గొన్నారు.

● గిర్మాజీపేట : ఇందిరమ్మ రాజ్యం ఫలాలలను ప్రజలకు చేరుద్దామంటూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ నేత మీసాల ప్రకాష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా వరంగల్ నగరం 27వ డివిజన్‌లోని గోవిందరాజుల గుట్ట ప్రాంతంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి టీపీసీసీ నేత మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్‌లు ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సదానందం, శ్రీనివాస్, శరత్, జస్వీర్‌సింగ్, శారద, జహిరా, అన్వేష్, విశాల్‌బాబు, లాజర్ పాల్గొన్నారు.

● కాశిబుగ్గ: ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ నివాళులర్పించారు. కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, గోపాల నవీన్ రాజ్, ఆయూబ్, దాసరి రాజేష్, కూచన రవీందర్, మీసాల ప్రకాష్, కొత్తపల్లి శ్రీను, కుసుమ సతీష్, సాంబరాజు పాల్గొన్నారు.

● మడికొండ: మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు, పండు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాంగ్రెస్ నాయకులు వస్కుల శ్రీను, వస్కుల శంకర్, కుర్ల మోహన్, బిల్ల రవిందర్, గుర్రం జ్యోతీఅమర్‌నాథ్, వస్కుల నాగరాజ్, పల్లపు అర్జున్ పాల్గొన్నారు.

● న్యూశాయంపేట: దేశ తొలి మహిళా ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతిని మంగళవారం న్యూశాయంపేట జంక్షన్‌లో నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్ రావు, కాంగ్రెస్ నాయకులు కనుకుంట్ల కృష్ణ, నాగబోయిన బాబురావు, గన్నవరం ప్రసాద్ పాల్గొన్నారు.

● వడ్డెపల్లి:ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మంగళవారం హనుమకొండ ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డులోని ఇంది రానగర్‌లో ఘనంగా నిర్వహించారు. 59వ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షు రాలు తేళ్ల సుగుణ-కిశోర్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. తొలుత ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ మహిళా నేతలు బొల్లు లలిత, పి.అనిత, రమాదేవి, కవిత, సునీత తదితరులు పాల్గొన్నారు. వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లోని ఓయాసిస్ అనాథ ఆశ్రమంలో వేడుకలను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మం డల సమ్మయ్య- సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటా నికి పూలమాలలు వేసి ఆశ్రమంలోని పిల్లలకు పండ్లు, స్వీట్లు, నోట్‌బుక్స్‌లను పంపిణీ చేశారు.



మడికొండ చౌరస్తాలో వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వరంగల్ బస్‌స్టేషన్ ఎదుట సీఐటీయూ ధర్నా



ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదుట సీఐటీయూ ధర్నా దృశ్యం

గిర్మాజీపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేసి తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వాహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సీఐటీయూ మంగళవారం వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేసింది. సీఐటీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, వరంగల్ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామిలు మాట్లాడుతూ ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఈ ధర్నాలో సీఐటీయూ నాయకులు ప్రభాకర్, ఓదెలు, ఉపేందర్, వాణి, ఎం.డి .ఇస్మాయిల్, సరిత, రాఘవరెడ్డి, జుబేదా, నూరయ్య పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూంలు అర్హులకు పంపిణీ చేయాలి

కాజీపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): న్యూ శాయంపేటలో ప్రభు త్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు అర్హుల కు పంపిణీ చేయా లని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.చుక్క య్య డిమాండ్ చేశారు. కాజీపేటలో మంగళవారం సీపీఎం మండల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చుక్కయ్య మాట్లాడారు. డబుల్ బెడ్‌రూంలు నిర్మించి పంపిణీ చేయకుండా ఓట్ల రాజకీయం చేసిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కాంగ్రెస్ అలాగే వ్యవహరిస్తే తామే పంపిణీ చేస్తామని హెచ్చరించారు. ఓరుగంటి సాంబయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు జంపాల రమేశ్, సంటి రవి, టి. మల్లేశం, కారు ఉపేందర్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ క్షేత్రం ఎదుట విద్యార్థి నాయకుల ఆందోళన

బాలసముద్రం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): కాళోజీ కళాక్షేత్రంలో కళాకారుల విగ్రహాలను పెట్టకుండా కళాక్షేత్రం పేరు నామకరణం చేయవద్దని సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను నిరసిస్తూ విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం ధర్నాకు దిగారు. కాళోజీ కళాక్షేత్రం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వారిలో విద్యార్థి నాయకులు దూడపాక నరేష్, కన్నం సునిల్, మణితేజ, శివ, సిద్దు పాల్గొన్నారు.

ఆర్‌ఎం కార్యాలయాన్ని సందర్శించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

● బస్సు సర్వీసులు, ప్రయాణికుల రద్దీపై ఆరా



వరంగల్ ఆర్‌ఎం కార్యాలయంలో ఎం.డి. సజ్జనార్

బాలసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఆర్టీసీ రీజినల్ కార్యాలయాన్ని మంగళవారం ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్ సందర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో భాగంగా వరంగల్‌కు వచ్చిన ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్ హనుమకొండ బస్టాండ్‌లోని ఆర్‌ఎం కార్యాలయంలో రీజినల్ మేనేజర్ డి.విజయభానుతో బస్సు సర్వీసులు, ప్రయాణికుల రద్దీపై మాట్లాడారు. అద్దె బస్సుల వివరాలు, లోకేషన్ వివరాలను తెలుసుకున్నారు.

ఎల్‌ఈడీ స్క్రీన్లపై సీఎం ప్రసంగం

హనుమకొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సభను నగరవాసుల వీక్షించేందుకు ట్రైసిటీలోని ప్రధాన కూడళ్లలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్ పర్యటించిన కాళోజీ కళాక్షేత్రం, హెలీప్యాడ్ సెంటర్, ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం ఎల్‌ఈడీలో కనిపించే విధంగా అనుసంధానం చేశారు. దీంతో వాహనదారులు కూడళ్లలో ఆగి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగంతో పాటు మంత్రుల ప్రసంగాలను ఆసక్తిగా వీక్షించారు. నగరంలో ఎన్నో రాజకీయ సభలు, సమవేశాలు జరిగాయి కానీ.. ఇలాంటి ఏర్పాట్లను ఎప్పుడూ చూడలేదని, ఎల్‌ఈడీ స్క్రీన్‌లను జంక్షన్‌లలో ఏర్పాటు చేయడం కొత్తగా ఉందని ప్రజలు చర్చించుకున్నారు.

22 మహిళా శక్తి భవన్‌ల నిర్మాణానికి శ్రీకారం

వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం

హనుమకొండ సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 22 జిల్లాల్లో మహిళా శక్తి భవన్‌ల నిర్మాణానికి శ్రీకారంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. విజయోత్సవ సభ వేదికపై డిజిటల్ ప్లాట్‌ఫామ్ నుంచి ఆయన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన (వర్చువల్) చేశారు. 22 జిల్లాలో ఉమ్మడి వరంగల్‌లోని జిల్లాలు ఉన్నాయి. కోటికి పైగా నిధులతో ఒక్కో భవనం నిర్మాణం కానుంది. భవనాల నమూనాలను వేదికపై ఉన్న డిజిటల్ స్క్రీన్ ద్వారా ప్రదర్శించా రు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు వేదికపై ఉన్న మంత్రులు ఇతర ప్రజాప్రతినిధులు తిలకించారు.

మాస్టర్‌ప్లాన్-2041 ఆవిష్కరణ

వరంగల్ నగర మాస్టర్‌ప్లాన్-2041ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభ వేదికపై ఆవిష్కరించారు. మాస్టర్‌ప్లాన్-2041 ఆవిష్కరణ కూడా డిజిటల్ రూపంలోనే జరిగింది. నాలుగున్న దశాబ్దాలుగా మాస్టర్‌ప్లాన్ సవరణ లేదని, ముఖ్యమంత్రి చొరవతో మాస్టర్‌ప్లాన్-2041 ఆవిష్కరణ కావడంతో వరంగల్ అభివృద్ధికి దిశా, నిర్దేశం జరిగిందనే అభిప్రాయాలను జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎంపీ కావ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి ఆనందంతో రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేశారు.

సీఎంకు ఎమ్మెల్యే నాయిని జ్ఞాపిక



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళా శక్తిని వివరించే చిత్రంతో కూడిన జ్ఞాపికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బహూకరించారు. ఇందిరాగాంధీ మహిళా శక్తి విజయోత్సవ సభలో వేదికపై జరిగిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ నాయకులు ఈవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మేయర్



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్: వరంగల్ నగరంలో మంగళవారం జరిగిన పలు కార్య క్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కాగా బాలసముద్రంలోని హయగ్రీవచారీ మైదానం కాళోజీ కళాక్షేత్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసి హెలీప్యాడ్ వద్ద ముఖ్యమంత్రిని మేయర్ సుధారాణి కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. వరంగల్ నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సీఎంకు సుధారాణి వివరించారు.

పేదలకు భూములిచ్చిన ఘనత ఇందిరాగాంధీదే..

అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

హనుమకొండ చౌరస్తా, నవంబరు 19: (ఆంధ్రజ్యోతి): నిరుపేదలను ఆదుకోవడానికి దేశంలోనే తొలిసారిగా ల్యాండ్ సీలింగ్ చట్టం తీసుకువచ్చి వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను పంచిన ఘనత ఉక్కు మహిళ, దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీకే దక్కుతుందని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 107జయంతి వేడుకలు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి సురేఖ ఇందిరాగాంధీ చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ అంటరానితనం, పేదరికాన్ని నిర్మూలించడానికి విశేషంగా కృషిచేసిన నాయకురాలు ఇందిరా గాంధీ అన్నారు. దేశం అభివృద్ధి కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయని మహోన్నతవ్యక్తి ఇందిరాగాంధీని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, శ్రీమాన్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు

నకిలీ వైద్యులపై టీజీఎంసీ అధికారుల కేసులు

వరంగల్ మెడికల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అర్హతకు మించి వైద్యం చేస్తూ అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్న నకిలీ వైద్యులపై తెలంగాణ వైద్య మండలి అధికారులు దాడులు చేస్తున్నారు. ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలో 41 మంది నకిలీ వైద్యులు ఆర్‌ఎంపీ, పీఎంపీలపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఎంఎన్‌సీ చట్టం 34, 54 టీఎస్‌ఎంపీఆర్ చట్టం 22 ప్రకారం కేసులు నమోదు చేసినట్లు తెలంగాణ వైద్య మండలి వైస్ చైర్మన్ డాక్టర్ గుండాగాని శ్రీనివాస్ తెలిపారు. ఎన్‌ఎంసీ చట్టం ప్రకారం వైద్య మండలిలో రిజిస్ట్రేషన్ లేకుండా ఎవరూ అల్లోపతి మందులు రాయకూడదు. అలా చేస్తే ఒక సంవత్సరం జైలుశిక్షతోపాటు రూ.5లక్షల వరకు జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో కూడా నకిలీ వైద్యులపై ఉన్న పెండింగ్ కేసులను త్వరలోనే ఫైల్ చేయనున్నామని, కొత్త విజిలెన్స్ ఆఫీసర్లను ఈ నెలలో నియమించనున్నట్లు తెలిపారు. ఇక ముందు జరిగే తనిఖీల సంఖ్య రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రతరం చేసి త్వరితగతిన ఫైల్ చేస్తామని తెలియజేశారు.

సాంకేతిక పరిశోధనలపై ఒప్పందం

శంభునిపేట, నవంబరు 19: విద్య, సాంకేతికపరమైన పరిశోధనలతో పాటు సాంస్కృతిక మార్పిడీ చేసుకునేందుకు వరంగల్‌లోని బొల్లికుంట వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ కళాశాలతో ఎస్ఆర్ యూనివర్సిటీలు పరస్పరం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా బొల్లికుంట వాగ్దేవిలో జరిగిన సదస్సులో ఇరు విద్యాసంస్థల ప్రతినిధులు పలు అంశాలపై సానుకూలంగా చర్చించుకున్నారు. అనంతరం ఎస్ఆర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ దీపక్ గార్గ్, వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రకాశ్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సయ్యద్ ముస్తాక్ అహ్మద్‌లు ఎంఓయూ పత్రాలను ఒకరికొకరు మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యానగరంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాలోనే రెండు అతి పెద్ద విద్యాసంస్థలు అయిన వాగ్దేవి, ఎస్ఆర్‌లు ఒప్పందం కుదుర్చుకోవడంతో రెండు విద్యాసంస్థల్లోని సాంకేతిక పరమైన పరిజ్ఞానం మార్పిడి జరిగి విద్యార్థులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుతాయన్నారు. ఒప్పందంలో భాగంగా బోధన, బోధనేతర, పరిశోధన, వృత్తిపరమైన అభివృద్ధి, పరిశోధన ప్రాజెక్టులు, అకడమిక్ పేపర్లను సంయుక్తంగా నిర్వహించడం, పాఠ్యాంశాల రూపకల్పన, వర్క్‌షాపులు, ఉమ్మడి సెమినార్‌లు, సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు, లైబ్రరీ, క్రీడలు ఇతర అంశాల్లో ఇరు విద్యాసంస్థలు కలిసి పనిచేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్, వాగ్దేవి విద్యాసంస్థల ప్రతినిధులు, డాక్టర్ చింతకింది రాజు డాక్టర్ బాలాజీ మారమ్, డాక్టర్ సందీప్ భట్టాచార్య, డాక్టర్ బిగిరిరాజన్, డాక్టర్ రేఖ గంగుల, డాక్టర్ ఆర్. నవీన్, దినేష్, మనోహర్, పి. పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేయిస్తంభాలగుడిలో సంకటహర చతుర్థి

హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వేయిస్తంభాల గుడిలో మంగళవారం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని ఉత్తిష్ఠగణపతికి పంచామృతాభిషేకం, గరిక పూజ నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో పుట్టమట్టి లింగాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం మహిలింగార్చన నిర్వహించారు. కార్తీక సమారాధనను పెద్ద ఎత్తున జరిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఉప కమిషనర్ టి.శ్రీకాంతారావు పాల్గొన్నారు. శ్రీనివాసరావు దంపతులు ఉభయదాతలుగా వ్యవహించారు. పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నవారిలో వేదపండితులు జోషి భరత్ శర్మ, పర్లి మణికంఠ శర్మ, గుమ్మడవెల్లి ఆశ్రిత శర్మ పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఈవో వెంకటయ్య పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లపై మంత్రి తుమ్మల ఆరా

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడిన మంత్రి



జిన్నింగ్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న సీసీఐ అధికారులు, ప్రతినిధులు

వరంగల్ వ్యవసాయం, నవం బరు 19: (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర వ్యాప్తం గా మద్దతు ధరతో సీసీఐ పత్తి కొనుగోలు తీరుపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆరా తీశారు. ఇందులో భాగంగా వరంగల్‌లోని ఆదిత్య సాయి కాటన్ స్పిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో. సురేఖ, వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, తెలంగాణ కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, పత్తి రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పత్తి రైతులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం సీసీఐ కొనుగోలు చేసిన పత్తి నాణ్యతను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాటన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తితో పెట్టుకోవద్దు..

రంగశాయిపేటలో అఘోరీ మాత



హిందూ శ్మశానవాటికలో అఘోరీ

శంభునిపేట, నవంబరు 19: భారత దేశం అంటేనే మహిళా శక్తి అని, మహిళా శక్తితో పెట్టుకుంటే అంతం తప్పదని అఘోరీ మాత హెచ్చరించారు. కేదారినాథ్ ప్రాంతానికి చెందిన నాగసాధు అఘోరీ మాతా తెలంగాణ పర్యటనలో భాగంగా మంగళవారం నగరంలోని రంగశాయిపేట బెస్తం చెరువు వద్ద గల హిందూ శ్మశానవాటికలో తన దైనందిన పూజలు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు తండోపతండాలుగా వచ్చి అఘోరీమాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అఘోరీమాత మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ధర్మాన్ని పాటించాలన్నారు. ఆడపిల్లలపై అత్యాచారాలను అరిక ట్టాలని అందుకు తాను చేస్తున్న ధర్మ పోరాటానికి మద్దతు ఇవ్వాలని తెలిపారు.

ప్రజా పాలనలో వైద్య ఆరోగ్య సేవలు

వరంగల్ మెడికల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ తరుపున 8 ప్రథమ చికిత్స కేంద్రాలు, ఐదు ఆరోగ్య సేవా కేంద్రాలను నిర్వహించినట్లు హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.అప్పయ్య తెలిపారు. వీటి ద్వారా 1158 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ముగ్గురిని చికిత్స నిమిత్తం రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ కె.లలితాదేవి, డాక్టర్ హిమబిందు, విక్రమ్, అశోక్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలోనే డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలి

హనుమకొండ టౌన్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై పాఠశాల స్థాయిలోనే అవగాహన కల్పించాలని నార్కోటిక్ విభాగం డైరెక్టర్ సందీప్ శాండిల్యా అన్నారు. నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయిలోనే 'నో డ్రగ్, నో డ్రింక్స్, నో స్మోక్' అనే అంశాలపట్ల అవగహన కల్పిస్తే యువత వాటిజోలికి వెళ్లకుండా ఉంటారన్నారు. నార్కోటిక్స్ పీఎస్ పరిధిలో కొంతమంది టీనేజీ పిల్లలు గంజాయి బానిసలుగా మారగా విముక్తి కల్పించేందుకు అడిక్షన్ సెంటర్‌లలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. టీజీ న్యాబ్ ఎస్పీ సాయిచైతన్య, వరంగల్ నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ సైదులు పాల్గొన్నారు.

నార్కోటిక్స్ పీఎస్‌ను ప్రారంభించిన సీఎం

డ్రగ్స్ నివారణకు వరంగల్ ఇండస్ట్రియల్ ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేసిన వరంగల్ నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం కాళోజీ కళాక్షేత్రం ప్రాంగణం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. కార్యక్రమంలో నార్కోటిక్ విభాగం డైరెక్టర్ సందీప్ శాండిల్య, శాంతిభద్రతల అదనపు ఎస్పీ మహేశ్ భగవత్, టీజీ న్యాబ్ ఎస్పీ సాయిచైతన్య పాల్గొన్నారు.



డీఎస్పీ సైదులను కుర్చీలో కూర్చోబెడుతున్న సందీప్‌శాండిల్య

కాంగ్రెస్ ప్రభుత్వానివి గ్యారంటీ లేని హామీలు

హసన్‌పర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వానికి గ్యారెంటీ లేని హామీలని సీపీఎం పార్టీ జిల్లా సెక్రటరి మెంబర్ వాసుదేవరెడ్డి అన్నారు. మండలంలోని చింతగట్టు ఎస్‌పీఆర్ ఫంక్షన్ హాలులో సీపీఎం మండల కమిటీ సమావేశం సీఐటీయూ మండల కార్యదర్శి పుల్ల అశోక్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా సెక్రటరి మెంబర్‌లు సారంపల్లి వాసుదేవరెడ్డి, గాద ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. 2014లో బీజేపీ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కేంద్రంలో పాలన సాగిస్తుంటే ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ స్కీముల పేరుతో ప్రజలను మోసం చేస్తుందని ఎద్దేవా చేశారు. డిసెంబరు 14, 15వ తేదీలలో నిర్వహించతలపెట్టిన జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు.

25న వర్సిటీల పార్ట్‌టైమ్ అధ్యాపకుల సదస్సు

కేయూ క్యాంపస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పనిచేస్తున్న పార్టుటైమ్ అధ్యాపకుల రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు కేయూ పార్టుటైమ్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సొల్తి కిరణ్‌గౌడ్ వెల్లడించారు. మంగళవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిసి పార్టుటైమ్ అధ్యాపకులను టైంస్కేల్‌గా అధ్యాపకుడిగా అప్‌గ్రేడ్ చేయాలని వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా కిరణ్‌గౌడ్ మాట్లాడుతూ.. వర్సిటీలో 16 పీరియడ్ల పూర్తి వర్క్‌లోడ్ ఉన్న అధ్యాపకులను మినిమం టైంస్కేల్ అధ్యాపకులుగా గుర్తించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో చర్చించి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానని వీసీ ప్రతాప్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈనెల 25న కేయూ ఎస్డీఎల్‌సీఈలోని ప్రొఫెసర్ జాఫర్‌నిజాం హాల్‌లో జరిగే సదస్సును విజయవంతం చేయాలని అన్నారు. పార్టుటైమ్ అధ్యాపకుల సమస్యలపై కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నాయకులు సొల్తి కిరణ్‌గౌడ్, జనరల్ సెక్రటరీ డాక్టర్ నాగేశ్వర్‌రావు, మోహన్, కుమార్, స్వామి, లక్ష్మినారాయణ, సాహితీ, సుభాష్, లక్ష్మణ్, రవీందర్, రమేశ్, శ్యాంసుందర్ చారి పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రాంగణ నియామకాల పరీక్షలు

కేయూ క్యాంపస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నేతృత్వంలో మంగళవారం వర్సిటీ విద్యార్థులకు ప్రాంగణ నియామాల్లో భాగంగా ప్రాథమిక ఎంపికలు చేపట్టారు. కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు కంపెనీ ప్రతినిధులు రాత పరీక్షలు నిర్వహించారు. కేయూ క్యాంపస్‌లోని మహిళ ఇంజనీరింగ్, కో ఎడ్యుకేషన్, కిట్స్ కళాశాల ఇంజనీరింగ్ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ప్రాథమిక రాత పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహించి తుది ఎంపికలు చేపడుతారు. ఎంపికైన వారికి రూ.4లక్షల వార్షిక వేతనాన్ని చెల్లిస్తారు. ఈ కార్యక్రమంలో కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు, డాక్టర్ ఎన్ రమణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

వడ్డెపల్లి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. మంగళవారం హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో లైబ్రేరియన్ డాక్టర్ బి.యుగేందర్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రియాజ్ మాట్లాడారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళిగౌడ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, అధ్యాపకులు అరుణ, సారంగపాణి, మీనాక్షి పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి

కేయూ క్యాంపస్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ప్రముఖ కార్డియాలసిస్టు డాక్టర్ ఎంఎస్ గోపీనాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం కేయూ బాటనీ సెమినార్ హాల్‌లో డెమోక్రటిక్ స్టూడెంట్ అసోషియేషన్ (డీఎస్ఏ) తెలంగాణ రాష్ట్ర కమిటీ నేతృత్వంలో 'విద్యారంగ సమస్యలు- భవిష్యత్ కార్యాచరణ' అనే అంశంపై డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంఎస్ గోపీనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, పూలేల స్ఫూర్తితో నూతన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ)-2020 రద్దుకోసం పోరాటాలు చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ వెంకటదాస్ మాట్లాడుతూ.. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలతో ప్రభుత్వ విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్ఏ రాష్ట్ర కోకన్వీనర్ గణేశ్, శివలు మాట్లాడుతూ.. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ వర్సిటీలను, స్కిల్ వర్సిటీని రద్దు చేయాలని అన్నారు. విద్యాసంస్థల్లో మౌళిక వసతులు, విద్యా ప్రైవేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. ఈ సదస్సులో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సీఎం సభకు హాజరైన మహిళలు, ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





సీఎం సభ సక్సెస్

భారీగా తరలొచ్చిన మహిళలు

కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

సీఎం ప్రసంగానికి కేరింతలు కొట్టిన కార్యకర్తలు



పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎం



కాళోజీ జంక్షన్‌లో భారీ ఎల్ఈడీ స్క్రీన్‌పై సీఎం ప్రసంగం వింటున్న నగరవాసులు



ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి



సభా ప్రాంగణంలో కాంగ్రెస్ అభిమాని



కాళోజీ మ్యూజియాన్ని సందర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



మహిళా సంఘాలకు చెక్కుల అందజేస్తున్న సీఎం



మహిళలతో కరచాలనం చేస్తున్న సీఎం, చిత్రంలో డిప్యూటీ సీఎం, మంత్రులు



మహిళాశక్తి స్టాల్స్ సందర్శనలో సీఎంకు జ్ఞాపికను బహూకరిస్తున్న మహిళ

హనుమకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో మంగళవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన ఇందిరా మహిళాశక్తి , ప్రజా పాలన, విజయోత్సవ సభ సక్సెస్ అవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో విజయోత్సాహం కనిపిస్తోంది. సభా ప్రాంగణం మహిళలు, స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు, ప్రజలు, పార్టీ శ్రేణులతో నిండిపోయింది. కూర్చోవడానికి కుర్చీలు చాలక, స్థలం లేకపోవడంతో చాలా మంది సభా ప్రాంగణం బయటే నిల్చున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి సభకు తరలిరావడానికి వీలుగా బస్సులను ఏర్పాటు చేశారు. వారికి మజ్జిగ, స్నాక్స్ అందజేశారు. షెడ్యూల్ ప్రకారమే సభ జరగ్గా.. రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలపై నిప్పులు చెరిగారు. సుమారు 30 నిమిషాల పాటు ఆవేశపూరిత ప్రసంగం చేయడంతో కార్యకర్తలు, మహిళలు కేరింతలు కొట్టారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వైఫల్యాలను ఎత్తిచూపిన రేవంత్ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపైనా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్, కేటీఆర్, కిషన్‌రెడ్డి లక్ష్యంగా రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగం ఆద్యంతం ఉద్వేగంగా సాగింది.

మహిళల సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న సమయంలో మహిళలు చప్పట్లు కొడుతూ నృత్యం చేయడం కనిపించింది. అలాగే సీఎం తన ప్రసంగం ద్వారా ప్రభుత్వ లక్ష్యాలను వివరించడమే కాకుండా పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం కూడా చేశారు. ప్రతిపక్షాల విమర్శలను ఎక్కడికక్కడ తిప్పికొడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్న సంకేతాలను ఇచ్చారు. సీఎం పర్యటనలో జరిగిన ప్రతీ అంశాన్ని ప్రజలు తిలకించేలా నగరంలో పలు చోట్ల భారీ డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

సీఎం పర్యటన సాగిందిలా..

మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి బయల్దేరిన సీఎం 2.37గంటలకు హనుమకొండ హయగ్రీవచారి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో దిగారు. 2.47 గంటలకు కాళోజీ కళాక్షేత్రంలోని కాళోజీ నారాయణరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. 2.55గంటలకు కళాక్షేత్రంలోని ఆడిటోరియం, ఆర్ట్ గ్యాలరీని ప్రారంభించారు. 3.15 గంటలకు వరకు కళాక్షేత్రాన్ని సందర్శించి.. 3.30 గంటలకు సుబేదారిలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లోని విజయోత్సవ సభ ప్రాంగణానికి చేరుకున్నారు. 3.35 గంటలకు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎస్‌హెచ్‌జీల స్టాల్స్‌ను సందర్శించారు.

అందులోని ఉత్పత్తులను పరిశీలించారు. అక్కడి అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందితో ముచ్చటించారు. 3.45 గంటలకు సభా వేదికపైకి చేరుకున్నారు. 3.50 గంటలు జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. 5.15 గంటలకు ప్రసంగం ప్రారంభించగా.. 5:55 కి పూర్తయింది.

అనంతరం చెక్కులు పంపిణీ చేసి 6.15గంటలకు సభ ముగించుకుని అనంతరం హైదరాబాద్ తిరుగు ప్రయాణమయ్యారు.



కాళోజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కాళోజీ కళాక్షేత్రం.. జాతికి అంకితం

ప్రజాకవి విగ్రహం ఆవిష్కరణ, నివాళి

- ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- మంత్రులతో కలిసి డాక్యుమెంటరీని తిలకించిన సీఎం

బాలసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో నిర్మించిన ప్రజాకవి కాళోజీ కళాక్షేత్రాన్ని మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, వివిధ శాఖల మంత్రులతో కలిసి ప్రారంభించారు. కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన కాళోజీ విగ్రహాన్ని డ్రోన్ కెమెరాతో ఆవిష్కరించి కాళోజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వరంగల్‌లోని వివిధ అభివృద్ధి పనులను డిజిటల్ పద్ధతిలో శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం కాళోజీ కళాక్షేత్ర భవనానికి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆర్ట్స్ గ్యాలరీకి చేరుకుని కాళోజీ రచనలు, పుస్తకాలను పరిశీలించి కాళోజీపై తీసిన డాక్యుమెంటరీని సీఎం తిలకించారు. అంతకుముందు మధ్యాహ్నం 2:41 నిమిషాలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో హయగ్రీవచారి గ్రౌండ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, సీఎస్ శాంతికుమారి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సీఎంకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి కాలినడకన 2:47 నిమిషాలకు కాళోజీ కళాక్షేత్రానికి చేరుకున్నారు.

అక్కడ భద్రకాళి దేవాలయం ప్రధానార్చకుడు శేషు, వేదపండితులు సీఎంకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కళాక్షేత్రంలోకి వచ్చిన సీఎంకు పోలీసులు గౌరవ వందనం చేశారు. 2:49 నిమిషాలకు కాళోజీ విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించిన తరువాత కాళోజీ గ్యాలరీని సందర్శించి కాళోజీ ట్రస్ట్ సభ్యులతో మాట్లాడారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలోని ఆడిటోరియంలో కాళోజీ డాక్యుమెంటరీని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి తిలకించారు. కాళోజీ కుటుంబసభ్యులను కలిసి వారితో మాట్లాడారు.

అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బస్సులో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, యశస్వినీరెడ్డి, కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, ఇతర ప్రజా ప్రతినిధులు ఆర్ట్స్ కాలేజీలో జరిగే ప్రజా పాలన-ప్రజా విజయోత్సవ సభకు బయలుదేరారు.



కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం తదితరులు

వరంగల్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

రూ.4601.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

బాలసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కాళోజీ కళాక్షేత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి హనుమకొండ కుడా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ప్రత్యేక హెలిక్యాప్టర్ ద్వారా చేరుకున్నారు. ముందుగా కాళోజీ నారాయణరావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం కాళోజీ ప్రాంగణంలో అక్కడ ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా రూ.4,601.15 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను సీఎం చేశారు.

అభివృద్ధి పనుల వివరాలు ఇలా..

- రూ.90కోట్లతో కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం
- రూ.4,170 కోట్లతో అండర్‌డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన
- రూ.12 లక్షలతో నార్కొటిక్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం
- రూ.8.30 కోట్లతో నయీంనగర్ బ్రిడ్జి ప్రారంభం
- రూ.3 కోట్లతో వరంగల్ తూర్పు అభివృద్ధి పనుల శంకుస్థాపన
- రూ.28 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల భవనానికి శంకుస్థాపన
- రూ.160.3 కోట్లతో ఫ్లడ్ డ్రెయినేజీ సిస్టంకు శంకుస్థాపన
- రూ. 13 కోట్లతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు టౌన్‌షిప్ ఆవరణలో పీహెచ్‌సీ, ప్రైమరీ స్కూల్, పశు వైద్యశాలకు శంకుస్థాపన
- రూ.49.50 కోట్లతో వరంగల్ పట్టణం నుంచి ఎర్రగట్టుగుట్ట 4 లైన్ల రోడ్డు విస్తరణకు శంకుస్థాపన
- రూ.65 కోట్లతో పరకాల నుంచి ఎర్రగట్టుగుట్ట 4 లైన్ల రోడ్డు విస్తరణకు శంకుస్థాపన
- రూ.11.6 కోట్లతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో మౌలిక సదుపాయాల కల్పనకు శంకుస్థాపన
- రూ. 1.50 కోట్లతో వరంగల్ ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసే ఉర్దూ భవనానికి శంకుస్థాపన చేశారు.

ప్రశాంతంగా ముఖ్యమంత్రి పర్యటన

- నిరసనలకు సిద్ధమైన ప్రతిపక్ష, పలు విద్యార్థి సంఘాల నాయకులు
- తెల్లవారుజాము నుంచే ముందస్తు అరెస్టులు
- సభ సాఫీగా సాగడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు



పోలీసుల అదుపులో కేయూ బీఆర్ఎస్వీ నాయకులు

హనుమకొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చెదురుమదురు ఘటనలు మినహా సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సాఫీగా సాగింది. సీఎం పర్యటన నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు నిరసలకు సిద్ధమైన వివిధ రాజకీయపార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులను సోమవారం అర్ధరాత్రి నుంచే ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. కుడా మైదానం నుంచి ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సభ జరిగే ఆర్ట్స్ కళాశాల మైదానం వరకు అడుగడుగునా పోలీసులు పహారా ఏర్పాటు చేశారు.

సోమవారం రాత్రి నుంచే కాళోజీక్షేత్రం, హెలీప్యాడ్, సభా ప్రాంగణాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇక మంగళవారం సీఎం కాన్వాయ్ సభాస్థలికి వచ్చే సమయంలో స్వేరోస్ ఆధ్వర్యంలో అదాలత్ వద్ద ఆందోళనకు సిద్ధమవుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా కాళోజీ కళాక్షేత్రంలో కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కాళోజీ జంక్షన్‌లో సౌత్ ఇండియా స్టూడెంట్ ఆర్గనైజేషన్, తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసనకు ప్రయత్నిస్తుండగా పోలీసులు వారిని అరెస్టు చేశారు. బాలసముద్రంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్‌లను అబ్ధిదారులకు పంపిణీ చేయాలని చేపట్టిన ఘటన మినహా నిరసనకారుల నుంచి పెద్దగా ఆందోళనలు కనిపించలేదు. అలాగే సభకు మహిళలను అధిక సంఖ్య తరలించేందుకు వచ్చిన ఆర్టీసీ బస్సులను ఆర్ట్స్ కళాశాల వద్ద నిలపడంతో అటు నుంచి వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా బారికేడ్‌లతో మూసేశారు. డైవర్షన్ మార్గంలో ట్రాఫిక్ జామ్ కాకుండా పెట్రో లింగ్ పార్టీలను ఏర్పాటు చేశారు. పెద్దగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఎం పర్యటన ప్రశాంతంగా ముగియడంతో కమిషనరేట్ పోలీసులతో పాటు ఇతర జిల్లాల నుంచి విధులకు హాజరైన పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అపరిచితులపై నిఘా పెట్టారు.

ఇక సభా వేదిక ర్యాంపుపై మహిళా మంత్రుల తో కలిసి మహిళలకు సీఎం అభివాదం చేస్తుండగా కొందరు ఆయనతో కరచాలనం చేసేందుకు ప్రయత్నించారు. దీంతో వేదికపైఉన్న అదనపు డీజీ మహేశ్ భగవత్ హుటాహుటిన ర్యాంపుపైకి వచ్చి ఆ మహిళలను నిలువరించే ప్రయత్నం చేశారు.

అలాగే సభా ప్రాంగణంలో అనుమానితులను గుర్తించి పట్టుకునేందుకు మఫ్టీలో ఉన్న పోలీసులతో నిఘా పెట్టారు.



స్వేరోలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మహిళా శక్తి స్టాళ్లను పరిశీలించిన సీఎం

- అంగన్‌వాడీ టీచర్లకు సీఎం ఆటోగ్రాఫ్
- ప్రతిభ చూపిన వివిధ జిల్లాలకు చెందిన చేతివృత్తుల కళాకారులు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మంగళవారం జరిగిన ఇందిరా మహిళాశక్తి విజయోత్సవాల సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా సంఘాలతో మమేకమయ్యారు. కాళోజీ క్షేత్రం ప్రారంభం అనంతరం ఆర్ట్స్ కళాశాల సభా ప్రాంగణానికి ప్రత్యేక బస్సులో మంత్రులు, ఎమ్మెలతో కలిసి 3.37 నిమి షాలకు చేరుకున్నారు. తొలుత మహిళా స్వశక్తి సంఘాలు, మహిళా కళాకారులు, చేనేత వస్త్రాలు, చేతి వృత్తులు, ఆర్ట్ గ్యాలరీని పరిశీలించారు. 26స్టాళ్లను సందర్శించి నిర్వాహకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కళాకారులతో మాట్లాడారు. 'అందరూ బాగున్నారా..' అని ఆయన పలకరించడంతో సిబ్బంది, మహిళలు, కళాకారులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఈ క్రమంలో సీఎం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నారాయణపేట చీరలు, వరంగల్ స్టాల్‌లోని జనపనార సంచులు (జూట్ బ్యాగ్స్), చేర్యాల నకాశి పెయింటింగ్స్ అండ్ మాస్క్స్, కరీంనగర్ జిల్లాకు చెందిన సహజ తేనె, వరంగల్‌కు చెందిన వారాహి హోంఫుడ్స్, హనుమకొండకు చెందిన సంప్రదాయ చెక్క ఎద్దుల బండ్లు, వరంగల్‌కు చెందిన ఇంటి అలంకరణ వస్తువులు, డిజైనర్ బ్లౌజెస్ స్టాళ్లను సందర్శించారు.

అలాగే సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన తేలు సంచులు, కరీంనగర్ జిల్లాకు చెందిన కలంకారి చేనేత వస్త్రాల యూనిట్, నిర్మల్ జిల్లాకు చెందిన వరికుచ్చులు, నల్లగొండ జిల్లాకు చెందిన నీటి సువాసన ఉత్పత్తులు, నారాయణపేటకు చెందిన చెర్రకోట చేతిలో తయారు చేసిన ఆభరణాలు, మేడ్చల్ జిల్లాకు చెందిన బీట్స్, సంగారెడ్డి జిల్లాకు చెందిన చెక్కబొమ్మలు, రంగారెడ్డి జిల్లాకు చెందిన సీషెల్ వస్తువులు, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇప్పపువ్వు లడ్డూ, వరంగల్‌కు చెందిన కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, హనుమకొండకు చెందిన మెహిందీ ఆర్టిస్టీ, ఖమ్మం జిల్లాకు చెందిన సిరి ధాన్యాలు, వరంగల్, ములుగు జిల్లాలకు చెందిన బ్యూటీ అండ్ హెర్బల్, శానిటరీ నాప్కిన్స్, వరం గల్‌కు చెందిన కోల్డ్ ప్రెస్ ఆయిల్, చిరుధాన్యాల ఆహారం, జయశంకర్ భూపాలపల్లికి చెందిన చిల్లీ పౌడర్, హనుమకొండకు చెందిన పసుపు, హోం ఫుడ్, మిల్లెట్ ఫ్లోర్, జనగామకు చెందిన చిల్ప్ చీరలు, చేనేత వస్త్రాలతో కూడిన స్టాళ్లను సందర్శించి ఆ మహిళలను అభినందించారు.



సీఎం ఆటోగ్రాఫ్‌ను చూపిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సీఎం ఆటోగ్రాఫ్ ఇవ్వడం సంతోషంగా ఉంది

సుమలత (అంగన్‌వాడీ టీచర్), రమణతార (కార్యకర్త)

మా అంగన్‌వాడీ స్టాల్‌కు వచ్చిన సీఎం వస్తువుల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు బోధించే పుస్తకాలను చూసి సంతోషం వ్యక్తం చేశా రు. సీఎం వెళ్లిపోతుండగా ఒక పుస్తకంపై 'అంగన్ వాడీ దర్శనం.. గొప్ప అనుభూతి' అని రాసి సంతకం చేశారు. సీఎం ఇచ్చిన ఆటోగ్రాఫ్.. మా సిబ్బందికి సంతోషాన్నిచ్చింది. అది మాకు తీపి గుర్తుగా మిగిలిపోతుంది. స్ఫూర్తిని కూడా నింపింది.



పెన్సిల్‌తో సీఎం చిత్రం

కళాకారిని భవ్యశ్రీకి రేవంత్ అభినందన

వర్ధమాన కళాకారిని భవ్యశ్రీ పెన్సిల్‌తో సీఎం రేవంత్ చిత్రాన్ని గీసి ఆయనకు బహూకరించింది. ఈ సందర్భంగా ఆమెతో సీఎం మాట్లాడుతూ 'నా ఫొటో పెన్సిల్‌తో చిత్రీకరించి నాకే బహుమతిగా ఇచ్చినందుకు నీకు కృతజ్ఞతలు' అని అభినందించారు. ఇంత చక్కటి కళను ఎలా నేర్చుకున్నావు ? అని సీఎం అడగ్గా.. తనకు చిన్ననాటి నుంచి ఆర్ట్ అంటే ఇష్టమని, ప్రస్తుతం హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఫైన్ ఆర్ట్స్ చేస్తున్నానని తెలపింది.

తన తల్లి మహిళా సంఘం నుంచి తీసుకున్న రూ.1.50 లక్షల లోన్‌తో ఇప్పటి వరకు సుమారు 200కు పైగా ఆర్ట్ ద్వారా చిత్రాలు తీశానని సీఎంకు వెల్లడించింది. దీంతో తప్పకుండా తన వంతుకు ఆర్థిక సహాయం చేస్తానని సీఎం రేవంత్ భవ్యశ్రీకి హామీ ఇచ్చారు.

సమన్వయ లోపం.. ఇబ్బంది పడ్డ మహిళలు

హనుమకొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సభకు వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన మహిళలకు అరటిపండ్లు అందజేసేందుకు సభాస్థలి ప్రాంగణంలో రెండు డీసీఎం వ్యాన్‌లల్లో అరటిపండ్లు అందుబాటులో ఉంచారు. వాటి పంపిణీ చేయడంలో అధికారులు, నాయకుల పర్యవేక్షణ లేకపోవడంతో మహిళలు వ్యానులపై ఎగపడ్డారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగి మహిళలు అరిచారు. కొంత మందిపైనుంచి అరటిపండ్ల బాక్స్‌లు పడ్డాయి. మరికొంత మంది మహిళలు ఇదే చాన్స్ అన్నట్లుగా ఒక్కొక్కరు ఎన్ని దొరికితే అన్నీ వెంట తీసుకపోవడం కనిపించింది.

తాగునీరు, ఆహారం విషయంలో సరైన ఏర్పాటు చేసినా పంపిణీ చేయడంలో విఫలమయ్యారు. ఆర్ట్స్ కళాశాల ప్రధాన గేటు నుంచి గ్రౌండ్ గేటు వరకు ఎలాంటి మూత్రశాలలు ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



అజ్రక్ మోడాల్ చీరలు తాజాగా అతివల మనసులను దోచుకుంటున్నాయి. మిలమిల మెరిసిపోతూ, మృదువుగా ఉండే ఈ చీరల ప్రత్యేకత వినూత్నమైన అజ్రక్ డిజైన్లలో దాగి ఉంటుంది. అదరగొట్టేస్తున్న అలాంటి కొన్ని అజ్రక్ చీరలు 'నవ్య' పాఠకుల కోసం...

అజ్రక్ అదరహో

మోడాల్ సిల్క్ మీద అజ్రక్ ప్రింట్లు అద్దుకున్న చీరలే అజ్రక్ మోడాల్ చీరలు. మోడాల్ అనే రయాన్ వస్త్రానికి పట్టును జోడిస్తే తయారయ్యే వస్త్రం మన్నిక ఎక్కువ. సుతిమెత్తగా, సౌకర్యవంతంగా ఉండే ఈ వస్త్రానికి పట్టును జోడించి, విలాసవంతమైన, మెరుపులీనే అందమైన చీరలను రూపొందిస్తూ ఉంటారు. అజ్రక్ అనే ప్రాచీన చేనేత నైపుణ్యం గుజరాత్, రాజస్థాన్‌లలో రూపం పోసుకుని భారతదేశమంతా విస్తరించింది. ఈ చీరల మీద అద్దే కుర్రచ్ అద్దకాలు విభిన్నంగా ఉండి, చీరలకు సరికొత్త హంగులను తెచ్చిపెడతాయి.







ఎరుపు మెరుపు

అజ్రక్ చీరల్లో ఎరుపు రంగే ఎక్కువగా ఆకట్టుకుంటూ ఉంటుంది. కాబట్టే ఈ రంగు చీరలు ఎక్కువగా రూపొందుతూ ఉంటాయి. ఎరుపుతో పాటు నలుపు, నీలం రంగుల చీరలు, మిశ్రమ రంగులు చీరలు కూడా మహిళలను ఆకట్టుకుంటున్నాయి. చేనేత పనితనం, అందమైన అద్దకాల సమ్మేళనం వల్ల సృజనాత్మకతతో కూడిన అజ్రక్ చీరలు రూపొందుతున్నాయి. కలకాలం చెక్కుచెదరని రంగులు, అద్దకాలు, మెరుపు కోల్పోని జరీ ఈ చీరల ప్రత్యేకతలు.

ఇలా సింగారించాలి

అజ్రక్ చీరలతో పాటు కుట్టించే జాకెట్టుతోనే చీర మొత్తానికి ఆకర్షణ చేకూరుతుంది. కాబట్టి సాదాసీదాగా కాకుండా, వినూత్నమైన తరహాలో జాకెట్లను కుట్టించుకోవాలి. జరీ అంచు చేతుల మీదకు వచ్చేలా, వెనకవైపు డోరీలు ఉండేలా కుట్టించుకోవాలి. కుందన్, పోల్కీ హారాలు, సంప్రదాయ ఆభరణాలు ఈ తరహా చీరలకు ఎంతో బాగా నప్పుతాయి.

చలికాలంలో వేడిగా తాగండి!

చలికాలంలో సహజంగానే బద్ధకంగా, నీరసంగా అనిపిస్తుంటుంది. వాతావరణం చల్లగా ఉండడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గి రోగనిరోధక శక్తి బలహీనమవుతుంది. తరచూ జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు వేధిస్తుంటాయి. వీటి నుంచి ఉపశమనం పొంది రోజంతా ఉత్సాహంగా పనిచేయడానికి ఉదయాన్నే వేడిగా కొన్ని పానీయాలు తాగడం మంచిదని అంటున్నారు నిపుణులు. వాటి గురించి తెలుసుకుందాం!

అల్లం-నిమ్మకాయ టీ



- అల్లం, నిమ్మకాయ రెండూ శరీర ఉష్ణోగ్రతను పెంచుతాయి. వీటిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు గొంతు గరగరను నివారిస్తాయి. నిమ్మకాయలోని సి-విటమిన్ వ్యాధులను వ్యాప్తి చేసే బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఒక గిన్నెలో రెండు చిన్న అల్లం ముక్కలు వేసి, అందులో ఒక గ్లాసు మంచినీళ్లు పోసి బాగా మరిగించాలి. తరవాత ఈ నీళ్లను వడబోసి అందులో రెండు చెంచాల నిమ్మరసం కలిపి వేడిగా తాగాలి.

పసుపు పాలు



- పసుపులోని కర్క్యుమిన్ గుండె జబ్బుల నివారణకు, నరాలు పటిష్టంగా ఉండేందుకు తోడ్పడుతుంది. చలికాలంలో కీళ్ల పట్టేయకుండా కాపాడుతుంది. పాలలోని కాల్షియం ఎముకలను దృఢంగా ఉంచుతుంది. ఒక గ్లాసు వేడి పాలలో ఒక చెంచా పసుపు, చిటికెడు నల్ల మిరియాల పొడి, ఒక చెంచా తేనె కలిపి తాగితే రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. ఈ కషాయంలో మిరియాల పొడిని కలపడం వల్ల పసుపులోని కర్క్యుమిన్ పూర్తిస్థాయిలో శరీరానికి అందుతుంది.

దాల్చిన చెక్క పానీయం



- దాల్చిన చెక్క జీవక్రియలను వేగవంతం చేసి శరీరాన్ని ఉత్సాహపరుస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది. ఒక గ్లాసు వేడినీటిలో అర చెంచా దాల్చిన చెక్క పొడి, ఒక చెంచా తేనె వేసి బాగా కలిపి వేడిగా ఉన్నప్పుడే తాగాలి.

నిమ్మకాయ-తేనె



- నిమ్మరసం, తేనెల మిశ్రమం శరీరంలోని వ్యర్థ పదార్థాలను బయటికి పంపుతుంది. జీర్ణాశయం, కాలేయం సక్రమంగా పనిచేసేలా చూస్తుంది. ఒక గ్లాసు వేడి నీళ్లలో మూడు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల తేనె కలిపి వేడిగా తాగితే చలికాలంలో వచ్చే శ్వాసకోశ సమస్యలనుంచి ఉపశమనం కలుగుతుంది.

తులసి-పుదీనా



- తులసి ఆకులు ఒత్తిడిని తగ్గిస్తాయి. పుదీనా పొట్టను శుభ్రం చేస్తుంది. ఒక గ్లాసు వేడినీటిలో అయిదు తులసి ఆకులు, ఎనిమిది పుదీనా ఆకులు వేసి కొంతసేపు నాననివ్వాలి. గోరువెచ్చని ఈ పానీయం తాగుతున్నపుడు వచ్చే సువాసన వల్ల మనసుకు ఉత్సాహం కలిగి శరీరానికి బద్ధకం వదులుతుంది.

యాపిల్ సైడర్ వెనిగర్-తేనె



- యాపిల్ సైడర్ వెనిగర్ శరీరంలో పీహెచ్ స్థాయిని నియంత్రణలో ఉంచుతుంది. ఒక గ్లాసు వేడినీటిలో ఒక చెంచా యాపిల్ సైడర్ వెనిగర్, ఒక చెంచా తేనె కలపాలి. దీని రుచి అద్భుతంగా ఉంటుంది. ఈ పానీయం తాగిన వెంటనే కడుపులో తేలికగా ఉన్న భావన కలుగుతుంది. శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది.

కశ్మీరీ కహ్వా



- ఒక గిన్నెలో రెండు గ్లాసుల మంచి నీళ్లు, రెండు యాలకులు, చిన్న దాల్చిన చెక్క ముక్క, ఒక చెంచా గ్రీన్ టీ ఆకుల పొడి, రెండు చెంచాల ఎండు గులాబీ రేకులు వేసి బాగా మరిగించాలి. తరవాత ఈ నీళ్లను వడబోసి అందులో ఒక చెంచా తేనె, కొన్ని బాదం పలుకులు, కుంకుమ పువ్వు రేకులు వేసి బాగా కలపాలి. ఈ పానీయాన్ని పొద్దున్నే వేడిగా తాగితే జలుబు, ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం కలుగుతుంది. దీని ఘాటైన పరిమళం అలసటను, ఒత్తిడిని తగ్గిస్తుంది.

వ్యర్థాలు లేని గ్రామం... ఆమె ధ్యేయం

జీవనాధారమైన నది కాలుష్యం చేరి విషతుల్యంగా మారుతున్నా... ఏం చెయ్యగలమనే నిర్లిప్తతతో ఉన్న గ్రామస్తుల్లో పెనుమార్పుకు నాంది పలికారు ఇతిశా సారా. లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ఐకమత్యంగా పని చేస్తే సాధించలేనిదేదీ లేదని నిరూపించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని సంగ్తీని వ్యర్థాలు లేని గ్రామంగా తీర్చిదిద్దుతున్నారు.

తూర్పు హిమాలయాల్లోని అరుణాచల్‌ప్రదేశ్‌లోని సంగ్తీ గ్రామం ప్రకృతి సౌందర్యానికి నిలయం. లోయలో ఉన్న ఈ గ్రామాన్ని ఆనుకొని సంగ్తీ నది ప్రవహిస్తూ ఉంటుంది. ఆ నది పేరుతోనే గ్రామాన్ని కూడా పిలుచుకుంటారు. అక్కడ నివసించే మోన్పా తెగ ప్రజలు టిబెటియన్ బౌద్ధాన్ని పాటిస్తారు. ప్రకృతిని ఆరాధిస్తారు. కానీ ఆధునికత ప్రభావం ఆ గ్రామం మీద కూడా పడింది. ప్లాస్టిక్, ఇతర ఘన వ్యర్థాలు నదిలోకి చేరడం, తీరంలో పేరుకుపోవడం ప్రారంభమయింది. చూపరులకు కనువిందు చేసే ఆ ప్రాంతం రూపురేఖలు మారిపోయాయి. ప్రతియేటా ఈ గ్రామానికి వచ్చే నల్లమెడ కొంగల రాక కూడా తగ్గిపోయింది. గ్రామస్తుల ఆరోగ్యం మీద కూడా ఈ ప్రభావం పడింది. ఆ సమయంలో... ఆశాజ్యోతిలా ఆ గ్రామంలో అడుగుపెట్టారు ఇతిశా సారా. ఆమె స్వస్థలం అసోంలోని గువహటి. పుణేలో ఎకనామిక్స్‌లో డిగ్రీ చేశారు. ఆ తరువాత ఢిల్లీ అంబేద్కర్ యూనివర్సిటీలో ఎండిఇఎస్ (సోషల్ డిజైన్) కోర్సులో చేరారు. "తరగతి గది నుంచి బయటకు వెళ్ళి, ప్రజలను నేరుగా కలిసి, వాళ్ళు నిత్యం ఎదుర్కొనే సమస్యలకు ఆచరణాత్మకమైన పరిష్కారాలను గుర్తించడానికి ఆ కోర్సు నాకు అవకాశం కలిగించింది. పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా పాల్గొనేదాన్ని. అరుణాచల్‌ప్రదేశ్‌లోని మారుమూల ప్రాంతాల్లో విద్యుద్దీపాల ఏర్పాటుకోసం పాటుపడుతున్న 'ఫర్దర్ అండ్ బియాండ్ ఫౌండేషన్' చేపట్టిన 'ది బట్టి ప్రాజెక్ట్'కు నిధుల సేకరణ కోసం ఢిల్లీ వచ్చిన మెర్విన్ కౌంటిన్హో నాకు పరిచయం అయ్యారు. అప్పట్లో నేను ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్మూలన మీద యూనివర్సిటీలో పరిశోధన చేస్తున్నాను. తమ ప్రాంతంలోని గ్రామాల పరిస్థితుల గురించి మెర్విన్ వివరించారు. వారి ప్రాజెక్ట్ తరఫున ఢిల్లీలో పని చేయాలని నన్ను కోరారు. నేను సరేనన్నాను" అని గుర్తు చేసుకున్నారు ఇతిశా.

ఎక్కడ చూసినా చెత్తే

తమ ప్రాంతాన్ని సందర్శించాలని ఇతిశాను మెర్విన్ తరచూ అడిగేవారు. దాదాపు ఏడాది తరువాత ఆమెకు ఆ అవకాశం వచ్చింది. "నా స్నేహితుడొకరు కొత్తగా ట్రావెల్ కంపెనీ ప్రారంభించారు. తమ విద్యార్థులను వేసవి సెలవుల్లో విహార యాత్రలకు తీసుకువెళ్ళడానికి కొన్ని స్కూళ్ళు అతణ్ణి సంప్రతించాయి. దానికి తగిన సిబ్బంది లేకపోవడంతో... 'ఆ పిల్లలతో కలిసి టూర్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఎక్కడికైనా వెళ్ళగలవా?' అని అడిగారు. ఆ జాబితాలో అరుణాచల్‌ప్రదేశ్‌లోని ప్రాంతాలు కూడా ఉన్నాయి. నేను "సరే" అన్నాను. అలా తొలిసారిగా .... 2018లో సంగ్తీలో అడుగుపెట్టాను" అని చెప్పారు ఇతిశా. అక్కడ నది, లోయ, పొలాలు... ఇలా అన్నీ ఆమెకు ఎంతగానో నచ్చాయి. కానీ ఎక్కడ చూసినా చెత్తే. వీధుల్లో కుప్పలు కుప్పలుగా పడి ఉండేది. నదిలో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు తేలుతూ ఉండేవి. అక్కడ మెర్విన్ నన్ను కలిసినప్పుడు ఆ సంగతే ప్రస్తావించాను. "అప్పుడప్పుడు పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నాం. కానీ మళ్ళీ మామూలే" అన్నారు. "ఆయన మాటలు నన్ను ఆలోచనలో పడేశాయి. ఈ గ్రామాన్నే నా కార్యక్షేత్రంగా ఎందుకు ఎంచుకోకూడదనిపించింది" అని అంటారు ఇతిశా. ఢిల్లీకి తిరిగి వెళ్ళిన ఆమె... ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో మళ్ళీ సంగ్తీలో అడుగుపెట్టారు. 'నార్త్ ఈస్ట్ వేస్ట్ కలెక్టివ్' అనే సంస్థను ఏర్పాటు చేశారు.. స్థానిక యువత సాయంతో ప్రజల్లో అవగాహన కలిగించడానికి సమావేశాలు ఏర్పాటు చేశారు.



> చెత్త పోగుపడడం వల్ల నదికీ, గ్రామానికీ, పర్యావరణానికీ ఎంత నష్టం అనేది గ్రామస్తులకు ఇతిశా బోధపరిచారు. మనం చెయ్యాల్సిన పని ఎవరో వచ్చి చేస్తూ ఉంటే... వాళ్ళు మళ్ళీ ఎప్పుడు వస్తారా? అని ఎదురుచూస్తూ ఉండడం మానాలనీ, ప్రతి ఒక్కరూ పరిసరాల్ని శుభ్రంగా ఉంచే దీక్షలో భాగస్వాములు కావాలనీ చెప్పారు. వ్యర్థాలను సేకరించడం, వాటిని వేరు చేయడం, కంపోస్ట్ తయారు చేయడం... ఇలా అనేక అంశాలను ప్రజలకు వివరించారు.

పవిత్ర దినాల్లో...

"మేము చేసిన కార్యక్రమాలతో... గ్రామస్తులలో మార్పు మొదలయింది. "మొదట ప్రజలు తమ ఇళ్ళలోని చెత్తను ఇష్టానుసారం రోడ్ల మీదో, ఇళ్ళ పక్కనో పడెయ్యకుండా... ఒక నిర్దిష్టమైన చోట వేసేలా చేశాం. గ్రామపెద్దలు, అధికారులతో మాట్లాడి... లోయలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించేలా చేశాం. బౌద్ధుల చాంద్రమాన పంచాంగం ప్రకారం... మోన్పా తెగవారికి నెలకి నాలుగు నుంచి అయిదు పవిత్రమైన రోజులు ఉంటాయి. ఆ రోజుల్లో వాళ్ళు పొలం పనులు చెయ్యరు, వాటిని సెలవులుగా పరిగణిస్తారు. ఆ రోజులను వ్యర్థాల నిర్వహణకోసం కేటాయించేలా ఒప్పించాం. ప్రతినెలా ఎనిమిదో రోజును సామాజిక సేవా దినంగా నిర్ణయించాం. ఆ రోజు తమ వీధుల్ని శుభ్రపరిచే పనిలో ప్రతి ఇంటి నుంచి ఒక వ్యక్తి పాల్గొనాలి. కాలనీలవారీగా బాధ్యులను ఎంపిక చేశాం. వారు పనులు సజావుగా జరిగేలా వాళ్ళు పర్యవేక్షిస్తారు" అని వివరించారు ఇతిశా. దానితోపాటు ప్రతి రోజూ నిర్దేశించిన చోట చెత్త వేయడం, వారానికి ఒకసారి తమ ప్రాంతాలను శుభ్రం చేయడం, ఎక్కడైనా చెత్త పేరుకుపోతే దాన్ని వెంటనే తొలగించడం లాంటి పనుల కోసం ఎక్కడికక్కడ కమిటీలు వేశారు. అలాగే విద్యార్థులకు పారిశుధ్యం ప్రాధాన్యాన్ని బోధించి, వారిని కూడా తమ కార్యక్రమాల్లో భాగస్వాములను చేశారు.పోగు చేసిన చెత్త అంతటినీ సంగ్తీ లోయలో, దగ్గర్లోని నామ్‌డ్రోలింగ్ గ్రామంలో ఉన్న రెండు ప్రదేశాలకు తీసుకువెళ్తారు. అక్కడ స్వయం సహాయక సంఘాలకు చెందిన దాదాపు వందమంది మహిళలు వాటిని వేరు చేస్తారు. కంపోస్ట్ తయారు చెయ్యడానికి వీలైనవాటిని ఒక యార్డులోకి తరలిస్తారు.



అక్కడే స్థిరపడాలని...

ఇప్పుడు సంగ్తీ లోయ మునుపటి ప్రకృతి సౌందర్యాన్ని సంతరించుకుంటోంది. వ్యర్థాల రహిత గ్రామంగా రూపు దిద్దుకుంటోంది. ఇతిశా, ఆమె బృందం చేస్తున్న ప్రచారం కారణంగా పర్యాటకుల సంఖ్య పెరిగింది. దానితోపాటు సంగ్తీలో పర్యాటకులకు ఆతిథ్యం ఇచ్చే గ్రామస్తుల సంఖ్య పెరిగింది. దానితో వారికి మంచి ఆదాయం కూడా వస్తోంది. "పర్యాటక కేంద్రంగా ఇంకా ఎంతో అభివృద్ధి చెందే అర్హత, ఆస్కారం సంగ్తీ లోయకు ఉన్నాయి. అందు కోసం అవసరమైన సౌకర్యాల కల్పనకు గ్రామస్తులు, అధికారుల సహకారంతో చర్యలు తీసుకుంటున్నాం" అంటున్న ఇతిశా గ్రామస్తులకు మరింత దగ్గరగా ఉండడం కోసం, వాళ్ళకు మార్గనిర్దేశం చేయడం కోసం తన నివాసాన్ని సంగ్తీకి మార్చారు. "ఇప్పుడు ఈ గ్రామస్తులందరూ నాకు ఆత్మీయులు అయిపోయారు. మరెక్కడున్నా ఈ అప్యాయత నాకు దొరకదని తెలుసు. అందుకే ఈ లోయలోనే స్థిరపడాలనుకుంటున్నాను. స్థానికులకు సాధికారత కల్పించడం, భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించడం నా ఆశయం" అని చెబుతున్నారు. ఇతిశా.

పిల్లలు ఎవరితోనూ కలవడం లేదా?

కొంతమంది పిల్లలు ఎవరితోనూ కలవడానికి ఇష్టపడరు. కొన్ని సందర్భాల్లో అయితే గది నుంచి బయటికి కూడా రారు. దీనికి కారణాలేంటో తెలుసుకుందాం!

అవమానించేలా మాట్లాడడం

- కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎప్పుడూ వ్యంగ్యంగా, వెటకారంగా మాట్లాడుతుంటారు. విషయాన్ని సూటిగా చెప్పే వీలున్నప్పటికీ పిల్లల మనసు గాయపరిచేలా మాట్లాడతారు. దీనితో పిల్లలు తమ తల్లిదండ్రుల ముందుకు రావడానికి కూడా ఇష్టపడరు. ఇంటికి బంధువులు, స్నేహితులు వచ్చినప్పుడు వారిముందు పిల్లలను తక్కువచేసి మాట్లాడడం కూడా మంచిది కాదు. దీనివల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం తగ్గి, బయటి వ్యక్తులతో కలవడానికి ఉత్సాహం చూపించరు.

అతిగా ప్రశ్నించడం

- స్కూలు, కాలేజీ, స్నేహితుల గురించి ఎక్కువగా ప్రశ్నలు అడగడం పిల్లలకు నచ్చకపోవచ్చు. కొంతమంది పిల్లలు తమ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు... ఇలా ఎవరు ఎన్ని ప్రశ్నలు అడిగినా ఉత్సాహంగా సమాధానాలు చెబుతారు. ప్రతి విషయాన్ని వారితో పంచుకుంటారు. ఇలాంటి పిల్లలతో ఎటువంటి సమస్యా ఉండదు. కానీ ఇంకొందరు పిల్లలు మాత్రం తమకు సంబంధించిన అంశాలను ఎవరితోనూ పంచుకోవడానికి ఇష్టపడరు. తల్లిదండ్రులు ఏదైనా అడిగినా కూడా చిరాకు పడతారేగానీ ఏమీ చెప్పరు. అవే ప్రశ్నలు గుచ్చిగుచ్చి అడిగితే తప్పించుకునే ప్రయత్నంగా గదిలోకెళ్లి బయటికి రారు. ఈ సమస్య ఎక్కువగా యుక్తవయసు పిల్లల్లో కనిపిస్తుంటుంది. పిల్లలు తమ మనసులోని భావాలను వారంతటవారే చెప్పేలా తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మెలిగితే సమస్య సులువుగా పరిష్కారమవుతుంది.



ఏకాంతం లేకపోవడం

- హైస్కూల్ లేదా కాలేజీలకు వెళ్లే పిల్లలు కొంత ఏకాంతాన్ని కోరుకోవడం సహజం. ఎదిగే పిల్లలు తమ గురించి తాము తెలుసుకోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి, తమతో తాము సంతోషంగా గడపడానికి, భవిష్యత్తు గురించి ఆలోచించుకోవడానికి కొంత సమయం ఒంటరిగా ఉండాలనుకుంటారు. కానీ తల్లిదండ్రులు తెలిసో తెలియకో పిల్లల ఏకాంతాన్ని భంగపరుస్తుంటారు. దీనితో పిల్లలు గదిలోకెళ్లి తలుపులు వేసుకుని గంటల సమయం గడిపేస్తుంటారు. యుక్తవయసు పిల్లల వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవిస్తూ వారికి మార్గనిర్దేశం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

అకారణంగా మందలించడం

- కొంతమంది తల్లిదండ్రులు పిల్లలు ఎదురుపడితే చాలు 'ఇంట్లో ఏదైనా పని చేయొచ్చు కదా! చదువుకోవచ్చు కదా!' అంటూ ఊరికే మందలిస్తూ ఉంటారు. దీనితో పిల్లలు గది నుంచి బయటికి రారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కొంతమేర స్వేచ్ఛను ఇస్తూ స్వతంత్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం నేర్పించాలి. ఇది పిల్లల మానసిక వికాసానికి, వారిలో లోకజ్ఞానం పెరగడానికి దోహదం చేస్తుంది.

ప్రతిరోజూ మనం అనుసరించే అలవాట్లు, పద్ధతులు మనకు బాగానే అనిపించినప్పటికీ వాటిలో కొన్ని మెదడుపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయి. శరీరమంతా ఆరోగ్యంగా ఉన్నప్పటికీ మెదడు పనితీరు సరిగ్గా లేకపోతే జీవిత గమనం చిక్కుల్లో పడుతుంది. అందుకే మెదడుకు హాని కలిగించే అంశాల గురించి తెలుసుకుందాం!

ఇలా చేస్తే మెదడుకు హాని

సామాజిక మాధ్యమాలు

- రాత్రి సమయాల్లో ఎక్కువగా సామాజిక మాధ్యమాల్లో గడపడం వల్ల మెదడు పూర్తిగా అలసిపోతుంది. ఫోన్‌లో ఎక్కువసేపు మాట్లాడడం, ఆటలు ఆడడం, సినిమాలు చూడడంతో పాటు ఇతరత్రా వ్యాపకాల వల్ల మెదడు ఒత్తిడికి గురవుతుంది. ఫోన్ నుంచి వెలువడే కాంతి వల్ల నిద్రకు ఉపకరించే మెలటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తి కాదు. దీనివల్ల ప్రశాంతమైన నిద్ర కరవవుతుంది. మెదడుకు స్వాంతన లభించదు. రాత్రి పూట నిద్రించడానికి గంటముందు ఫోన్, టీవీ తదితరాలను ఉపయోగించకుండా... మంచి పుస్తకం చదవడం, సంగీతం వినడం లాంటివి అలవాటు చేసుకోవడం మంచిది.

పోషకాహారం తినకపోవడం

- కంటికి అందంగా కనిపిస్తూ, నాలుకకు రుచిగా అనిపించే ఆహార పదార్థాలన్నీ మెదడుకి నష్టం కలిగిస్తాయి. చక్కెర ఎక్కువగా ఉన్న చిరుతిండ్లు, వేపుళ్లు, రోడ్ల పక్కన అమ్మే ఆహార పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిని, కొవ్వు శాతాన్ని పెంచుతాయి. దీనివల్ల మెదడులోని కణాలు దెబ్బతిని మతిమరుపు, దృష్టి లోపం, ఏకాగ్రత కుదరకపోవడం లాంటి సమస్యలు ఎదురవుతాయి. తాజా ఆకు కూరలు, పండ్లు, గింజలు, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా లభించే ఆహారం తీసుకోవడం వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది.

ఉత్సుకత లేకపోవడం

- మన మెదడు ఎప్పుడూ కొత్త విషయాలు తెలుసుకోవాలని, సాహసాలు చేయాలని, సవాళ్లు స్వీకరించాలని చూస్తుంది. మనం వాటిని నెరవేర్చే అవకాశం కల్పించని పక్షంలో మెదడు క్రమంగా బలహీనమవుతుంది. సంగీతం లేదా కొత్త భాష నేర్చుకోవడం, చిక్కు ప్రశ్నలకు సమాధానాలు వెతకడం, ఆలోచనను పెంచే చదరంగం లాంటి ఆటలు ఆడడం వల్ల మెదడు విశేషంగా ప్రభావితమవుతుంది. శారీరక వ్యాయామం కండరాలను పటిష్టపరిచినట్టే మానసిక వ్యాయామం మెదడును ఆరోగ్యంగా, చురుకుగా ఉంచుతుంది.



కదలకుండా కూర్చోవడం

- ఎక్కువసేపు కదలకుండా కూర్చోవడం వల్ల మెదడు నిస్తేజ స్థితిలోకి వెళుతుంది. శారీరక చలనం వల్లనే మెదడుకు రక్త ప్రసరణ సరిగ్గా జరిగి, సమర్థంగా పనిచేయగల్గుతుంది. ఏకాగ్రత కుదరాలన్నా, జ్ఞాపకశక్తి పెరగాలన్నా చేస్తున్న పని నుంచి చిన్నపాటి విరామం తీసుకోవడం, కూర్చున్న చోటునే కాళ్లకు సంబంధించిన వ్యాయామాలు చేయడం, భుజాలు కదిలించడం మంచిది.

నీరు తాగకపోవడం

- మెదడు పనితీరు సక్రమంగా ఉండాలంటే దానికి తగినంత ఆక్సిజన్ అందాలి. మెదడుకు అవసరమైన ఆక్సిజన్ నీటి నుంచే లభిస్తుంది. నీరు తాగకుండా ఎక్కువసేపు ఉంటే శరీరం నిర్జలీకరణకు గురై మెదడు సమన్వయం దెబ్బతింటుంది. దాహం వేస్తోందని అనిపించిన ప్రతిసారీ నీరు తాగాలి. అప్పుడే మెదడు చురుకుగా పనిచేస్తుంది.

జానూ వేటలో జానీ!

- తోడుకోసం ఓ పెద్దపులి ఆరాటం
- మహారాష్ట్ర నుంచి నిర్మల్ దాకా300 కి.మీ మేర ప్రయాణం

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జానీ.. ఇదో పెద్దపులి! తన 'జానూ' ఏదని వెతుక్కుంటోంది.. అంటే.. ఓ తోడు కోసం ఆరాటపడుతోందన్నమాట! మహారాష్ట్ర అడవుల్లోంచి ఆడపులిని వెతుక్కుంటూ 300 కి.మీ ప్రయాణం చేసి తెలంగాణ అటవీ ప్రాంతానికి చేరుకుందిప్పుడు. జానీ అనేది మహారాష్ట్రలోని కిన్వాట్‌కు చెందిన పెద్దపులి. సంతానోత్పత్తికి సరైన సమయం కావడంతో పులులు జతకోసం ఇలా సుదీర్ఘ ప్రయాణం చేస్తుంటాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన జానీ ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలోని జన్నారం, ఉట్నూర్ అటవీ ప్రాంతాల్లో సంచరిస్తోంది. ఉట్నూర్‌లోని లాల్‌టెక్డి సమీపంలో రోడ్డు దాటుతున్న జానీని వాహనదారులు గుర్తించారు. కొద్ది రోజుల ముందు నిర్మల్ జిల్లాలోనూ జానీ కదలికలు గుర్తించారు. ఏడేళ్ల వయస్సు ఉన్న జానీ గత అక్టోబరు నుంచి తెలంగాణ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు. తోడును ఆకర్షించేందుకు పులులు ఒకరకమైన వాసన వెదజల్లుతుంటాయి. ఆ వాసనను మరో పులి పసిగట్టి అనుసరిస్తుంది. జానీతోపాటు మరో పెద్దపులి మహారాష్ట్ర నుంచి తెలంగాణ భూభాగంలోకి ప్రవేశించినట్లు తెలిసిందని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు. కాలి ముద్రల్ని బట్టి వచ్చింది ఆడపులిగా తెలుస్తోందన్నారు. అయితే ఆ ఆడపులి తిరిగి మహారాష్ట్రవైపు వెళ్లిపోయిందని చెప్పారు.

సత్యసాయి ఆధ్యాత్మిక విద్య అందరికీ ఆదర్శం

- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద



పుట్టపర్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సంస్థలు అందిస్తున్న ఆధ్యాత్మిక విద్యా విధానం అందరికీ ఆదర్శమని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద అన్నారు. మహిళలు సామాజిక, ఆధ్యాత్మిక భావాలతో ఉన్నత స్థానాలను అధిష్ఠిస్తున్నారని ఆమె అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సాయి కుల్వంత్ మందిరంలో సత్యసాయి జయంతి వేడుకల్లో రెండో రోజు మంగళవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సత్యసాయి విద్యా సంస్థల అనంతపురం మహిళా క్యాంపస్ విద్యార్థులు వేద పారాయణ, మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి.. సాయి కుల్వంత్‌కు చేరుకున్నారు. అనంతరం జస్టిస్ నంద జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. 1995 నవంబరు 19న మొదటిసారి భగవాన్ సత్యసాయి మహిళా దినోత్సవాన్ని ప్రారంభించారని తెలిపారు. నాటి నుంచి 30 ఏళ్లుగా ప్రశాంతి నిలయంలో ఏటా నవంబరు 19న మహిళా దినోత్సవం జరుగుతోందన్నారు. భారతీయ సంప్రదాయం, సంస్కృతిలో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యం, గౌరవం ఉందని అన్నారు. సత్యసాయి బాబా వెలకట్టలేని, ఖరీదైన వైద్యం, విద్య వంటి సేవలు అందించారని కొనియాడారు.

సీడబ్ల్యూసీ తదుపరి చైర్మన్‌గా ఎంకే సిన్హా..!

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) తదుపరి చైర్మన్‌గా డాక్టర్ ముకేష్‌కుమార్ సిన్హా నియమితులు కానున్నారు. ప్రస్తుతం గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) చైర్మన్‌గా పనిచేస్తున్న ఆయనను సీడబ్ల్యూసీ చైర్మన్‌గా నియమించడానికి వీలుగా ఫైలు కేంద్ర జలవనరులశాఖ మంత్రి సీఆర్ పాటిల్ వద్దకు చేరింది. ఆ ఫైలుపై మంత్రి సంతకం చేయగానే ఎంకే సిన్హాకు నియామక ఉత్తర్వులు వెలువడనున్నాయి. కేంద్ర జలవనరుల ఇంజనీరింగ్ సర్వీస్ 'ఏ' కేటగిరీకి చెందిన ఎంకే సిన్హాకు ముక్కుసూటి అధికారిగా పేరుంది.

ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణకు నోటిఫికేషన్ జారీ

- సేకరణ కోసం కొత్త ప్రహరీలు కట్టించాకే ఇప్పుడున్న పాత ప్రహరీల కూల్చివేతలు
- కొత్త ప్రహరీలకు మార్కింగ్ ప్రక్రియ పూర్తి
- ప్రహరీల నిర్మాణానికి రూ.31 కోట్లు

హైదరాబాద్ సిటీ, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం దిశగా కీలక ముందడుగు పడింది. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ (ఎస్‌హెచ్01) వరకు, ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫామ్ (ఎన్‌హెచ్-44) వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్లకు కావాల్సిన భూ సేకరణ కోసం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిప్యూటీ కలెక్టర్లు, సబ్ రిజిస్ట్రర్లు, సర్వేయర్లతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమావేశమై రెవెన్యూ గ్రామాల వారీగా సేకరించే భూములపై సమీక్షించారు. భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం కీలకమైన రెండు ఎలివేటెడ్ కారిడార్లను నిర్మాణం చేసేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. హైదరాబాద్-కరీంనగర్ మార్గంలో సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ నుంచి శామీర్‌పేట వరకు 18.100కి.మీ మేర ఎలివేటెడ్ కారిడార్ రానుండగా మరో ఎలివేటెడ్ కారిడార్ జాతీయ రహదారి 44లోని హైదరాబాద్-నాగపూర్ మార్గంలో సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ నుంచి కొంపల్లి అవతల ఉన్న డైరీ ఫామ్ రోడ్డు వరకు రానుంది. సికింద్రాబాద్ నుంచి ప్రారంభమయ్యే రెండు ఎలివేటెడ్ కారిడార్లకు రక్షణశాఖకు చెందిన 169.33ఎకరాలు కీలకంగా మారాయి. కాగా భూసేకరణలో భాగంగా ఆయా కారిడార్ల వెంట గల డిఫెన్స్‌కు సంబంధించిన ప్రహరీలను తొలగించి స్థలాల స్వాధీనానికి హెచ్ఎండీఏ చర్యలకు ఉపక్రమించింది. అయితే ఇందుకు డిఫెన్స్ అధికారులు షరతులు విధించినట్లుగానే తొలుత సరికొత్తగా డిఫెన్స్‌కు సంబంధించిన ప్రహరీలను హెచ్ఎండీఏ నిర్మాణం చేయనుంది. ఆ తర్వాతే కారిడార్లకు ఇరువైపులా గల ప్రస్తుత డిఫెన్స్ ప్రహరీలను తొలగించనున్నారు. కాగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంలో పరేడ్ గ్రౌండ్ నుంచి శామీర్‌పేట మార్గంలో కానీ, ప్యారడైజ్ నుంచి కొంపల్లి అవతల ఉన్న డైరీ ఫామ్ రోడ్డు వరకు మార్గంలో ఇరువైపులా దాదాపు 100 మీటర్లకు పైగా స్థలం సేకరించే అవకాశాలున్నాయి.

అమీన్‌పూర్ పెద్దచెరువు ఆక్రమణలపై హైడ్రా నజర్

పెద్ద చెరువు ప్లాట్ల ముంపు బాధితుల సమస్యలపై దృష్టి

- చెరువు కాల్వలు, తూముల పునరుద్ధరణకు కమిటీ
- పద్మావతినగర్, వెంకటరమణ, చక్రపురి కాలనీల సర్వేకు ఆదేశాలు
- అమీన్‌పూర్‌లో హైడ్రా కమిషనర్‌పర్యటన

పటాన్‌చెరు, హైదరాబాద్, నవంబరు, 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని పెద్ద చెరువు ఆక్రమణలపై హైడ్రా దృష్టిపెట్టింది. మంగళవారం అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. ప్రభుత్వం గుర్తించిన జీవవైవిధ్య జాబితాలోని పెద్దచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ముగినిపోయిన పలు కాలనీలను పరిశీలించారు. కొన్నేళ్లుగా చెరువు నీటి మట్టం పెరిగిపోవడంతో ముంపునకు గురైన ప్లాట్ల బాధితులు వారం రోజులుగా చెరువుకట్టలపై ఆందోళన చేస్తున్నారు. బాధితులను రంగనాథ్ కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చెరువు తూములు, అలుగులు ఉద్దేశపూర్వకంగా మూసివేయడంతోనే నీటి మట్టం క్రమంగా పెరిగిందని బాధితులు ఆయన దృష్టికి తెచ్చారు. మియాపూర్, బాచుపల్లి తదితర ప్రాంతాల నుంచి నిత్యం డ్రైనేజీ ప్రవహించడంతో జీవవైవిధ్య చెరువు మురికి కూపంలా మారిందని, ఈ క్రమంలో సుమారు పలు కాలనీల్లోని ఐదువేల ప్లాట్లు నీటిలో మునిగిపోయాయని వాపోయారు. కబ్జాకు గురైన కాల్వలు, శిథిలమైన తూములు, పెరుగుతున్న ఎఫ్‌టీఎల్ తదితర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేవిధంగా అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తానని రంగనాథ్ హామీ ఇచ్చారు.

కాటసాని రాంభూపాల్‌రెడ్డి కబ్జా చేశారని ఫిర్యాదు


అమీన్‌పూర్ మునిసిపల్ పరిధిలోని చక్రపురి, వెంకటరమణ కాలనీల్లోని పార్కు స్థలాలు కబ్జాకు గురయ్యాయని వచ్చిన ఫిర్యాదులపై రంగనాథ్ స్పందించారు. సమగ్ర సర్వే ద్వారా హద్దులను నిర్ధయిస్తామని చెప్పారు. పార్కు స్థలాలు కబ్జా అయ్యాయని తేలితే కూల్చివేతలు తథ్యమని చెప్పారు. తమ పార్కు స్థలాన్ని కబ్జాచేసి భారీ అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారని వెంకటరమణ కాలనీవాసులు గతంలోనే హైడ్రాకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో నిర్మాణంలో ఉన్న గోల్డెన్ కీ అపార్ట్‌మెంట్ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తమ కాలనీ ప్లాట్లతో పాటు కాలనీ రోడ్డును కూడా కబ్జాచేశారని పద్మావతినగర్ కాలనీవాసులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ప్రహరీ నిర్మాణం జరగడంతో గతంలో కూల్చివేసిన స్థలాన్ని రంగనాథ్ పరిశీలించారు. ఈ వ్యవహారంపై సమగ్ర సర్వే నిర్వహించి వివాదానికి ముగింపు పలుకుతామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అనంతరం బీరంగూడ శంభుని కుంటను రంగనాథ్ పరిశీలించారు. కుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని ఆక్రమణలకు ఇప్పటికే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పెద్దఎత్తున ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు ఉన్నందున ఫిర్యాదులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నాయన్నారు. ఇప్పటికే గుర్తించిన ఆక్రమణలపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయి అధికారులు ఏమైనా అవినీతి, అలసత్వానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలితేచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా హైడ్రా కమిషనర్ పర్యటన ఒకరోజు ముందే ఖరారైనా స్థానిక తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్, ఇరిగేషన్ డీఈలు గైర్హాజర్ కావడం గమనార్హం.



అమీన్‌పూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఫాంహౌజ్ భూములను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

విచారణకు వర్మ డుమ్మా!

- షూటింగ్ ఉందని గడువుకు విన్నపం
- ఇంకోసారి నోటీసులకు పోలీసులు రెడీ
- మరోసారి హైకోర్టుకు దర్శకుడు.. ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్



ఒంగోలుక్రైం/అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మ పోలీసు విచారణకు డుమ్మాకొట్టారు. మంగళవారం ప్రకాశం జిల్లా ఒంగోలు రూరల్ సర్కిల్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాల్సిన ఆయన.. తనకు షూటింగ్ ఉన్నందున నాలుగు రోజులు గడువు కావాలని కోరుతూ విచారణాధికారికి వాట్సాప్ ద్వారా మెసేజ్ చేశారు. అదేవిధంగా తన తరఫు న్యాయవాది ఎస్. శ్రీనివాసరావు ద్వారా లేఖ పంపారు. దీంతో పోలీసుల విచారణ వాయిదాపడింది. ఈ నేపథ్యంలో మరోసారి వర్మకు నోటీసులు జారీ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. గతంలో సామాజిక మధ్యమాలలో అనుచిత, అసభ్యకరమైన పోస్టులు పెట్టారంటూ వర్మపై రెండు తెలుగు రాష్ట్రాలో 10 కేసులు నమోదైనట్లు సమాచారం. మరోవైపు.. సార్వత్రిక ఎన్నికల ముందు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో వర్మ పోస్టులు పెట్టారు. దీంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో టీడీపీ మండల కార్యదర్శి ముత్తనపల్లి రామలింగయ్య ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో మద్దిపాడు పోలీసులు హైదరాబాద్ వెళ్లి వర్మకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారు. దీంతో వర్మ మంగళవారం విచారణకు రావాల్సి ఉంది. కానీ, తాను ముందుగా నిర్ణయించుకున్న షెడ్యులు ప్రకారం సినిమా షూటింగ్‌లు ఉన్నాయని, నాలుగు రోజులు గడువు కావాలని కోరుతూ విచారణాధికారి ఎస్. శ్రీకాంత్‌బాబుకు వర్మ వాట్సాప్ ద్వారా సందేశం పంపించారు. విచారణకు సహకరిస్తానని తెలిపారు. అదేవిధంగా వర్మ తరఫు న్యాయవాది ఎస్. శ్రీనివాసరావు మంగళవారం ఒంగోలు రూరల్ సర్కిల్ స్టేషన్‌లో విచారణాధికారిని కలిసి లేఖ అందజేశారు. తనపై నమోదైన కేసులకు సంబంధించి మంగళవారం మరోసారి వర్మ హైకోర్టును ఆశ్రయించారు. సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

విశాఖలో న్యాయ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

- పెళ్లి పేరుతో నమ్మించిన తోటి విద్యార్థి
- స్నేహితుడి గదిలో అఘాయిత్యం
- వీడియో తీసిన మరో ముగ్గురు
- ఆ వీడియోలతో బెదిరించి సామూహిక అత్యాచారం

విశాఖపట్నం, మహారాణిపేట, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): విశాఖలో న్యాయవిద్య అభ్యసిస్తున్న ఒక యువతిపై నలుగురు సహచర విద్యార్థులు సామూహిక అత్యాచారం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. గాజువాక ప్రాంతానికి చెందిన బాధిత యువతితోపాటు వన్‌టౌన్ రంగిరీజు వీధికి చెందిన బాత వంశీ, జాలారిపేటకు చెందిన బొడ్డు జగదీశ్, కృష్ణాగార్డెన్స్‌కు చెందిన పోలిపల్లి ఆనంద్, చేపలుప్పాడకు చెందిన దవులపల్లి రాజేష్ నగర శివారులోని ఒక కళాశాలలో ఎల్ఎల్‌బీ మూడో సంవత్సరం చదువుతున్నారు. బాధిత యువతికి బాత వంశీ ప్రేమ పేరుతో చేరువై పెళ్లిచేసుకుంటానని నమ్మించాడు. శారీరకంగా కలుద్దామంటూ వంశీ ప్రతిపాదించాడు. ఈ ఏడాది ఆగస్టు 13న యువతికి వంశీ ఫోన్ చేసి డాబాగార్డెన్స్‌కు రావాలని కోరాడు. ఆమె వచ్చాక, పోలిపల్లి ఆనంద్ రూమ్‌కు తీసుకువెళ్లాడు. వంశీ ఇచ్చిన సమాచారం మేరకు బొడ్డు జగదీశ్ ఆ రూమ్‌కు చేరుకుని వారిద్దరూ ఏకాంతంగా ఉన్న దృశ్యాలను రహస్యంగా వీడియోలో చిత్రీకరించాడు. జగదీశ్ ఆ వీడియోను వంశీకి షేర్ చేయగా, వంశీ ఆ వీడియోను ఆనంద్‌తో పాటు దవులపల్లి రాజేష్‌కు షేర్ చేశాడు. వారంతా ఆ వీడియోలను యువతికి చూపించి బెదిరించి పలు మార్లు సామూహికంగా అత్యాచారం చేశారు. వారి వేధింపులు తట్టుకోలేక బాధితురాలు ఈనెల 18న ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. యువతి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి నిందితులను అరెస్టు చేశారు.

నవ్య | చిత్రజ్యోతి

రిలీజ్‌డేట్ ఫిక్స్



అల్లరి నరేశ్, అమృత అయ్యర్ హీరో హీరోయిన్లుగా సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్న చిత్రం 'బచ్చల మల్లి'. డిసెంబరు 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేశారు. పోస్టర్‌లో నరేశ్ రగ్గడ్ లుక్‌లో ఆకట్టుకున్నారు. చెదిరిన జుట్టు, గుబురు గడ్డంతో, సిగరెట్ తాగుతూ ఉన్న నరేశ్ ఇంటెన్స్ అవతార్ అదిరిపోయింది. ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. రోహిణి, రావు రమేశ్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్, హరి తేజ, ప్రవీణ్, వైవా హర్ష ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.

ప్రేక్షకులు ఊహించలేని విధంగా...



విష్వక్ సేన్ నటించిన తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లు. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా విష్వక్ సేన్ మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా పైకి కమర్షియల్ ఎంటర్టైనర్‌గా కనిపించినా.. ఇందులో నాలుగైదు ఏళ్లుగా సమాజంలో జరుగుతున్న ఓ కీలక సమస్యను చూపిస్తున్నాం. అది తెరపై చూసినప్పుడు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఫస్ట్ హాఫ్ అంతా వినోదాన్ని పంచి.. సెకండ్ హాఫ్ థ్రిల్లింగ్ ఫీల్‌ను ఇస్తుంది. ఈ సినిమా కథ చాలా విస్తృతమైనది. కచ్చితంగా అందరూ కనెక్ట్ అవుతారు. రవితేజ అనుకున్నదానికంటే చాలా బాగా సినిమాను తెరకెక్కించాడు. ఈ సినిమా స్ర్కీన్ ప్లేను నడిపించిన విధానంతో ఆయనకు తప్పకుండా మంచి గుర్తింపు వస్తుంది. ఇందులో పాత్రలన్నింటికీ ప్రాధాన్యం ఉంది. జేక్స్ బిజోయ్ అందించిన మ్యూజిక్ అదిరిపోయింది. సినిమా ప్రేక్షకులు ఊహించలేని విధంగా ఉంటుంది" అని చెప్పారు.

ప్రియుడితో పెళ్లికి సిద్ధం?



ఇటీవలే 'రఘు తాత' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు నటి, జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్. ఆమె వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నట్టు కొన్ని రోజులుగా మీడియాలో ప్రచారం జరుగుతోంది. తన ప్రియుడు, కేరళకు చెందిన వ్యాపారవేత్త ఆంటోని తట్టిల్‌తో కీర్తి మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టనున్నారనీ, డిసెంబరు 11న గోవాలోని ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో వీరి వివాహం జరగనుందని ఆ వార్తల సారాంశం. పెళ్లికి రెండు రోజుల ముందే డిసెంబరు 9న వివాహ వేడుకలు ఆరంభమవుతాయనీ, ఇప్పటికే తెలుగు, తమిళ, మలయాళ సినీ ప్రముఖులకు ఆహ్వానాలు వెళ్లాయని సమాచారం. కీర్తి సురేశ్ 15 ఏళ్లుగా ఆంటోనితో రిలేషన్‌లో ఉన్నారట. స్కూల్ డేస్ నుంచే ఇద్దరికీ పరిచయం ఉందని తెలుస్తోంది. అయితే తన పెళ్లి వార్తలపై కీర్తిసురేశ్ ఇప్పటివరకూ పెదవి విప్పలేదు.

వినోదం.. విభిన్నం



రామ్ పోతినేని కొత్త సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు అయింది. 'మిస్ శెట్టి.. మిస్టర్ పోలిశెట్టి' చిత్రానికి దర్శకత్వం వహించిన మహేశ్‌బాబు పచ్చిగొల్ల ఈ సినిమాకు దర్శకుడు. రామ్‌కు ఇది 22వ సినిమా. మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మించే ఈ చిత్రం షూటింగ్ ఈ నెల 21న ప్రారంభం కానుంది. ఇందులో రామ్ ఓ యూనిక్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు.ఆయన కెరీర్‌లోని ల్యాండ్ మార్క్ చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుందని అంటున్నారు. పూర్తి వినోదభరితంగా రూపుదిద్దుకొనే ఈ సినిమాలో నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరనేది ప్రారంభోత్సవంలో వెల్లడిస్తామని నిర్మాతలు చెప్పారు.

మూడు రోజులు నిద్రపోలేదు



'నీదీ నాదీ ఒకే కథ, 'విరాట పర్వం' చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు వేణు ఉడుగుల. ఆయన నిర్మాతగా మారి రాహుల్ మోపిదేవితో సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. సాయిలు కంపాటి దర్శకుడు. మంగళవారం ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ "దర్శకుడు సాయిలు తన ఊరిలో జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా ఈ కథ రాసుకున్నారు. ఈ కథ విన్నాక అద్భుతమైన ఫీల్ కలిగింది. ఎంతో వైవిధ్యమైన ప్రేమకథ ఇది. ఈ సినిమా క్లైమాక్స్ విని నాకు మూడు రోజులు నిద్రపట్టలేదు. అంతగా నన్ను వెంటాడిందా క్లైమాక్స్" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: నరేశ్ అడుప, సినిమాటోగ్రఫీ: వాజిద్ బేగ్, సంగీతం: సురేశ్ బొబ్బిలి.

కేరళ కళాకారిణి పాత్రలో...



సిద్ధార్థ్ మల్హోత్రా, జాన్వీకపూర్ జంటగా తుషార్ జలోటా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పరమ్ సుందరి'. విభిన్న ప్రేమగాథగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో జాన్వీ కొత్త తరహా పాత్రలో కనిపించనున్నారు. 'పరమ్ సుందరి' చిత్రంలో సిద్ధార్థ్ ఉత్తరాదికి చెందిన వ్యాపారవేత్తగా కనిపించనుండగా, జాన్వీ మలయాళ కళాకారిణిగా అలరించనున్నారని బాలీవుడ్ టాక్. కేరళ నేపథ్యంలో సాగే కథ కావడంతో ఆ నేపథ్యాన్ని ప్రతిబింబించేలా ఢిల్లీలో సెట్స్ వేశారు. డిసెంబర్ నుంచి చిత్రీకరణ ప్రారంభించనున్నారు. ఈ చిత్రంలో దిశాపటానీ మరో కథానాయికగా నటిస్తున్నారు. ధర్మా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది.

కేసీఆర్‌ని ఆదర్శంగా తీసుకుని సినిమా తీశారు




హరీశ్ రావు

రాకింగ్ రాకేశ్ కథానాయకుడిగా స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్). గరుడవేగ అంజి దర్శకుడు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ "నాకు సినిమాలతో పరిచయం తక్కువ. అందుకే సినిమా వేడుకలకి రావడం అరుదు. అయితే రాకేశ్ గురించి తెలుసుకున్న తర్వాత ఇక్కడికి వచ్చి ఆయనని ఆశీర్వదించాలనిపించింది. ఓ మారుమూల పల్లె నుంచి ఆయన ఇక్కడి దాకా ఎదిగిన క్రమం అందరికీ స్ఫూర్తిదాయకం. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ని ఆదర్శంగా తీసుకుని రాకేశ్ ఈ సినిమా తీయడం ఎంతో ఆనందాన్నిస్తోంది" అని అన్నారు. "ఈ సినిమాను అందరూ థియేటర్లలో చూసి ఆదరించండి" అని హీరో రాకేశ్ కోరారు.

నా భార్య అండగా నిలిచింది

కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్) చిత్రం ప్రీ రిలీజ్ కార్యక్రమానికి జానీ మాస్టర్ తన సతీమణి ఆయేషాతో కలసి వచ్చారు. లైంగిక వేధింపు కేసులో బెయిలు పొంది బయటకు వచ్చిన తర్వాత ఆయన మీడియా ముందుకు రావడం ఇదే తొలి సారి. "రాకేశ్ చాలా మంచి వ్యక్తి. అందరూ బావుండాలని కోరుకునే వ్యక్తి. ఇక్కడ అందరూ ఒక్కో మెట్టు ఎక్కుతూ పైకి వచ్చినవారే. భర్తకు భార్య సహకారం ఎప్పటికీ ఉంటుంది. నా జీవితంలో ఈ మధ్య జరిగిన కొన్ని సంఘటనల్లో ఆయేషా ఎంతో తోడ్పాటును అందించారు. జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా నా వెన్నంటే నిలిచింది. భార్యగానే కాకుండా, తల్లిలా.. స్నేహితురాలిలా నా వెనుకే అండగా ఉండి కష్టకాలంలో ముందుకు నడిపించింది" అని చెప్పారు.



విడిపోనున్న రెహమాన్ దంపతులు



ప్రముఖ సంగీత దర్శకుడు, అస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ దంపతులు త్వరలో విడిపోనున్నారు. ఈ మేరకు రెహమాన్ సతీమణి సైరా తరఫు న్యాయవాది వందనా షా మంగళవారం రాత్రి వెల్లడించారు.. 'పెళ్ళయిన చాలా సంవత్సరాల తర్వాత సైరా తన భర్త ఏఆర్ రెహమాన్ నుంచి విడిపోవాలని కఠినమైన నిర్ణయం తీసుకున్నారు. తీవ్రమైన భావోద్వేగ ఒత్తిడి తర్వాత తీసుకున్న నిర్ణయమిది. ఇరువురి మధ్య గాఢమైన ప్రేమ, అన్యోన్యత ఉన్నప్పటికీ వారి వివాహ బంధంలో ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అవి అధిగమించలేనివని తేలడంతో విడిపోవాలని నిర్ణయం తీసుకున్నారు' అని లాయర్ వందన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, 1995లో ఈ దంపతులకు వివాహం కాగా, వీరికి ఖతీజా, రహీమా, అమీన్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ కష్టకాలంలో తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించవద్దని రెహమాన్ కుమారుడు ఏఆర్ఆర్ అమీన్ మీడియాకు విజ్ఞప్తి చేశారు. సైరా భాను కుటుంబీకులు గుజరాత్ నుంచి చెన్నైకు వచ్చి స్థిరపడ్డారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

నా కెరీర్‌లో మర్చిపోలేనిది



చెప్పాలని ఉంది, అల నాటి సిత్రాలు, శాకుంతలం, హ్యాపీ ఎండింగ్ వంటి సినిమాలతో టాలెంటెడ్ యంగ్ హీరోగా పేరు తెచ్చుకున్నారు యష్ పూరి. ఆయన తాజాగా 'సిటాడెల్ హనీ-బన్నీ' వెబ్ సిరీస్‌లో కీలక పాత్రలో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా యష్ పూరి మాట్లాడుతూ 'ఈ సిరీస్‌లో నటించే అవకాశం దక్కినందుకు సంతోషంగా ఉంది. ఇది నా నట జీవితంలో మరో మెట్టు పైకి తీసుకెళ్లింది. నాకు ఈ అవకాశం ఇచ్చిన రైటర్ సీతా, సపోర్ట్ చేసిన నటి సమంత, డైరెక్టర్ రాజ్ డీకేకు కృతజ్ఞతలు. సమంత, వరుణ్‌తో కలసి నటించే అవకాశం రావడం నా కెరీర్‌లో మర్చిపోలేనిది. త్వరలో మరిన్ని క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులు ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాను' అని తెలిపారు.

అమ్మాయిలు.. అదే దూకుడు

ఫైనల్లో భారత్

చైనాతో టైటిల్ పోరు నేడు

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

సాయంత్రం 4.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో



రాజ్‌గిర్: మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత హాకీ జట్టు జైత్రయాత్ర సాగిస్తోంది. మంగళవారం జరిగిన సెమీఫైనల్లో 2-0తో జపాన్‌ను ఓడించింది. ఇక తమ టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు సలీమా టెటే బృందం బుధవారం జరిగే ఫైనల్లో చైనాను ఎదుర్కోనుంది. మరో సెమీస్‌లో చైనా 3-1తో మలేసియాపై గెలిచి తుదిపోరుకు చేరింది. ఇక.. మూడు, నాలుగో స్థానాల కోసం జపాన్-మలేసియా మధ్య పోరు జరుగనుంది. 48వ నిమిషంలో వైస్ కెప్టెన్ నవ్‌నీత్ కౌర్ తొలి గోల్ అందించగా.. 56వ నిమిషంలో లాల్‌రెమ్సియామి జట్టుకు మరో గోల్ అందించింది. వరుస విజయాలతో సెమీస్‌కు దూసుకు వచ్చిన భారత్ ఎదురుదాడితో జపాన్ రక్షణ శ్రేణి ఒత్తిడిలో పడింది. ఐదో నిమిషంలోనే సలీమాకు గోల్ చాన్స్ లభించినా ప్రత్యర్థి గోల్‌కీపర్ కుడో వమ్ము చేసింది. రెండో క్వార్టర్స్ ఆరంభంలోనే వరుసగా మూడు పీసీలు లభించినా ఫలితం లేకపోయింది. ఇలా ఆ తర్వాత కూడా భారత్ నుంచి ఎదురుదాడులను కీపర్ కుడో సమర్థవంతంగా అడ్డుకోగలిగింది. నాలుగో క్వార్టర్ 47వ నిమిషంలో భారత్‌కు లభించిన 12వ పీసీ కూడా వృధా అయ్యింది. ఆ తర్వాత నిమిషానికే దీపికను జపాన్ ప్లేయర్ కవాయ్ వెనుక నుంచి నెట్టడంతో భారత్‌కు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. దీన్ని నవ్‌నీత్ గోల్‌గా మలచడంతో 1-0 ఆధిక్యం దక్కించుకుంది. దీంతో మరింత జోరు చూపిన భారత్‌కు మరో ఎనిమిది నిమిషాల్లోనే లాల్‌రెమ్సియామి రెండో గోల్‌ను అందించడంతో విజయం ఖరారైంది.

అంధుల జట్టు పాక్ వెళ్లదు!

కేంద్ర అనుమతి నిరాకరణ

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌కు మరో ఝలక్. ఇప్పటికే చాంపియన్స్ ట్రోఫీ కోసం టీమిండియా పాక్‌లో పర్యటించేది లేదని తెగేసి చెప్పగా.. తాజాగా అక్కడే జరిగే అంధుల టీ20 వరల్డ్‌కప్‌లోనూ భారత జట్టు పాల్గొనడం లేదు. ఈనెల 23 నుంచి వచ్చే నెల 3 వరకు టోర్నీ జరగనుంది. అయితే అందులో పాల్గొనేందుకు భారత ప్రభుత్వం నుంచి అంధుల జట్టుకు అనుమతి లభించలేదు. దీంతో టోర్నీ నుంచి వైదొలుగుతున్నట్టు భారత అంధుల క్రికెట్ సంఘం కార్యదర్శి శైలేంద్ర యాదవ్ తెలిపాడు. 'పాక్‌కు వెళ్లేందుకు క్రీడా శాఖ నుంచి మాకు ఎన్‌ఓసీ అందింది. అయితే విదేశాంగ శాఖ అనుమతి కోసం మేం 25 రోజులు వేచిచూసినా స్పందన లేదు. వారికి ఫోన్ చేస్తే అనుమతి ఇవ్వడం లేదన్నారు. అధికారికంగా కూడా లేఖ ఇస్తామని చెప్పారు. అందుకే టోర్నీ నుంచి వైదొలుగుతున్నాం. అలాగే ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు కూడా వివిధ కారణాలతో టోర్నీలో ఆడడం లేదు' అని శైలేంద్ర పేర్కొన్నాడు.

వెలోడ్రోమ్ వెలవెల

- రెండు దశాబ్దాలుగా కనీస మరమ్మతులు లేవు
- పాడైన వాటర్ పైప్‌లైన్, డ్రైనేజీ వ్యవస్థ
- బహిరంగ ప్రాక్టీసుకు పలు అవాంతరాలు
- బాలికలకు హాస్టల్ వసతి కరువు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఒకప్పుడు దక్షిణ భారతదేశానికే సైక్లింగ్ హబ్‌గా ఉన్న హైదరాబాద్‌లోని సైక్లింగ్ వెలోడ్రోమ్ ఇప్పుడు అధ్వాన్నంగా తయారైంది. జాతీయ క్రీడల కోసం రెండు దశాబ్దాల కిందట అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు హయాంలో అత్యాధునిక సదుపాయాలతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ వెలోడ్రోమ్‌ను నిర్మించారు. పదెకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ కాంక్రీట్ ట్రాక్‌ను తర్వాత వచ్చిన పాలకులు ఆధునీకరించకుండా వదిలేయడంతో కళావిహీనంగా మారింది. ఇరవై ఏళ్లుగా ఎలాంటి మరమ్మతులకు నోచుకోకపోగా కనీసం రంగులు కూడా వేయలేని దుస్థితి. ఇంతకు ముందు దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఇండోనేసియా, శ్రీలంక, మాల్దీవుల నుంచి సైక్లిస్టులు వచ్చి ఇక్కడ సాధన చేసేవారు. గత పాలకుల నిర్లక్ష్యం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) అధికార యంత్రాంగం ఉదాసీన వైఖరితో సైక్లింగ్ వెలోడ్రోమ్ ప్రమాణాలు రానురానూ దిగజారి దీనస్థితికి చేరుకుంది.

బాలికలకు అకాడమీ ఏదీ ?

సైక్లింగ్ వెలోడ్రోమ్‌లో సైక్లింగ్, రెజ్లింగ్ అకాడమీలను 'శాట్' నిర్వహిస్తోంది. ఈ రెండు విభాగాల్లో కలిపి 50 మంది క్రీడాకారులకు ఉచిత శిక్షణ, భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. వీటితో పాటు యోగా, రోలర్ స్కేటింగ్, కరాటేలో మరో 150 క్రీడాకారులు ఇక్కడ రోజువారీ శిక్షణ తీసుకుంటున్నారు. వీరందరికీ కలిపి ఉన్నది ఐదుగురు కోచ్‌లే. అకాడమీ, హాస్టల్ వసతి బాలురకు మాత్రమే ఉండడంతో హైదరాబాదేతర ప్రాంతాలకు చెందిన బాలికలకు సైక్లింగ్‌లో శిక్షణ తీసుకునే అవకాశం లేకుండా పోయింది.

కనీస నిర్వహణ కరవు..

మరుగుదొడ్లు, వాటర్ పైప్‌లైన్, డ్రైనేజీ వ్యవస్థ ఇరవై ఏళ్ల నాటిది కావడంతో క్రీడాకారులు ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్న వర్షానికి కూడా భూగర్భ ప్రవేశ ద్వారం మార్గంలో నీళ్లు నిలిచిపోతుండడంతో మోటార్లతో వాటిని తోడాల్సిన దుస్థితి నెలకొంది. అవుట్‌డోర్ ట్రాక్ కావడంతో వర్షాకాలం వానల వల్ల, సాధారణ రోజుల్లో పావురాల వల్ల క్రీడాకారుల ప్రాక్టీసుకు అంతరాయం కలుగుతోంది. ప్రధానంగా గ్యాలరీలో పావురాల విసర్జకాలు, ఈకలతో ఇక్కడి కుర్చీలు మొత్తం పాడవుతున్నాయి. వీటితో పాటు పరిపాలక భవనం, హాస్టల్ గదుల కిటికీల అద్దాలు కూడా చాలా వరకు ధ్వంసమయ్యాయి. తద్వారా భద్రతాపరంగా కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఆధునీకరణ పనులు చేపట్టాలి..

ఒకప్పుడు సైక్లింగ్ వెలోడ్రోమ్‌లు పూర్తిగా అవుట్‌డోర్‌లోనే ఉండేవి. రెండు దశాబ్దాల్లో వచ్చిన మార్పులతో ఒలింపిక్స్ వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీలను ఇప్పుడు పూర్తిగా ఇండోర్‌లో ఎయిర్ కండీషన్ శీతల వాతావరణంలో చెక్క (ఉడెన్) ట్రాక్‌పై నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఇప్పుడున్న వెలోడ్రోమ్‌ల చుట్టుకొలత 250 మీటర్లు ఉంది. మన దేశంలో ఈ రకమైన ప్రమాణాలతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మాత్రమే సైక్లింగ్ వెలోడ్రోమ్ ఉంది. హైదరాబాద్‌లోని ప్రస్తుతం సైక్లింగ్ వెలోడ్రోమ్ 333 మీటర్ల చుట్టుకొలత గల కాంక్రీట్ ట్రాక్. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టు ఆధునీకరించినా లేదా అదే స్థానంలో కొత్త వెలోడ్రోమ్ నిర్మించినా రాష్ట్ర సైక్లిస్టులు ఒలింపిక్స్ పతకాల లక్ష్యంతో సాధన చేయడానికి ఆస్కారం ఉంటుంది. ఇప్పటికైనా శాట్ అధికారులు వెలోడ్రోమ్ ఆధునీకరణపై దృష్టి పెట్టాలని సైక్లిస్టులు కోరుతున్నారు.

షఫాలీపై వేటు



ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు భారత మహిళల జట్టు

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా మహిళల జట్టుతో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు భారత జట్టును ప్రకటించారు. వచ్చే నెల 5 నుంచి 11 వరకు బ్రిస్బేన్, పెర్త్‌లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. అయితే 16 మందితో కూడిన ఈ జాబితాలో డాషింగ్ ఓపెనర్ షఫాలీ వర్మకు చోటు దక్కలేదు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన మూడు వన్డేల్లో తను కేవలం 56 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ ఫార్మాట్‌లో ఆమె దాదాపు రెండున్నరేళ్ల క్రితం చివరి అర్ధసెంచరీ సాధించడం గమనార్హం. ఇక గాయం నుంచి కోలుకున్న హర్లీన్ డియోల్‌కు చోటు కల్పించగా, పరీక్షల కారణంగా కివీస్‌తో సిరీస్‌కు దూరమైన రిచా ఘోష్ జట్టులోకి వచ్చింది. అలాగే ఆఫ్ స్పిన్నర్ మిన్ను మణికి తొలిసారి వన్డేల్లో బెర్త్ దక్కింది.

జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, ప్రియా పూనియా, జెమీమా, హర్లీన్, యాస్తిక, రిచా ఘోష్, తేజల్, దీప్తి శర్మ, మిన్ను మణి, ప్రియా మిశ్రా, రాధా యాదవ్, టిటాస్ సాధు, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్, సైమా ఠాకూర్.

అనుపమ సంచలనం

15వ ర్యాంకర్ జాంగ్‌కు షాక్

చైనా మాస్టర్స్‌లో సిక్కి జోడీ ముందంజ



షెన్‌జెన్: భారత యువ షట్లర్ అనుపమ ఉపాధ్యాయ చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నమెంట్‌లో సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంది. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ 15వ ర్యాంకర్, అమెరికా స్టార్ బీవెన్ జాంగ్‌కు షాకిచ్చి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్లో ప్రపంచ 50వ ర్యాంకరైన అనుపమ 21-17, 8-21, 22-20తో జాంగ్‌ను కంగుతినిపించింది. 19 ఏళ్ల అనుపమ బీడబ్ల్యూఎఫ్ సూపర్ 750 ఈవెంట్లో మొదటి రౌండ్ దాటడం ఇదే తొలిసారి. రెండో రౌండ్లో నట్సుకి నిదైర (జపాన్)తో అనుపమ తలపడనుంది. ఇక, మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి/సుమిత్ రెడ్డి జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్లో సిక్కి జంట 23-21, 17-21, 21-17తో అమెరికా ద్వయం ప్రిస్లీ/జెన్నీని ఓడించింది. మిగతా భారత షట్లర్లలో ప్రియాన్షు రజావత్, ఆకర్షి కశ్యప్ పోరాటం ఆరంభ రౌండ్‌కే పరిమితమైంది. పురుషుల సింగిల్స్‌లో రజావత్ 24-22, 13-21, 18-21తో చికో అరా ద్వి వార్డోయో (ఇండోనేసియా) చేతిలో, మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ 10-21, 18-21తో టొమొకా (జపాన్) చేతిలో ఓటమి పాలయ్యారు.

డబ్బు కోసం వెళ్లలేదు

ఢిల్లీని వీడడంపై పంత్



న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్‌ను వీడడానికి డబ్బు కారణం కాదని ఆ జట్టు మాజీ కెప్టెన్ రిషబ్ పంత్ తేల్చాడు. రిటెన్షన్ ఫీజు విషయంలో ఫ్రాంచైజీతో పంత్‌కు విభేదాలు తలెత్తాయేమోనని, అందుకే అతను జట్టును వీడి ఉండొచ్చని గవాస్కర్ వ్యాఖ్యానించాడు. దీనిపై పంత్ స్పందిస్తూ.. 'నా రిటెన్షన్ అంశం డబ్బుతో ముడిపడి లేదని కచ్చితంగా చెప్పగలను' అంటూ సన్నీ వీడియోను ట్యాగ్ చేస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. మరోవైపు ఆటగాళ్ల వేలంలో పంత్‌ను తిరిగి ఢిల్లీ జట్టు దక్కించుకునే అవకాశం లేకపోలేదని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు.

లంకతో కివీస్ మూడో వన్డే రద్దు

పల్లెకెలె: శ్రీలంక, న్యూజిలాండ్ మధ్య మంగళవారం జరగాల్సిన మూడో వన్డే వర్షం కారణంగా రద్దయింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆతిథ్య లంక 2-0తో సొంతం చేసుకొంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 21 ఓవర్లలో 112/1 స్కోరు చేసింది. ఈ సమయంలో మొదలైన వాన ఎంతకీ ఆగకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. విల్ యంగ్ (56 నాటౌట్), హెన్రీ నికోల్స్ (46 నాటౌట్) క్రీజులో ఉన్నారు.

బిజినెస్

కేవైసీ నిబంధనలు పాటించకపోతే వేటే

ముంబై: ఖాతాదారుల వివరాల సేకరణకు సంబంధించిన నో యువర్ కస్టమర్ (కేవైసీ) నిబంధనలను బ్యాంకులు తప్పనిసరిగా పాటించాల్సిందేనని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరోసారి స్పష్టం చేసింది. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా, అటువంటి బ్యాంకులపై చర్యలు తప్పవని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ హెచ్చరించారు. ఖాతాదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన అంతర్గత అంబుడ్స్‌మన్ వ్యవస్థపైనా బ్యాంకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వయస్సు, ఆదాయ విషయాలతో సంబంధం లేకుండా బ్యాంకులు.. ఖాతాదారులు అందరికీ ఒకే విధమైన సేవలు అందించాలని స్పష్టం చేశారు.

- దక్షిణ భారతదేశంలో ఫెడరల్ ఎక్స్‌ప్రెస్ కార్పొరేషన్ (ఫెడ్‌ఎక్స్) తన ఎయిర్ నెట్‌వర్క్‌ను విస్తరించింది. ఇందులో భాగంగా బెంగళూరు నుంచి గుయాంగ్జూకి నేరుగా విమానన సర్వీస్‌ను ప్రారంభించింది. ఆసియా-పసిఫిక్ రీజియన్ నుంచి కీలక ఉత్పత్తులను దిగుమతి చేసుకోవటంతో పాటు యూరప్, యూఎస్ఏకు ఎగుమతులు పెంచుకునేందుకు ఈ సర్వీస్ దోహదపడుతుందని తెలిపింది.
- ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్.. తెలంగాణలో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా వరంగల్‌లో కొత్త బ్యాంకింగ్ ఔట్‌లెట్‌ను ప్రారంభించింది. దీంతో రాష్ట్రంలో మొత్తం శాఖల సంఖ్య ఐదుకు చేరుకోగా దేశవ్యాప్తంగా 986కి చేరింది.
- ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ లిమిటెడ్.. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఒప్పందంలో భాగంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓ)కు తోడ్పాటునందించేందుకు భారత్ సంజీవని కృషి ఉత్థాన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నాయి.
- మెర్క్యూరీ ట్రేడ్ లింక్స్.. రైట్స్ ఇష్యూ ద్వారా రూ.48.95 కోట్లు సమీకరిస్తోంది. మూలధన అవసరాలు సహా సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం ఈ మొత్తాలను సమీకరిస్తున్నట్లు ప్రకటించింది. ఇష్యూలో భాగంగా ఒక్కో షేరును రూ.44.95 ధరతో మొత్తం 1.08 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ఈ ఇష్యూ డిసెంబరు 5ను ముగియనుంది.
- లీగల్ టెక్నాలజీ, లార్జ్ లాంగ్వేజ్ మాడ్యుల్స్ సంస్థ లెక్స్‌లెగిస్.ఏఐ.. న్యాయ నిపుణుల కోసం ఇంటరాక్ట్ పేరుతో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సొల్యూషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. సమగ్ర కేస్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్, లీగల్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ఈ ప్లాట్‌ఫామ్ ఎంతగానో దోహదపడుతుందని కంపెనీ వెల్లడించింది.

పసిడి రుణాలకూ ఈఎంఐ!

నెలవారీ వాయిదాల్లో అసలు, వడ్డీ చెల్లించే వెసులుబాటు..

త్వరలో ప్రవేశపెట్టేందుకు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల సన్నాహాలు



న్యూఢిల్లీ: బంగారం తాకట్టుపై తీసుకునే రుణాలను నెలవారీ వాయిదా (ఈఎంఐ)ల్లో చెల్లించే అవకాశం అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం గృహ, వాహన, వ్యక్తిగత రుణాలకు మాత్రమే ఈ సదుపాయం ఉంది. ఈ రుణాలు తీసుకోవాలంటే బ్యాంకుల నుంచి సవాలక్ష ప్రశ్నలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అంతేకాదు, క్రెడిట్ స్కోర్, నెలవారీ ఆదాయం ఇతరత్రా అన్నింటిని పరిశీలించిన తర్వాతే అవి రుణాలను మంజూరు చేస్తున్నాయి. అయితే ఇలాంటి చిక్కులు లేకుండా మన దగ్గర ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి తీసుకునే రుణాలను నెలవారీ వాయిదాల్లో చెల్లించే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ) సన్నాహాలు చేస్తున్నాయి. కాగా ఇప్పటి వరకు బంగారం తాకట్టుపై తీసుకునే రుణాలకు వడ్డీని మాత్రం నెలనెలా చెల్లిస్తే సరిపోతుంది. అది కూడా తప్పనిసరేం కాదు. రుణ కాలపరిమితి ముగిసే నాటికి అసలు, వడ్డీని ఒకేసారి చెల్లించి కూడా తనఖా బంగారాన్ని విడిపించుకోవచ్చు. కానీ, కొందరు రుణగ్రహీతలు తీసుకున్న అప్పును మొత్తం ఒకేసారి చెల్లించడం భారమై తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకోలేని పరిస్థితి. ఈ రుణాన్ని ఒకేసారి తీర్చలేని వారికి ఈ విధానం మేలు చేస్తుందని బ్యాంకింగ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇందులో భాగంగానే గృహ, వాహన, వ్యక్తిగత రుణాల్లాగే బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న అప్పును కూడా అసలు, వడ్డీ కలిపి నెలవారీ వాయిదా పద్ధతుల్లో చెల్లించే వెసులుబాటు కల్పించాలని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు యోచిస్తున్నాయి. అలాగే, బంగారం తాకట్టుపై టర్మ్ లోన్ మంజూరు ఆలోచన కూడా ఉన్నట్లు తెలిసింది.

రూ.1.4 లక్షల కోట్ల రుణాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు 30తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం నాటికి బ్యాంకుల బంగారం తనఖా రుణాల మంజూరు వార్షిక ప్రాతిపదికన 51 శాతం వృద్ధితో రూ.1.4 లక్షల కోట్లకు చేరుకుంది. గత ఏడాదిలో ఇదే కాలానికి ఈ రుణాల వృద్ధి 14.6 శాతంగా నమోదైంది. గడిచిన ఏడాది కాలంలో బంగారం ధర భారీగా పెరగడంతో ఈ విభాగ రుణాలకూ డిమాండ్ అనూహ్యంగా పెరిగిందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. దేశీయ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ నివేదిక ప్రకారం.. ఈ ఏప్రిల్-ఆగస్టు మధ్యకాలంలో బ్యాంకుల బంగారం రుణాల మంజూరు 37 శాతం వృద్ధి చెందగా.. గోల్డ్ లోన్ కంపెనీల రుణ ఆస్తులు 11 శాతం పెరిగాయి.

ఆర్‌బీఐ ఆందోళన నేపథ్యంలోనే..

పసిడి రుణాల మంజూరులో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు అనుసరిస్తున్న అనుచిత విధానాలపై ఈ ఏడాది సెప్టెంబరు 30న భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రుణాల సోర్సింగ్, తాకట్టు బంగారం విలువ మదింపు, తనిఖీ ప్రక్రియ, పర్యవేక్షణ, బంగారం వేలం, లోన్ టు వాల్యూ (ఎల్‌టీవీ) రేషియో, రిస్క్ వెయిటేజీ అంశాల్లో లోపాలను ఎత్తి చూపింది. అంతేకాదు, రుణగ్రహీతలు తాకట్టు పెట్టే బంగారంపైనే ఆధారపడకుండా వారి తిరిగి చెల్లింపుల సామర్థ్యాన్నీ పరిశీలించాలని రుణదాతలను ఆర్‌బీఐ ఆదేశించింది. పాక్షిక చెల్లింపులపై రుణ కాలపరిమితి రెన్యువల్‌నూ ఆర్‌బీఐ తప్పుపట్టింది. ఈ నేపథ్యంలోనే తాము బంగారం తనఖా రుణాలకూ నిర్దేశిత గడువుతో కూడిన ఈఎంఐ ప్రణాళికలను ఏర్పాటు చేస్తున్నామని సీనియర్ బ్యాంకింగ్ అధికారి పేర్కొన్నారు.

అర్వా ఈవీతో ప్యూర్ ఈవీ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పశ్చిమాసియా, ఆఫ్రికాల్లో విద్యుత్ మోటార్ సైకిళ్ల (ఈవీ) డిస్ట్రిబ్యూషన్, విక్రయ నెట్‌వర్క్‌ను ఉత్తేజితం చేయడానికి అర్వా ఎలక్ట్రిక్ వెహికల్స్ మాన్యుఫాక్చరింగ్ ఎల్ఎల్‌సీతో విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ప్యూర్ ఈవీ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద తమ ప్రధాన మోడళ్లయిన ఎకో డ్రిఫ్ట్, ఈ- ట్రిస్ట్ ఎక్స్ 50 వేల యూనిట్లు వచ్చే రెండేళ్లలో సరఫరా చేయనున్నట్టు ప్యూర్ ఈవీ ప్రకటించింది. భవిష్యత్తులో దాన్ని 60 వేల వాహనాలకు విస్తరిస్తామని ప్యూర్ ఈవీ వ్యవస్థాపకుడు, ఎండీ నిశాంత్ దొంగరి చెప్పారు.

హ్యూమనాయిడ్ రోబోల తయారీలోకి యాడ్‌వెర్బ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇండస్ట్రియల్, వేర్‌హౌస్ ఆటోమేషన్‌లో అగ్రగామి అయిన యాడ్‌వెర్బ్ హ్యూమనాయిడ్ రోబోటిక్స్ విభాగంలోకి ప్రవేశిస్తోంది. వచ్చే ఏడాది తొలి హ్యూమనాయిడ్ రోబోను విడుదల చేయాలనుకుంటున్నట్టు ప్రకటించింది. జియో ఏఐ వేదిక, 5జీ సర్వీసులను ఉపయోగించుకుని హ్యూమనాయిడ్ అభివృద్ధికి రిలయన్స్‌తో కలిసి పని చేయనున్నట్టు యాడ్‌వెర్బ్ ప్రకటించింది. రిలయన్స్ గ్రూప్ వ్యాపార కార్యకలాపాల్లో దీన్ని విస్తృతంగా వినియోగిస్తారు. సెల్ఫ్ లెర్నింగ్ అల్గోరిథమ్స్, మల్టీ మోడల్ డేటా సహాయంతో విభిన్న వాతావరణ పరిస్థితుల్లో ఇమిడిపోతూ పార్సెల్ హ్యాండ్లింగ్, నాణ్యతా పరీక్షలు, సార్టింగ్, అసెంబ్లీ, వైపరీత్య సహాయ చర్యలు ఈ హ్యూమనాయిడ్ సమర్థవంతంగా నిర్వహించగలుగుతుందని కంపెనీ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ సంగీత్ కుమార్ తెలిపారు.

హైదరాబాద్ ఇన్‌ఫ్రా, రియల్టీ అదుర్స్

- శరవేగంగా వృద్ధి చెందుతున్న నగరాల్లో అగ్రస్థానం
- కలిసొస్తున్న మౌలిక సదుపాయాలు
- లగ్జరీ విల్లాలు, ఇళ్లకు యమ డిమాండ్
- నైట్ ఫ్రాంక్ ఇండియా వెల్లడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. పాలనా సౌలభ్యం, ఆర్థిక-సామాజిక పరిస్థితులు, స్థిరాస్తి (రియల్టీ), మౌలిక సదుపాయాలు ఇందుకు కలిసి వస్తున్నాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. దీనికి సంబంధించి ఇండియా ప్రైమ్ సిటీ ఇండెక్స్ పేరుతో నివేదిక విడుదల చేసింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న నయా సంపన్నుల జనాభా కూడా ఇందుకు దోహదం చేస్తోందని ఆ నివేదిక తెలిపింది.

మౌలికమే దన్ను: హైదరాబాద్‌లో ఐటీ, టెక్నాలజీ కంపెనీలు ఇప్పటికే బలంగా వేళ్లూనుకున్నాయి. ఓఆర్ఆర్, మెట్రో రైల్ విస్తరణతో వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత, ఆర్థిక కార్యకలాపాలు పెరిగాయి. ప్రభుత్వ సానుకూల విధానాలు ఇందుకు తోడయ్యాయి. దీనికి తోడు ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌తో పోలిస్తే నగరంలో ఇళ్ల ధరలు తక్కువగా ఉన్నాయి. ఇవన్నీ హైదరాబాద్ రియల్టీకి కలిసి వస్తున్నట్టు నగరానికి చెందిన రియల్టీ సంస్థ సుమధుర గ్రూప్ సీఎండీ జీ మధుసూదన్ చెప్పారు. ఈ మార్పులతో నగరానికి ఐదారు కిలోమీటర్ల దూరమైనా పెద్ద సైజు అపార్ట్‌మెంట్, విల్లా వంటి లగ్జరీ ఇళ్లను కొనేందుకు నగరవాసులు వెనకాడడం లేదని మరో రియల్ ఎస్టేట్ సంస్థ ప్రణీత్ గ్రూప్ డైరెక్టర్ నరేంద్ర కుమార్ కామరాజు తెలిపారు.

కొత్త ట్రెండ్ : గతంలో నయా కుబేరులు మాత్రమే విశాలమైన ఖరీదైన ఫ్లాట్లు, బంగళాలు కొనేవారు. కొవిడ్ తర్వాత ట్రెండ్ మారింది. ఐటీ, టెక్నాలజీ రంగాల్లో ఉన్న ఎగువ మధ్య తరగతి ప్రజలు కూడా ఇప్పుడు ఈ తరహా నివాస గృహాల కొనుగోళ్లపై ఆసక్తి చూపిస్తున్నారు. చుట్టుపక్కల మంచి గ్రీనరీ, ఆహ్లాదకరమైన వాతావరణమూ ఈ విషయంలో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. దీంతో ఇప్పుడు జూబ్లీహిల్స్, కోకాపేట్, నియోపోలిస్, రాయదుర్గం, బాచుపల్లి ప్రాంతాల్లో నిర్మిస్తున్న లగ్జరీ విల్లాలు, ఇళ్లకు డిమాండ్ పెరిగింది. ఈ డిమాండ్‌తో శివారు ప్రాంతాల్లోని భూముల ధర చుక్కలంటుతోంది. ఆ ప్రభావం లగ్జరీ ఇళ్ల ధరలపైనా కనిపిస్తోందని నగరానికి చెందిన ఫోలోమీ ఎస్టేట్స్ డైరెక్టర్ ప్రశాంత్ రావు చెప్పారు. దీంతో గత ఏడాది నగరంలో నివాస గృహాల ధరలు 11 శాతం పెరిగినట్టు నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది.

రెండో స్థానంలో బెంగళూరు: హైదరాబాద్ తర్వాత బెంగళూరు,ముంబై-మెట్రోపాలిటన్ ప్రాంతం రెండు, మూడు స్థానాల్లో ఉన్నట్టు నైట్‌ఫ్రాంక్ తెలిపింది. నిపుణులైన ఉద్యోగుల లభ్యత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన సానుకూల వ్యాపార విధానాలు, ఆర్థిక సామాజిక పరిస్థితులు బెంగళూరుకు ప్రధానంగా కలిసి వస్తున్నట్టు నైట్ ఫ్రాంక్ ఇండియా ఈడీ గులాం జియా చెప్పారు.

తగ్గిన ఆఫీస్ స్పేస్ సరఫరా : కార్యాలయ భవనాలకు మంచి డిమాండ్ ఉన్నా.. హైదరాబాద్‌లో కొత్త కార్యాలయ భవనాల అందుబాటు మాత్రం పెద్దగా లేదు. సెప్టెంబరు త్రైమాసికంలో నగరంలో ఆఫీస్ స్పేస్ డిమాండ్ 25 శాతం పెరిగినా 41 లక్షల ఎస్ఎఫ్‌టీ కొత్త కార్యాలయ స్థలం మాత్రమే అందుబాటులోకి వచ్చింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 25 శాతం తక్కువని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ వెస్టియన్ తెలిపింది.

ఎట్టకేలకు లాభాలొచ్చాయ్..

- ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,112 పాయింట్లు అప్
- చివరికి 239 పాయింట్ల లాభంతో ముగింపు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో వరుస నష్టాలకు తెరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల ట్రెండ్ మిశ్రమంగా ఉన్నప్పటికీ.. గడిచిన కొన్ని రోజుల్లో భారీగా క్షీణించిన బ్యాంకింగ్, ఐటీ, వాహన రంగ షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరపడం సూచీలను లాభాల్లోకి మళ్లించింది. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 1,112.64 పాయింట్లు ఎగబాకి 78,451.65 వద్దకు చేరింది. కానీ, ఆఖరి గంటలో రిలయన్స్ ఇండస్ట్రీస్ సహా పలు షేర్లలో మదుపరులు లాభాలను స్వీకరించారు. దాంతో సెన్సెక్స్ 239.37 పాయింట్ల స్వల్ప లాభంతో 77,578.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఒకదశలో 300 పాయింట్లకు పైగా పెరిగి 23,780 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసినప్పటికీ.. చివరికి 64.70 పాయింట్ల లాభంతో 23,518.50 వద్ద ముగిసింది. దాంతో నిఫ్టీ 7 రోజుల వరుస నష్టాలకు తెరపడినట్లైంది.

నేడు మార్కెట్లకు సెలవు : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బుధవారం నాడు స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సెలవు పాటించనున్నాయి. మార్కెట్లు గురువారం యథాతథంగా పనిచేస్తాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,070 ▲	70,650 ▲	1,01,000 ▲
ముంబై	75,873 ▲	69,500 ▲	90,956 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ

హైదరాబాద్	555	విజయవాడ	575
వరంగల్	557	గోదావరి	565
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	113
వరంగల్	100	గుంటూరు	111
కరీంనగర్	100	ఒంగోలు	111
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	104
కర్నూలు	100	నెల్లూరు	104
విశాఖపట్నం	105	అనంతపురం	104
గోదావరి	113		

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

- రేపటి నుంచి హైదరాబాద్‌లో లోక్ మంథన్
- సంస్కృతి ఉట్టిపడేలా అంతర్జాతీయ సదస్సు
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజన వర్గాన్ని విద్య, వైద్య, ఆర్థిక, సామాజిక పరంగా అభివృద్ధి చేయడం అందరి బాధ్యత అని.. వారి కళలు, సంప్రదాయాన్ని ప్రోత్సహించడం దిశగా లోకమంథన్ నిరంతరం పనిచేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా హైదరాబాద్‌లో లోక్‌మంథన్-2024 పేరుతో అంతర్జాతీయ సదస్సు, సాంస్కృతిక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని ప్రకటించారు. శిల్ప కళా వేదికగా ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే ఎగ్జిబిషన్, కల్చరల్ ఫెస్టివల్‌ను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. 22న వివిధ దేశాల ప్రతినిధులతో మేధోమథనం కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభిస్తారని తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. భారత్‌తో పాటు వివిధ దేశాల నుంచి పలు రంగాల ప్రతినిధులు లోక్‌మంథన్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. దేశ నిర్మాణంలో సమాజం పాత్ర, ఆత్మనిర్భరత సాధించేందుకు చేయాల్సిన కృషి తదితర అంశాలపై ఇందులో చర్చ జరుగుతుందని తెలిపారు.

మతపరమైన రిజర్వేషన్లకు స్థానం లేదు..

రాజ్యాంగంలో మతపరమైన రిజర్వేషన్లకు స్థానం లేదని కిషన్‌రెడ్డి అన్నారు. మతపరమైన రిజర్వేషన్ల అంశం సుప్రీంకోర్టు పరిధిలోనిది అని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ.. అధికారంలోకి వస్తే మహారాష్ట్రలో రిజర్వేషన్లను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం దారుణమని అన్నారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలకు ఇది నిదర్శనమన్నారు. టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయాలను కిషన్‌రెడ్డి స్వాగతించారు. మందిరంలో హిందువులు మాత్రమే పనిచేయాలనే నిర్ణయాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై వచ్చే నెల 1 నుంచి 5 వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. హామీల అమలులో వైఫల్యాలను ఎండగడుతూ పార్టీ 1న చార్జ్‌షీట్ విడుదల చేయనుంది.

సర్వేకు సహకరించని వారిని ఉత్తర కొరియాకు పంపాలి: జాజుల

మెదక్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కులగణనపై కొందరు రాజకీయ నేతలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని, సర్వేకు సహకరించని వారి భారతదేశ పౌరసత్వాన్ని రద్దుచేసి ఉత్తరకొరియాకు పంపాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కులగణనపై మంగళవారం మెదక్‌లో ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. 78 ఏళ్లగా బీసీలు తమ లెక్కా పత్రాలు తేల్చాలని పోరాడుతున్నారని, ఇప్పుడు ఆ అవకాశం వచ్చిందని చెప్పారు. సర్వే సందర్భంగా బీసీలంతా తమ కులం పక్కాగా చెప్పాలని, మిగితా 55 ప్రశ్నలకు ఏం చెప్పినా వచ్చే ఇబ్బందులు ఉండవని ఆయన స్పష్టం చేశారు.

పదవీకాలం పొడిగించొద్దు.. పదోన్నతులివ్వాలి

- జలసౌధ ముందు ఇంజనీర్ల నిరసన

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ చేసిన వారిని సలహాదారులుగా, ఓఎస్డీలు, కన్సల్టెంట్లుగా నియమించుకోవాలని, కేడర్ పోస్టుల్లో పదవీ కాలం పొడిగించరాదని నీటిపారుదల శాఖ ఇంజనీర్లు డిమాండ్ చేశారు. జలసౌధలో మంగళవారం భోజన విరామ సమయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో)ల ఆధ్వర్యంలో ఇంజనీర్లు నిరసన తెలిపారు. కేడర్ పోస్టుల్లో పనిచేస్తూ పదవీ విరమణ చేసినవారి సర్వీసు పొడిగిస్తే... ఆ ప్రభావం సర్వీసులో ఉన్న ఇంజనీర్లపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సర్వీసు కాలాన్ని పొడిగించకుండా... వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం తొలుత ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్‌ను, తర్వాత సచివాలయంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను టీజీవోల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందించారు.

ర్యాగింగ్ బాధ్యులపై చర్యలు: నల్లగొండ డీఎస్పీ

నల్లగొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ వైద్య కళాశాల వసతిగృహంలో ర్యాగింగ్ ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో వైద్య కళాశాల హాస్టల్‌లో సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేస్తూ భౌతిక దాడికి పాల్పడినట్లు ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామచంద్రు ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బీఎన్ఎస్ సెక్షన్లతో పాటు ర్యాగింగ్ చట్టం కింద ఒక జూనియర్ డాక్టర్, నలుగురు సీనియర్ విద్యార్థులపై కేసు నమోదు చేశామన్నారు. జూనియర్లపై దాడికి పాల్పడిన వారిని విచారించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, ఈ కాలేజీలో తెలుగు రాని విద్యార్థులను ర్యాగింగ్ చేయడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నట్లు తెలిసింది. కొంతమంది విద్యార్థులు సెలవులు పెట్టి తమ ప్రాంతాలకు వెళ్లినట్లు సమాచారం.

ఢిల్లీలో కేటీఆర్ కొత్త డ్రామాలు: ఎంపీ మల్లు రవి

హైదరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): లగచర్ల గొడవలకు కారణం తానేనని తేలడంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీలో కొత్త డ్రామాలు ఆడుతున్నారని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఒక ప్రకటనలో విమర్శించారు. కేటీఆర్.. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు దళిత, గిరిజన ప్రజల కోసం ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ ముంపు బాధితులు పరిహారం అడిగితే ఎలా కొట్టించిందీ, నేరెళ్లలో దళితులను ఎలా హింసించిందీ ప్రజలకు తెలుసునన్నారు. ఢిల్లీలో కేటీఆర్ నాటకాలను వారు నమ్మబోరన్నారు.

'డీఎస్సీ-2008' అభ్యర్థుల సమస్యను పరిష్కరిస్తాం

- ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి భరోసా

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెండు, మూడు రోజుల్లో 'డీఎస్సీ-2008' అభ్యర్థుల సమస్యను పరిష్కరిస్తామని, జాబితా రూపకల్పన ప్రక్రియ చివరి దశలో ఉందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి భరోసా ఇచ్చారు. వివిధ జిల్లాలకు చెందిన దాదాపు 200 మందికి పైగా 'డీఎస్సీ-2008' అభ్యర్థులు మంగళవారం ప్రజాభవన్‌కు తరలివచ్చి చిన్నారెడ్డితో తమ గోడును వెళ్లబోసుకున్నారు. 15ఏళ్లుగా ఎదురుచూస్తున్న తాము వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే కౌన్సెలింగ్ తేదీలను ప్రకటించి, నియామక పత్రాలను ఇస్తారని ఆశించామని, కానీ రెండు నెలలు గడుస్తున్నా ప్రక్రియ ముందుకు సాగడం లేదని వాపోయారు. దీనికి స్పందించిన చిన్నారెడ్డి వెంటనే విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఇతర అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అభ్యర్థుల జాబితా రూపకల్పన ప్రక్రియ చివరి దశలో ఉందని చెప్పారు. తాను మరోసారి మాట్లాడి అతి త్వరలో సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని అభ్యర్థులకు హామీ ఇచ్చారు.

ఢిల్లీ పరిస్థితి రాకూడదనే ఈవీ పాలసీ: పొన్నం

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్య తీవ్రత కారణంగా పాఠశాలలు మూసివేశారని, హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో ఎక్కడా అలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందు జాగ్రత్తగా ఎలక్ట్రిక్ వాహనా(ఈవీ)ల పాలసీ తీసుకువచ్చినట్టు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కాలుష్యం వెదజల్లే వాహనాలను నియంత్రించేందుకు కఠినంగా వ్యవహరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు 15 సంవత్సరాలు దాటిన పాత మోటారు వాహనాలను స్వచ్ఛందంగా స్క్రాప్‌కు పంపాలని వాహనదారులకు సూచించారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాలను విస్తృతంగా వినియోగించేందుకు అనువుగా ఈవీ పాలసీ ఉందని ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఖజానాకు నష్టం వచ్చినప్పటికీ మరో రెండేళ్ల వరకు ఈవీలపై రోడ్డు టాక్స్ రిజిస్ట్రేషన్ ఫీజు 100% మినహాయింపు ఇస్తున్నట్టు గుర్తుచేశారు.

హెల్త్ వర్సిటీ వీసీగా డాక్టర్ రమేశ్‌రెడ్డి?

షార్ట్‌లిస్టులో ఆయన పేరు.. సీఎం వద్ద ఫైలు

- బీఆర్ఎస్ హయంలో ఏడేళ్లు డీఎంఈగా అనుభవం
- వర్సిటీకి పదేళ్లుగా ఒకే వీసీ.. కరుణాకర్‌రెడ్డిని కొనసాగించడంపై హైకోర్టులో వైద్యుల సంఘాల పిల్
- నిబంధనల మేరకు వీసీ పదవీకాలం మూడేళ్లే

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతిగా డాక్టర్ కోటా రమేశ్‌రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. షార్ట్‌లిస్టులో ఆయన పేరు టాప్ త్రీలో ఉన్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం వీసీ నియామక ఫైల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు చేరినట్లు సమాచారం. సీఎం నిర్ణయం తర్వాత అది రాజ్‌భవన్‌కు వెళ్లి అక్కడ ఆమోదముద్ర పొందిన అనంతరం జీవో వెలువడుతుందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. కాగా, రమేశ్‌రెడ్డి పేరు షార్ట్‌లిస్టులో చేరడానికి బలమైన లాబీయింగ్‌తో పాటు వైద్యవిద్యలో ఆయనకున్న అనుభవం కూడా తోడైంది. గత ప్రభుత్వ హయంలో ఏడేళ్ల పాటు వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ)గా పనిజేశారు. అలాగే రెండేళ్లకు పైగా తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఇంచార్జి కమిషనర్‌గా, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా, జాతీయ వైద్య కమిషన్ సభ్యుడిగా, ఉమ్మడి రాష్ట్ర వైద్యమండలి వైస్ చైర్మన్‌గా పనిజేసిన అనుభవం ఉంది. ఈ నేపథ్యంతోపాటు ఒకరిద్దరు మంత్రులు కూడా రమేశ్‌రెడ్డి తరపున లాబీయింగ్ చేసినట్లు తెలుస్తోంది.

పదేళ్లు ఒక్కరే వీసీ!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హెల్త్ వర్సిటీ 2014లో ఏర్పాటైంది. తొలి వీసీగా డాక్టర్ కరుణాకర్ రెడ్డిని 2015లో నాటి బీఆర్ఎస్ సర్కారు నియమించింది. అప్పటి నుంచి నేటి వరకు ఆయనే వీసీగా కొనసాగుతున్నారు. నిబంధనల ప్రకారం వీసీ పదవీ కాలం మూడేళ్లే. అయితే గత ప్రభుత్వం కరుణాకర్ రెడ్డికి వరుసగా ఎక్స్‌టెన్షన్ ఇస్తూ వచ్చింది. సుదీర్ఘకాలం ఆయనే వీసీగా కొనసాగడంపై కొన్ని డాక్టర్ల సంఘాలు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశాయి. దానిపై విచారణ కొనసాగుతుండగానే.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ ఏడాది జూన్ 7న హెల్త్ యూనివర్సిటీ కొత్త వీసీ కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తంగా 40 వరకు దరఖాస్తులు వచ్చాయి. వాటిని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వడపోసి షార్ట్‌లిస్టును సిద్ధం చేశారు.

కాంగ్రెస్ ప్రాజెక్టుల వల్లే రికార్డులు

అందుకే నేడు ధాన్యం ఉత్పత్తిలో అగ్రస్థానం.. ఇందిరమ్మ స్ఫూర్తితోనే కులగణన సర్వే: భట్టివిక్రమార్క

- అభివృద్ధిపై చర్చకు సిద్ధం: మహేశ్‌కుమార్
- గాంధీభవన్‌లో ఇందిరకు నివాళులు



మహిళా రైతుకు వ్యవసాయ ప్రతిభా పురస్కారం అందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గతంలో కాంగ్రెస్ పాలకులు దూర దృష్టితో నిర్మించిన బహుళార్థక ప్రాజెక్టుల వల్లనే ఈనాడు రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి ధాన్యం ఉత్పత్తి సాధ్యమైందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. కాళేశ్వరం వల్లనే తెలంగాణలో వరిసాగు పెరిగిందంటూ బీఆర్ఎస్ చేసిన ప్రచారం అబద్ధమని తేలిపోయిందని పేర్కొన్నారు. కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ కుంగిపోయి నీటిని నిల్వ చేసే పరిస్థితి లేకున్నా.. ఎన్డీఎస్ సూచన మేరకు అన్నారం, సుందిళ్లలో నీటిని నిల్వ చేయకపోయినా ధాన్యం ఉత్పత్తి పెరిగిందన్నారు. ఆనాడు కాంగ్రెస్ పాలకులు.. కృష్ణానదిపై నాగార్జున సాగర్, శ్రీశైలం, జూరాల, గోదావరిపై ఎస్సారెస్పీ, దేవాదుల తదితర ప్రాజెక్టులు నిర్మాణం చేసి రైతులకు సాగునీరు అందించిన ఫలితంగానే ఇది సాధ్యమైందన్నారు. టీపీసీసీ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మంగళవారం ఇందిరాగాంధీ వ్యవసాయ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన భట్టి విక్రమార్క.. ఆదర్శ రైతులు, శాస్త్రవేత్తలకు అవార్డులను ప్రదానం చేశారు. 'ఇండియా గుండె చప్పుడు ఇందిర' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా గాంధీభవన్‌లో ఆమె చిత్రపటానికి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షురాలు గీతారెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. భూ సంస్కరణల చట్టం తీసుకురావడం ద్వారా కొద్ది మంది చేతుల్లో ఉన్న లక్షల ఎకరాల భూములను పేదలకు పంచి.. లక్షలాది మంది రైతులను తయారు చేసిన ఘనత దివంగత ప్రధాని ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు. ఆమె స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం వ్యవసాయరంగానికి బడ్జెట్లో రూ.72 వేల కోట్లు కేటాయించిందన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలకులు పంట నష్ట పరిహారం కూడా ఇవ్వలేదని, పంట బీమా పథకాన్ని అమలు చేయలేదని విమర్శించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులకు అసైన్ చేసిన భూములను లాక్కుని లేఅవుట్లు చేసి అమ్ముకున్న దుర్మార్గులు.. బీఆర్ఎస్ పాలకులని మండిపడ్డారు. ప్రస్తుతం వారు రైతుల గురించి మాట్లాడటం.. దయ్యాలు వేదాలు వల్లించిన చందంగా ఉందని విమర్శించారు. భూ సేకరణ బాధితుల గురించి మాట్లాడే అర్హతే వారికి లేదన్నారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితోనే రాష్ట్రంలో కులగణన సర్వేను శాస్త్రీయంగా, నిబద్ధతతో నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. దేశ సమైక్యత, సమగ్రతలపై అవగాహన ఉన్నవాళ్లు, ఇందిరాగాంధీ జీవిత చరిత్ర తెలిసిన వాళ్లు ఆమెకు చేతులు ఎత్తి నమస్కరిస్తారే తప్ప.. ఆమె చరిత్రను వక్రమార్గంలో చూపే ప్రయత్నం చేయబోరన్నారు. ఇందిర హయాంలో ఎమర్జెన్సీ మీద సినిమా నిర్మాణంపై భట్టివిక్రమార్క ఈ మేరకు స్పందించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ నెహ్రూ తర్వాత అంతటి ప్రాచుర్యం పొందిన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ అన్నారు. అనేక ఒత్తిళ్లను తట్టుకుని భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు వంటి నిర్ణయాలను ధైర్యంగా తీసుకున్నారని కొనియాడారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, పది నెలల ప్రజాప్రభుత్వం చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. కాగా, గాంధీభవన్‌లో మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో గురువారం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పాల్గొననున్నారు. ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమం జరగనుంది.

ఇందిరకు సీఎం రేవంత్ నివాళి

ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ సేవలన్నీ ఆరోగ్యశ్రీలోకి

(మొదటి పేజీ తరువాయి)

అయ్యే ఖర్చు ఎంతో పేర్కొంటూ రోగి పేరిట వైద్యులు ఒక లేఖ ఇస్తారు. ఆ లేఖ ఆధారంగా.. తమకు అయ్యే వైద్య ఖర్చులను భరించాలని కోరుతూ రోగులూ సీఎంవో లేదా మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రోగికి తెల్ల రేషన్ కార్డు ఉంటే దాని ప్రకారం.. లేదా, వారి వార్షికాదాయాన్ని పరిగణలోకి తీసుకుని, వైద్యులిచ్చిన శస్త్రచికిత్స వ్యయ అంచనాను బేరీజు వేసి మొత్తం ఖర్చును లేదా కొంచెం తక్కువగా అయ్యే మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని, సదరు రోగికి తక్షణమే వైద్య చికిత్సను అందించాలని ఆదేశిస్తూ ఇచ్చే లేఖనే 'ఎల్‌వోసీ'గా వ్యవహరిస్తారు. నిమ్స్‌లో ప్రస్తుతం కొన్ని చికిత్సలను ఇలా ఎల్వోసీ ఆధారంగా చేస్తున్నారు. తర్వాత ఆ మొత్తం వ్యయాన్ని ప్రభుత్వం నిమ్స్‌కు జమ చేస్తోంది.

11 వేల సార్లు..

ఎల్‌వోసీ తెచ్చుకునే విషయంలో రోగులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు వెంటనే వస్తే...మరికొన్నిసార్లు సరైన పత్రాలు లేని కారణంగా బాగా ఆలస్యం అవుతోంది. అంతేకాక కొన్ని ఆపరేషన్లను ఆరోగ్యశ్రీలో చేయడమే కాకుండా వాటికే ఎల్‌వోసీలు కూడా పెట్టినట్లు ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారులు గుర్తించారు. నిమ్స్ ఆస్పత్రిలో అలా ఏకంగా 11 వేల సార్లు ఎల్‌వోసీ దుర్వినియోగం అయినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో అసలు నిమ్స్‌లో చేసే చికిత్సలకు ఎల్‌వోసీ ఎందుకన్న భావనకు ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారులు వచ్చారు. ఇటీవల వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోగ్యశ్రీపై సమీక్ష నిర్వహించినప్పుడు ఆయన దృష్టికి ఈ విషయం తీసుకొచ్చి.. నిమ్స్‌లో చేసే అన్ని సర్జరీలు, వైద్య సేవలనూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి అధికారికంగా ఇంకా జీవో విడుదల కావాల్సి ఉంది. తొలుత నిమ్స్‌తో మొదలుపెట్టి.. ఆ తర్వాత అన్ని సర్కారీ దవాఖానాల్లో దీన్ని అమలు చేసే అవకాశం ఉంది.

సీపీఎస్‌లో సర్కారు వాటా ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

జమ చేయడం లేదు. సీపీఎస్ ఉద్యోగులకు శాశ్వత పదవీవిరమణ ఖాతా సంఖ్య(ప్రాన్)లో ప్రతి నెలా సీపీఎస్ సొమ్మును ప్రభుత్వం జమ చేయాల్సి ఉంటుంది. 2023 అక్టోబరు నుంచి జమ కావడం లేదని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో 2004 సెప్టెంబర్ 1 నుంచి సీపీఎస్ విధానం అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీపీఎఫ్ ఖాతాలు ఉండవు. కేవలం సీపీఎస్ మాత్రమే అమలవుతోంది. ఉద్యోగి వాటా కింద మూల వేతనం, కరువు భత్యం(డీఏ) మొత్తం నుంచి ప్రతి నెలా 10 శాతాన్ని మినహాయించుకొని, 'నేషనల్ సెక్యూరిటీ డిపాజిటరీ లిమిటెడ్(ఎన్ఎస్‌డీఎల్)లోని ఉద్యోగుల ప్రాన్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది. ప్రభుత్వం కూడా తన వాటా కింద 10 శాతాన్ని ఉద్యోగుల ప్రాన్ ఖాతాల్లో జమ చేయాలి. రెండు వాటాలు కలిసి 20 శాతం సొమ్ము ప్రతి నెలా ప్రాన్ ఖాతాల్లో జమ అవుతుంటుంది. ఈ మొత్తాన్ని స్టాక్ మార్కెట్‌లో నిర్దేశిత పద్ధతిలో ఉద్యోగి ఖాతా సంఖ్య పేరిట ఎప్పటికప్పుడు నిధుల తరహాలో పెట్టుబడి పెడతారు. ఇందులో పెట్టుబడి, లాభాల రూపంలో జమ అయిన మొత్తం సొమ్ము నుంచి పదవీ విరమణ రోజు 40 శాతం డబ్బును ఉద్యోగి తీసుకునేందుకు అవకాశం ఇస్తారు. మిగిలిన 60 శాతాన్ని షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా కొనసాగిస్తారు. అందులో నుంచే ప్రతి నెలా కొంత మేర పెన్షన్ రూపంలో చెల్లించాలనేది సీపీఎస్ విధానం. ఈ విధానం వల్ల తాము నష్టపోతున్నామని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాల ఉద్యోగులు కూడా డిమాండ్ చేస్తున్నారు. ఉద్యమాలు సాగిస్తున్నారు. కొన్ని రాష్ట్రాలు సీపీఎస్‌ను రద్దు చేశాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీని జోలికి వెళ్లలేదు. కాంగ్రెస్ పార్టీ సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు ఇది రద్దు కాలేదు. కనీసం సీపీఎస్ కింద జమ చేయాల్సిన ప్రభుత్వ వాటాను కూడా విడుదల చేయకపోవడంపై ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. 2023 సెప్టెంబరు వరకు ఉద్యోగుల ప్రాన్ ఖాతాల్లో ప్రభుత్వం తన 10 శాతం వాటా సొమ్మును జమ చేసింది. 2023 అక్టోబరు నుంచి జమ చేయలేదు. ఉద్యోగుల వాటా 10 శాతం మాత్రమే క్రమం తప్పకుండా జమ అవుతోంది. దీనికి సంబంధించిన ఫోన్ మెసేజ్‌లు మాత్రమే ఉద్యోగులకు నెలనెలా వస్తున్నాయి. ప్రభుత్వ వాటా 10 శాతం గురించి ఎలాంటి సమాచారం లేదు. రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగుల సంఖ్య 1.70 లక్షలమంది ఉండేవారు. కొత్త ఉద్యోగులను కలుపుకుంటే రెండు లక్షలకు చేరింది. సగటు వేతనం 50 వేలు అనుకుంటే 10 శాతం చొప్పున ప్రతి నెలా రూ.5 వేలు ప్రాన్ ఖాతాల్లో జమ అవుతుంది. ప్రభుత్వం కూడా రూ.5 వేలను జమ చేయాలి. ఏటా రూ.120 లక్షలు ప్రాన్ ఖాతాల్లో జమ కావాలి. దాన్నే ఎన్ఎస్‌డీఎల్ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెడుతుంది. లాభ నష్టాలను ప్రాన్ ఖాతాల్లో జమ చేస్తుంది. ఏడాది కాలంగా ప్రభుత్వ వాటా జమ కాకపోవడం వల్ల ఆ కాలంలో షేర్ మార్కెట్ నుంచి ఉద్యోగికి అందాల్సిన లాభాల వాటా తగ్గిపోతుంది. ప్రభుత్వం భవిష్యత్తులో జమ చేసినా 10 శాతం లెక్క వేసి జమ చేస్తుందే తప్ప షేర్ మార్కెట్లో రావాల్సిన లాభాల వాటాను సమకూర్చుతుందన్న నమ్మకం లేదని ఉద్యోగ సంఘాలు అంటున్నాయి. లాభాల వాటాకు నష్టం కలిగించడమంటే సీపీఎస్ పథకం స్ఫూర్తిని దెబ్బ తీయడమేనని వ్యాఖ్యానిస్తున్నాయి.

ఏం చేశావో చెప్పలేక కేసీఆర్‌ను తిడతావా?

- కేసీఆర్ నామస్మరణ చేసినంత మాత్రాన నీ పాపం పోదు
- శాతగానోనికి మాటలెక్కువ.. చేవలేనోనికి బూతులెక్కువ
- రేవంత్ పరిస్థితి అలాగే ఉంది:హరీశ్



హైదరాబాద్/సుభాష్‌నగర్(నిజామాబాద్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'అధికారంలోకి వచ్చాక ప్రజలకు చేసిందేమీ లేదు.. నువ్ ఏంచేశావో చెప్పలేక పిచ్చి మాటలు మాట్లాడి.. కేసీఆర్‌ను తిడతావా? కాంగ్రెస్ విజయోత్సవ సభలో 11 నెలల ప్రగతి చెప్పకుండా కేసీఆర్ నామస్మరణ చేసినంత మాత్రాన నీ పాపం పోదు' అని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. వరంగల్ సభలో సీఎం వ్యాఖ్యలపై మంగళవారం ఒక ప్రకటనద్వారా ఆయన స్పందించారు. 'శాతగానోనికి మాటలెక్కువ. చేవలేనోనికి బూతులెక్కువ అన్నట్లుగా ఆయన పరిస్థితి ఉంది. నువ్వెంత గింజుకున్నా లాభంలేదు. అశోక్‌నగర్ నిరుద్యోగుల నుంచి లగచర్ల దాకా, రైతుల నుంచి గిరిజన బిడ్డల దాకా నువ్వు చేసిన ఘోరాలు సమసిపోవు. తెలంగాణ ప్రజలు మరిచిపోరు. కేసీఆర్‌లాంటి గొప్ప వ్యక్తి నీ జీవితంలో అర్థంకాడు. తొక్కుకుంటూ వచ్చానని గప్పాలు కొడుతున్నవ్. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ నాయకులను తొక్కినవ్.. షార్ట్‌కట్‌లో అధికారం చేజిక్కించుకొని ఇప్పుడు ప్రజలను తొక్కుతున్నావ్' అని హరీశ్ ధ్వజమెత్తారు.అన్నివర్గాలను విజయవంతంగా మోసంచేసిన కాంగ్రెస్ జరపాల్సింది విజయోత్సవం కాదని, అపజయోత్సవాలని పేర్కొన్నారు. ఏం సాధించావని సంబరాలు జరుపుకొంటున్నావని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కాగా, నిజనిర్ధారణ కోసం లగచర్లకు వెళ్తున్న సామాజిక కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని హరీశ్‌రావు మండపడ్డారు. పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య, ఇతర మహిళాసభ్యుల పట్ల ప్రభుత్వ నిరంకుశవైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అధికారం ఉందని సాధారణ ప్రజలనే కాదు, జర్నలిస్టులు, మానవహక్కుల కార్యకర్తలను నిర్బంధాలకు గురిచేస్తున్నారని, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నిర్బంధ, నిరంకుశ, రాక్షస పాలన కొనసాగిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. కాగా ఈ ఏడాది సెప్టెంబరు 9న కాళోజి జయంతి సందర్భంగా, సాహితీవేత్త నలిమెల భాస్కర్‌కు కాళోజీ నారాయణరావు సాహితీ పురస్కారం ప్రకటించి ఇప్పటివరకూ ప్రదానం చేయకపోవడం శోచనీయమని హరీశ్ రావు విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ బీఆర్ఎస్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడకుండా కాంగ్రెస్‌లో జరుగుతున్న కుమ్ములాటల గురించి పట్టించుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే ఆ పార్టీని ప్రజలు చీదరించుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ కాదు.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీయే మూసీలో మునగడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల్లో ఎవరిని కదిలించినా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తమవుతోందని, నిర్లక్ష్య పాలనతో కాంగ్రెస్‌పార్టీ తనగొయ్యిని తానే తవ్వుకుంటోందని విమర్శించారు.

పీడీఎస్ బియ్యం.. లీకేజీ నియంత్రణలో తెలంగాణ టాప్!

- రాష్ట్రంలో కేవలం 0.3% బియ్యం మాత్రమే పక్కదారి
- గుజరాత్, అరుణాచల్, నాగాలాండ్‌లో అత్యధికం
- పౌరసరఫరాలశాఖ అధికారులకు ఉత్తమ్ అభినందనలు



హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా పేదలకు చేరాల్సిన బియ్యం నల్లబజారుకు తరలిపోకుండా చర్యలు తీసుకోవడంలో తెలంగాణ అగ్రభాగంలో ఉంది. రాష్ట్రంలో కేవలం 0.3% బియ్యం మాత్రమే పక్కదారి పడుతున్నట్లు ఇండియన్ కౌన్సిల్ ఫర్ రిసెర్చ్ అండ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్(ఐసీఆర్ఐఈఆర్) నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. రాష్ట్రంలో సుమారు 2.81 కోట్ల మంది వినియోగదారులకు నెలకు సగటున 2 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పీడీఎస్ ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తుండగా.. మధ్యాహ్న భోజన పథకం, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు కలిపి.. మొత్తం 49 లక్షల మంది విద్యార్థులు ఈ పథకంలో లబ్ధిపొందుతున్నారు. ఈ బియ్యం పక్కదారి పట్టకుండా, నిజమైన లబ్ధిదారులకు చేరేలా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కృషిచేస్తోందని.. అందుకే అరుదైన ఘనత సాధించిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను అభినందించారు.

గుజరాత్‌లో 43 శాతం!

తెలంగాణ రాష్ట్రంలో పీడీఎస్ ద్వారా ఏటా 24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారులకు చేరుతోంది. ఇందులో 0.3% మాత్రమే పక్కదారి పడుతున్నట్లు సర్వేలో తేలింది. పకడ్బందీ వ్యవస్థల ద్వారా పంపిణీ చేయడం వల్లే.. అక్రమాలకు అడ్డుకట్ట పడుతోందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో 89.97 లక్షల ఆహార భద్రత కార్డులు, 2.81 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నట్లు వివరించారు. వీరికి 17,235 రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. అయితే.. ఆన్‌లైన్ ప్రొక్యూర్మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఓపీఎంఎస్) సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తుండడంతో.. అర్హులైన వినియోగదారులకు మాత్రమే బియ్యం పంపిణీ అవుతోంది. అక్రమార్కులపై నిత్యావసర వస్తువుల చట్టంలోని 6(ఏ) సెక్షన్ ప్రకారం కేసులు నమోదు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల విషయానికి వస్తే.. బియ్యం పక్కదారి పట్టడంలో అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, గుజరాత్ రాష్ట్రాలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. గుజరాత్‌లో 43% బియ్యం పక్కదారి పడుతోంది. ఉత్తరప్రదేశ్‌లో లీకేజీ శాతం 33గా ఉంది.

రేవంత్ అల్లుడిపై ఈడీకి బీఆర్ఎస్ ఫిర్యాదు

న్యూఢిల్లీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అల్లుడు జి. సత్యనారాయణ డైరెక్టర్‌గా ఉన్న మ్యాక్స్ బెయాన్ ఫార్మా కంపెనీపై ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. సంబంధిత కంపెనీలో సత్యనారాయణకు 16 లక్షల షేర్లు ఉన్నట్లు బీఆర్ఎస్ నేత క్రిశాంక్ ఈడీ అధికారులకు తెలిపారు. అదే కంపెనీలో మరో డైరెక్టర్‌గా అన్నం శరత్ ఉన్నారని, ఆయనకు సంబంధించిన మరో కంపెనీలో కూడా రేవంత్ అల్లుడుకి 21 లక్షల షేర్లు ఉన్నాయని ఆరోపించారు. "వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో రైతుల భూములను తీసుకొని మ్యాక్స్ బెయాన్ ఫార్మా కంపెనీకి కట్టబెట్టాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. అక్కడ ఏర్పాటు చేసే మరో ఫార్మా కంపెనీలోనూ రేవంత్ అల్లుడికి వాటా ఉన్నట్టు తెలిసింది. ఇటీవల వరంగల్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రి ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ వెళ్లడం అనుమానాలకు బలాన్నిస్తోంది. రేవంత్ అల్లుడి కుటుంబంపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఈడీ ఇప్పటికే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. మ్యాక్స్ బెయాన్ ఫార్మా కంపెనీ ఆర్థిక లావాదేవీలపై విచారణ జరపాలి" అని ఫిర్యాదు చేసినట్టు క్రిశాంక్ పేర్కొన్నారు.

ప్రజలే ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టుకోవాలా?: కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ నిర్వహణ, సరఫరా చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బంది పెట్టేలా మరో తుగ్లక్ చర్య చేపట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్‌లో విద్యుత్ వినియోగం పెరిగిందని, దానికి ప్రజలే వ్యక్తిగతంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలంటూ ప్రభుత్వం జనంపై భారం మోపే ప్రయత్నం తగదని పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్ సముదాయాల్లో విద్యుత్ వినియోగం 20 కిలోవాట్ (కేడబ్ల్యూ) దాటితే అపార్ట్‌మెంట్ వాసులు సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకోవాలని టీజీఎస్పీడీసీఎల్ నోటీసులు ఇవ్వడంపై మంగళవారం ఒక ప్రకటనలో ఆయన అభ్యంతరం వ్యక్తంచేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ నిబంధన ఎందుకు తెచ్చారని ప్రశ్నించారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.



తెలంగాణ యాస నెపుడు ఈసడించు భాషీయుల సహృద్భావ మెంతని వర్ణించుట సిగ్గుచేటు

పుటక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది

- కాళోజీ

కాళోజీ కళాక్షేత్రం ఆవరణలో నిర్మించిన కాళోజీ విగ్రహం



మహిళా సంఘాలకు రుణాల చెక్కులు పంపిణీ చేస్తున్న సీఎం, మంత్రులు

కేసీఆర్.. కాన్స్కో



(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ సమాజం 66 లక్షల ఎకరాల్లో కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండిస్తోందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఏనాడూ ఇంత పంట రాలేదని చెప్పారు. కనీస మద్దతు ధర కల్పించడమే కాకుండా సన్నవడ్లకు రూ.500 బోనస్ కూడా ఇచ్చి కొంటున్న రాష్ట్రం మనదేనని, దేశంలోనే రైతులను ఆదుకున్న ప్రభుత్వం తమదని అన్నారు. 23 లక్షల రైతు కుటుంబాలకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశామని చెప్పారు. ఇంకా కొంతమంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందని, ఖాతాల్లో తప్పులు సరి చేసుకుంటే అందరికీ రుణమాఫీ చేసే బాధ్యత తనదని సీఎం హామీ ఇచ్చారు. సమ్మక్క- సారలమ్మ, భద్రకాళి సాక్షిగా పంద్రాగస్టుకు రుణమాఫీ చేస్తానని చెప్పి.. చేసి చూపించానన్నారు. రాష్ట్రంలో 50 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. 11 నెలల్లో 1.10 కోట్ల మంది ఆడబిడ్డల ఉచిత బస్సు ప్రయాణానికి రూ.3,700 కోట్లు ఖర్చు పెట్టామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా.. రూ.34 వేల కోట్లతో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులను మహిళా సంఘాలకు ఇవ్వాలనుకుంటున్నామని చెప్పారు.

నీ దుఃఖం, బాధ ఏంటో చెప్పు..

"చంద్రశేఖర్‌రావు! నీ దుఖం ఏందో.. బాధ ఏందో చెప్పు. నువ్వు చెప్పింది నిజమైతే.. అసెంబ్లీకి రా! చర్చ పెడతాం.. తేదీ, సమయం నువ్వే చెప్పు. ఆరోజే అసెంబ్లీ పెడతా. ఓడితే పోయి ఇంట్లో పడుకుంటావా? రాహుల్‌గాంధీని చూసి నేర్చుకో! మూడుసార్లు ఓడిపోయినా ప్రతిపక్షంలో ఉండి.. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 150 రోజులు 4వేల కిలోమీటర్లు మండుటెండల్లో.. మంచుకొండల్లో పాదయాత్ర చేసి ప్రజలకు అందుబాటులో ఉన్న బాధ్యతాయుత ప్రతిపక్ష నాయకుడాయన. నువ్వు మాత్రం అధికారంలో ఉంటే దోచుకుంటా.. ప్రతిపక్షంలో ఉంటే ఫామ్ హౌస్‌లో పడుకుంటా అంటున్నవు. ఇదేనా నీ విధానం? నిజంగా ప్రజలు కష్టాల్లో ఉంటే ఫామ్‌హౌస్‌లో గాడిద పళ్లు తోముతున్నావా? ప్రజల్లోకి వచ్చి మాట్లాడు.. ప్రతిపక్షంగా ప్రభుత్వానికి ఏం సూచన చేస్తావో చెయ్. వినడానికి మేం సిద్ధంగా ఉన్నాం. నువ్వు లేవనెత్తిన అంశాలు సహేతుకంగా ఉంటే సరిదిద్దేందుకు సిద్ధంగా ఉన్నాం" అని సీఎం రేవంత్ అన్నారు. పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని, ధనిక రాష్ట్రాన్ని రూ.7 లక్షల కోట్ల అప్పులపాలు చేశారని ఆరోపించారు. రాష్ట్రానికి ప్రతినెలా వస్తున్న ఆదాయం రూ.18 వేల కోట్లు అని తెలిపారు. వీటిలో రూ.6,500 కోట్లు ఉద్యోగుల జీతాలకు, పించన్‌లకు ఖర్చు చేస్తున్నామని, మరో రూ.6,500 కోట్లు కేసీఆర్ చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కడుతున్నామని వివరించారు. మిగిలిన రూ.5 వేల కోట్లతో రాష్ట్రంలో ప్రజల అవసరాలు తీర్చడానికి కష్టపడుతుంటే.. బావ బామ్మర్దులు బిల్లారంగాల్లా కాళ్లల్లో కట్టె పెడుతున్నారని బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావులనుద్దేశించి రేవంత్ వ్యాఖ్యానించారు.

తాగుబోతుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడు కేసీఆర్

ఇంటాయన చేతిలో నగదు ఉంటే బెల్ట్ షాపునకు పోతాయని, ఆడబిడ్డల దగ్గర నగదు ఉంటే వారి పిల్లలు బడికి పోతారని సీఎం రేవంత్ అన్నారు. "నేడు ఊరూరా తాగునీరు దొరికినా, దొరక్కపోయినా.. కేసీఆర్ తెచ్చిన బెల్టు షాపోళ్ల దగ్గరకు నగదు మాత్రం బాగా పోతుంది. కానీ, మన ప్రభుత్వంలో ఉచిత కరెంట్‌తో మిగిలిన నగదు, సిలిండర్‌లో మిగిలిన నగదు, మహిళా సంఘాలకు జీరో వడ్డీతో ఇచ్చిన నగదుతో మా ఆడబిడ్డలు వారి బిడ్డలను బడికి పంపించి ప్రయోజకులను చేస్తున్నరు" అని రేవంత్ తెలిపారు. రాష్ట్రంలో తాగుబోతుల సంఘానికి ఏకగ్రీవ అధ్యక్షుడు కేసీఆర్ అని సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మీరు ఆ ఫామ్‌హౌస్‌లోనే ఉండండి. కావాలంటే ఆ బ్రాండిషాపు బిల్లు కూడా కట్టొద్దు. మా పిల్లల్లో ఎవరో ఒకరు కడతారు. ఎవరో ఇస్తే ఈ కుర్చీలోకి రాలేదు. నిన్ను తొక్కుకుంటూ వచ్చాను" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

గుజరాత్‌లో సబర్మతి నదిని అభివృద్ధి చేస్తే.. మోదీ గొప్పగా చేశారంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చప్పట్లు కొడతారని, అదే మూసీని ప్రపంచానికి ఆదర్శంగా అభివృద్ధి చేస్తామంటే ఒప్పుకోరని రేవంత్ తప్పుబట్టారు. పైగా.. సిగ్గులేకుండా తాను మోదీ గులామునని చెప్పుకొంటున్నారని, తననేమో సోనియమ్మకు గులాం అంటున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ చచ్చిపోయినా సోనియమ్మ కన్నతల్లిలా గొప్ప మనసుతో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని, నాలుగు కోట్ల ప్రజలకు ఆమె కన్నతల్లి అని అన్నారు. "ఆమెకు ఊడిగం కాదు.. కాళ్ల కడిగి నెత్తి

సోనియా కాళ్లు కడిగి నెత్తిన చల్లుకుంటాం కిషన్‌రెడ్డీ!

మీద చల్లుకున్నా తక్కువే అవుతుంది. ఇది అవమాన కాదు.. ఆత్మగౌరవం. ఇప్పటికైనా రా! మనమిద్దరం సోనియమ్మ కాళ్లు కడిగి నెత్తిమీద చల్లుకుంటే మోదీకి ఊడిగం చేసినందుకు నీకు కొంతైనా ప్రక్షాళన జరుగుతుంది. రాష్ట్ర ఏర్పాటునే అపహాస్యం చేసిన నరేంద్రమోదీ.. తెలంగాణ ద్రోహి. ఆయనకు బానిసవై.. గులాంవై.. ఊడిగం చేస్తున్న నువ్వు గుజరాత్‌కు పోయి గాడిదలు కాచుకో. తెలంగాణలోఒక్క నిమిషం కూడా ఉండేందుకు నీకు అర్హత లేదు. నీకు నౌకరీ ఇచ్చింది మోదీ కాదు.. సికింద్రాబాద్ ప్రజలు అనే విషయాన్ని గుర్తుపెట్టుకో" అంటూ కిషన్‌రెడ్డినుద్దేశించి రేవంత్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాళోజీ బతికి ఉంటే కేసీఆర్‌ను, కిషన్‌రెడ్డిని పొలిమేరల వరకు తరమాలని చెప్పేవారన్నారు. దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రూ.500కు గ్యాస్ సిలిండర్ ఇస్తున్నారేమో చెప్పాలని డిమాండ్ చేశారు.



సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహిళ శక్తి స్టాల్స్‌ను సందర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఎయిర్‌పోర్టులు తీసుకొస్తాం..

హైదరాబాద్‌తో పోటీపడేలా వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, సగం నల్లగొండ ఉమ్మడి జిల్లాలకు వరంగల్లే అత్యంత దగ్గరి నగరమన్నారు. వరంగల్‌ను అభివృద్ధి చేస్తే సగం తెలంగాణను అభివృద్ధి చేసినట్లేనని భావించి బాధ్యత తీసుకున్నామన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారానికి వెళ్లి చూస్తే.. పుణెలోనే కా కుండా నాందేడ్, సోలాపూర్.. ఇలా ఎక్కడ చూసినా ఎయిర్‌పోర్టులున్నాయని తెలిపారు. నూరు, నూటయాభై కిలోమీటర్లకు బస్సు డిపోలు ఉన్నట్టు మహారాష్ట్రంలో ఎయిర్‌పోర్టులు ఉన్నాయన్నారు. పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో కూడా విజయవాడ, కడప, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రిలో ఉన్నాయని, ఇలా ఏ రాష్ట్రం చూసిన ఐదారు ఎయిర్‌పోర్టులు ఉంటే.. తెలంగాణలో ఒకే ఒక ఎయిర్‌పోర్టు హైదరాబాద్‌లో ఉందన్నారు. అందుకే వరంగల్‌తో పాటు ఆదిలాబాద్, కొత్తగూడెం, రామగుండంలో నాలుగు ఎయిర్‌పోర్టులు పెట్టుకుని ప్రపంచంతో పోటీపడి, పరిశ్రమలను తెచ్చుకుంటామని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నాడు వైఎస్.. నేడు రేవంత్

- ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం, మహిళల పురోగతి అంశాల్లో ఇద్దరూ ఒక్కటే
- సీఎంపై మంత్రులు సీతక్క, సురేఖ వ్యాఖ్యలు

హనుమకొండ సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డిని ఉమ్మడి రాష్ట్ర దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డితో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క పోల్చారు. విజయోత్సవ సభలో వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌పై ప్రశంసలు కురిపించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఆశయంతో నాడు వైఎస్ పరిపాలన సాగిస్తే నేడు సీఎం రేవంత్ రెడ్డి కూడా అదే దారిలో పని చేస్తున్నారన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో వడ్డీ లేని రుణాలను అందిస్తున్నారని తెలిపారు. సోలార్ పవర్ ప్రాజెక్టులు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ తదితర వ్యాపారాలతో మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించే మార్గాలను రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఇక, ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రుల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత రేవంత్‌రెడ్డే ఉన్నారని మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ నగరాభివృద్ధికి రూ.6వేల కోట్లు కేటాయించి ప్రజల ఆకాంక్షలను సీఎం రేవంత్ నెరవేర్చారని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ వరంగల్ అభివృద్ధి అంశంలో మాటలకే పరిమితమయ్యారన్నారు.

మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: భట్టి

వరంగల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తున్నామని తెలిపారు. వచ్చే నాలుగేళ్లలో 4వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తిని మహిళ సంఘాల ద్వారా చేపడతామన్నారు. ఈ ఏడాది వెయ్యి మెగా వాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళిక రూపొందించామని, ప్రాజెక్టు నిర్వహణకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామని తెలిపారు. ఇందిరాగాంధీ జయంతి రోజునే కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఇందిరా గాంధీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.

'మూసీ'పై ప్రతిపక్షాలది గగ్గోలు : కోమటిరెడ్డి

మూసీ నది ప్రక్షాళన చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. మూసీ ప్రభావం నల్లగొండ జిల్లాపైనా ఉందని, ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా సీఎం రేవంత్ మూసీ ప్రక్షాళన చేపడితే ప్రతిపక్షాలు గగ్గోలు చేయడం సరికాదన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు ప్రజల మేలును తలచే వారు కాదని మండిపడ్డారు.

వరంగల్ అభివృద్ధే సీఎం లక్ష్యం : పొంగులేటి

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేయలేదని, నగరాభివృద్ధికి కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదని తెలిపారు. కానీ, తమ ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్-2041 తీసుకొచ్చిందని, ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రూ.210కోట్లు, భద్రకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధి, వరంగల్ బస్టాండ్ ఆధునికీకరణ తదితర అభివృద్ధి పనులకూ నిధులు మంజూరు చేసిందని అన్నారు.

గత పదేళ్లలో ప్రగతి శూన్యం : జూపల్లి

బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులమయం చేసిందని, పదేళ్లలో రాష్ట్రంలో సాధించిన ప్రగతి శూన్యమని రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి చర్యలు చేపట్టిందన్నారు. రైతులకు ఇచ్చిన మాటను సీఎం నిలబెట్టుకున్నారని చెప్పారు. కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేయలేపోయిన బీఆర్ఎస్ బీరాలు పలుకుతోందని విమర్శించారు.

మాట నిలబెట్టుకున్నాం: దుద్దిళ్ల, పొన్నం

రాష్ట్రంలోని వివిధ వర్గాలకు ఇచ్చిన మాటలను అధికారం చేపట్టిన ఏడాదిలోపే కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మరో నాలుగేళ్లలో మరింత ద్విగుణీకృత ఉత్సాహంతో పని చేస్తామని, ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఇక, రాష్ట్రం అప్పుల్లో చిక్కుకున్నా ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకోవడంలో సీఎం రేవంత్ రెడ్డి వెనక్కు తగ్గలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాళేశ్వరం పేరిట బీఆర్ఎస్ నాయకులు ప్రజాధనాన్ని దోచుకుతిన్నారని ఆరోపించారు. కులగణన సర్వేతో నిరుపేదల జీవన అవసరాలు, అంచనాలు ప్రభుత్వానికి తెలుస్తాయని, ప్రతీ ఒక్కరూ సర్వేలో వివరాలు చెప్పాలని ప్రజలను కోరారు.

సాగు రైతుల ఖాతాల్లోనే నగదు జమ

- ధాన్యం, పత్తి కొనుగోళ్లలో అవకతవకలు జరగొద్దు
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరి, పత్తి కొనుగోళ్లకు సంబంధించి పంటలు సాగు చేసిన రైతుల ఖాతాల్లో మాత్రమే నగదు జమ చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆయా పంటల కొనుగోళ్ల విషయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎలాంటి అవకతవకలకు తావివ్వొద్దని, రైతులకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సచివాలయం నుంచి మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యలు, సౌకర్యాలపై ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, నాగర్ కర్నూల్, కామారెడ్డి, జనగామ, మహబూబ్ నగర్, పెద్దపల్లి జిల్లాల్లోని రైతులను అడిగి తెలుసుకున్నారు. సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి బోనస్ పొందిన రైతులతోనూ మంత్రి తుమ్మల మాట్లాడారు.

14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం

- ఇప్పటికే రూ. 50కోట్లు బోనస్ రూపంలో చెల్లించాం
- రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

గజ్వేల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లను చేపట్టామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ మనూచౌదరితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులకు కొనుగోలు కేంద్రాల్లో అన్నిరకాల ఏర్పాట్లు చేశామన్నారు. మొదటిసారిగా రైతులకు బోనస్ ఇస్తున్నామని, ఇప్పటికే రూ.50 కోట్లను బోనస్ రూపంలో చెల్లించినట్లు పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు 'ముఖ గుర్తింపు' హాజరు

- ప్రతి అంతస్తులోని లిఫ్టు వద్ద ఏర్పాటు

సచివాలయ ఉద్యోగులకు ఇకమీదట 'ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్)' హాజరు విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ వర్తింపజేయనున్నారు. దీనికి సంబంధించి ఈ నెల 22 నుంచి ఉద్యోగుల రిజిస్ట్రేషన్లు చేపట్టనున్నారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. అధికారులు, ఉద్యోగుల హాజరు శాతాన్ని నిక్కచ్చిగా అంచనా వేయడానికి ప్రభుత్వం ఈ విధానాన్ని అమల్లోకి తెస్తోంది. ప్రస్తుతం సచివాలయంలోని అన్ని శాఖలు, విభాగాల్లో రిజిస్టర్లలో సంతకాలు చేసే మాన్యువల్ విధానం కొనసాగుతోంది. దీని స్థానంలో 'ముఖ గుర్తింపు' హాజరు విధానాన్ని ఆచరణలో పెట్టాలని నిర్ణయించింది. సచివాలయంలో ప్రస్తుతం నాల్గో తరగతి ఉద్యోగుల నుంచి ఏఎస్‌ఓలు, సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్రటరీలు, డిప్యూటీ సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, అడిషనల్ సెక్రటరీల వరకు దాదాపు 4వేల మంది పని చేస్తున్నారు. ఐఏఎస్‌లు వినహా అందరికీ ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అమలు చేయనున్నారు. వీరికి రిజిస్ట్రేషన్లను ఈ నెల 22 న ప్రారంభించనున్నట్లు సీఎస్ తెలిపారు.

కాళోజీ కళాక్షేత్రం ప్రజలకు అంకితం

కాళోజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్.. వరంగల్ మాస్టర్‌ప్లాన్-2041 ఆవిష్కరణ.. ఆమోదం

- మహిళాశక్తి భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన



హనుమకొండ హయగ్రీవాచారి మైదానంలో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన డిప్యూటీసీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, కొండా సురేఖ, టీపీసీసీ చీఫ్ మహేష్

వరంగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజాకవి కాళోజీ నారాయణ రావు పేరిట నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించి.. జాతికి అంకితం చేశారు. మంగళవారం మధ్యాహ్నం 3.45 గంటలకు హెలికాప్టర్‌లో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రానికి చేరుకున్న సీఎం.. రూ.95 కోట్ల వ్యయంతో నిర్మించిన కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కాళోజీ నారాయణరావు కాంస్య విగ్రహాన్ని డ్రోన్ కెమెరాతో ఆవిష్కరించారు. అనంతరం కాళోజీ విగ్రహానికి పూలు వేసి నివాళులర్పించారు. కాళోజీ ఆర్ట్ గ్యాలరీలోని కాళోజీ రచనలు, పుస్తకాలను పరిశీలించారు. కాళోజీ డాక్యుమెంటరీని మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి వీక్షించారు. కాళోజీ కుటుంబసభ్యులను కలిసి మాట్లాడారు. అంతకుముందు వరంగల్ మాస్టర్ ప్లాన్-2041ను సీఎం ఆవిష్కరించి ఆమోదం తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల పరిధిలో పనిచేసే నార్కోటిక్ పోలీస్‌స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో ప్రజాపాలన విజయోత్సవ సభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఆర్ట్స్ కాలేజీ మైదానంలో మహిళా సంఘాల ప్రతినిధులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించి.. వారితో కొద్దిసేపు ముచ్చటించారు. సభలో ప్రసంగం ముగిసిన అనంతరం 22 జిల్లాల్లో రూ.105 కోట్లతో నిర్మించే మహిళాశక్తి భవనాలను వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో మృతి చెందిన మహిళల కుటుంబ సభ్యులకు రూ.35 కోట్ల బీమా చెక్కులను అందజేశారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి తన సెంటిమెంట్‌గా హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభ విజయవంతమయింది. ఉమ్మడి వరంగల్‌తోపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కూడా మహిళలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సీఎం రేవంత్ ప్రసంగానికి క్యాడర్ నుంచి భారీగా స్పందన లభించింది. అంచనాలకు తగ్గట్టుగా సభా ప్రాంగణం నిండిపోవడం కాంగ్రెస్ నేతల్లో జోష్‌ను నింపింది.

ఎమ్మెల్యే మాధవరెడ్డి మళ్లీ డుమ్మా...

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రెండోసారి డుమ్మా కొట్టారు. తొలి నుంచి రేవంత్‌రెడ్డితో ఆయన అంటీముట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారు. జూన్ 29న హనుమకొండ కలెక్టరేట్‌లో సీఎం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశానికి కూడా ఎమ్మెల్యే మాధవరెడ్డి హాజరు కాలేదు. స్థానికంగా ఉండి కూడా సీఎం పర్యటనకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహించిన సభలో కూడా ఎమ్మెల్యే పాల్గొనకపోవటం చర్చనీయాంశంగా మారింది.

విపక్ష, విద్యార్థి సంఘాల నేతల అరెస్టు

హనుమకొండ టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు.. నిరసనలకు సిద్ధమైన వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులను సోమవారం అర్ధరాత్రి నుంచే ముందస్తు అరెస్టు చేశారు. కుడా మైదానం నుంచి ఇందిరా మహిళా శక్తి విజయోత్స సభ జరిగే ఆర్ట్స్ కళాశాల మైదానం వరకు అడుగడుగునా పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. సీఎం కాన్వాయ్ సభాస్థలికి వచ్చే సమయంలో స్వేరోస్ ఆధ్వర్యంలో అదాలత్ వద్ద ఆందోళనకు సిద్ధమవుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. కాళోజీ కళాక్షేత్రంలో కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేయాలంటూ కాళోజీ జంక్షన్‌లో సౌత్ ఇండియా స్టూడెంట్ ఆర్గనైజేషన్, తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసనకు ప్రయత్నిస్తుండగా వారిని అరెస్టు చేశారు.

రాజన్న ఆలయానికి మహర్దశ

- వేములవాడకు 127 కోట్ల నిధులు
- నేడు దేవస్థానానికి సీఎం రేవంత్‌రెడ్డి

సిరిసిల్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధిపై కాంగ్రెస్ సర్కారు ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎన్నికల ప్రచార సమయంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రాజన్నను దర్శించుకున్న రేవంత్‌రెడ్డి.. క్షేత్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రావడంతోనే బడ్జెట్‌లో రూ.50 కోట్ల నిధులు కేటాయించారు. వేములవాడలో ఇతర అభివృద్ధి పనులు, ఆలయ విస్తరణకు రూ.127.65 కోట్లు మంజూరు చేస్తూ సోమవారం జీవోలు జారీ చేశారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడలో స్వామివారిని దర్శించుకుని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. అయితే, రద్దీకి అనుగుణంగా ఆలయంఅభివృద్ధికి నోచుకోకపోవడం, భక్తులకు సరిపడా మౌలిక వసతులు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. గత ప్రభుత్వం ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తూ రూ.400 కోట్లకు పైగా ఖర్చు చేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినా.. అది ఆచరణకు నోచుకోలేదు. బీఆర్ఎస్ సర్కారు హామీలు కాగితాల మీద డిజైన్లుగానే మిగిలిపోయాయి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వేములవాడ అభివృద్ధి కోసం రూ.127.65 కోట్లు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేసింది.



మెదక్‌లోని ఓ ప్రాంతంలో చలి కాచుకుంటున్న ప్రజలు

కోహీర్ @ 9.5

రాష్ట్రంలో పెరుగుతున్న చలి తీవ్రత

- వారంలో 7-8 డిగ్రీలు పడిన రాత్రి ఉష్ణోగ్రతలు
- రాగల 3 రోజులకు యెల్లో అలెర్ట్

హైదరాబాద్, కోహీర్, ఆసిఫాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలిపులి విజృంభిస్తోంది. వారం రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోతూ ఏకంగా 7-8 డిగ్రీల మేర తగ్గాయి. దాంతో చలి తీవ్రత పెరిగింది. చలి ప్రభావం ఎక్కువగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు సాయంత్రం 6 గంటలలోపే ఇళ్లలోకి చేరుకుని చలి మంటలు వేసుకున్నారు. రాగల మూడు రోజుల పాటు చలి తీవ్రతకు సంబంధించి హైదరాబాద్ వాతావరణ కేంద్రం యెల్లో అలెర్ట్ జారీ చేసింది. 33 జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంటుందని పేర్కొంది. మరోవైపు ఈ సీజన్‌లో మొదటిసారి సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం రాత్రి సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో ఉష్ణోగ్రత అత్యల్పంగా 9.5 డిగ్రీలకు పడిపోయింది. కోహీర్‌లో గతేడాది ఇదే సమయంలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు 16.4 డిగ్రీలు నమోదు కాగా.. తాజాగా అది పదిలోపునకు పడిపోయింది. కేవలం ఒక్క రోజులోనే ఆ ప్రాంతంలో ఏకంగా 5 డిగ్రీల మేర రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గిపోయినట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. అలాగే రాగల మూడు రోజుల పాటు రాత్రిపూట 10-13 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, వాతావరణశాఖ వెల్లడించింది.

రాష్ట్రంలో సోమవారం రాత్రి నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతల వివరాలు

జిల్లా	మండలం	కనిష్ట ఉష్ణోగ్రతలు
సంగారెడ్డి	కోహీర్	9.5
ఆసిఫాబాద్	సిర్పూర్	10.5
వికారాబాద్	మర్పల్లి	11.2
రంగారెడ్డి	చౌదరిగూడెం	11.3
సిద్దిపేట, మెదక్	మర్కుక్,శివంపేట	11.5

తప్పుడు పత్రాలతో బ్యాంకులకు
రూ. 266.74 కోట్ల బురిడి

- 2.43 కోట్ల బ్లాసమ్స్ ఆయిల్ కంపెనీ ఆస్తుల అటాచ్
- కొనసాగుతోన్న ఈడీ విచారణ

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలు సమర్పించి బ్యాంకులను బురిడి కొట్టించిన కేసులో హైదరాబాద్‌కు చెందిన బ్లాసమ్స్ ఆయిల్ అండ్ ఫ్యాట్స్ లిమిటెడ్ కంపెనీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ కొనసాగుతోంది. ఆ కంపెనీ ప్రమోటర్లు, డైరెక్టర్లు ఇండియన్ ఓవర్సీస్, ఇండియన్ బ్యాంకులకు తప్పుడు బ్యాలెన్స్ షీట్లు, ఇతర ఫోర్జరీ పత్రాలు సమర్పించి రూ. 266.74 కోట్ల రుణం పొందారు. ఆ మొత్తాన్ని సంస్థ అవసరాలకు కాకుండా ఇతర అవసరాలకు, వ్యక్తిగత ఖాతాలకు దారి మళ్లించారు. బ్యాంకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. 2019లో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేసింది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టింది. విచారణలో భాగంగా సంస్థకు సంబంధించిన రూ. 2.43 కోట్ల స్థిర, చరాస్తులను అటాచ్ చేసింది. తాము అటాచ్ చేసిన ఆస్తుల్లో నివాస సముదాయాలతోపాటు, వ్యాపార సముదాయాలు ఉన్నట్లు ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు తెలిపారు. కేసు తదుపరి విచారణ కొనసాగుతోందని చెప్పారు.

గుండ్లపోచంపల్లిలో రెండో రోజూ కూల్చివేతలు

మేడ్చల్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లి మునిసిపాలిటీ ఖాజీగూడ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో చేపట్టిన అక్రమ కట్టడాల కూల్చివేతలు రెండో రోజూ కొనసాగాయి. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడంతో పాటు, అధికారుల విధులను అడ్డుకున్న 9 మందిపై క్రిమినల్ కేసు పెట్టాలని కోరుతూ తహసీల్దార్ శైలజ పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం కట్టడాలు కూల్చడానికి వచ్చిన అధికారులను ఆక్రమణ దారులు అడ్డుకోవటంతో పూర్తిస్థాయిలో నిర్మాణాలను తొలగించలేకపోయారు. దీంతో భారీ బందోబస్తుతో మంగళవారం రెవెన్యూ అధికారులు తిరిగి కూల్చివేతలను చేపట్టగా కొందరు ఆక్రమణదారులు కూల్చటానికి తీసుకొచ్చిన ఎక్స్‌కవేటర్లకు అడ్డంగా పడుకుని ఇబ్బంది పెట్టారు. చివరికి అధికారులు పోలీసు బందోబస్తుతో అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన నిర్మాణాలను పూర్తి స్థాయిలో నేలమట్టం చేశామని తహసీల్దార్ శైలజ పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున ఈఎస్ఐ డిస్పెన్సరీ కోసం కేటాయించిన ఎకరం స్థలాన్ని సర్వే చేసి హద్దులు పాతి ఆ శాఖ అధికారులకు అప్పగించామని తెలిపారు.

లాభాలు ఉండవని..
శునకాలను నగరం నుంచి తరలించరా?

- లాభాల కోసం ప్రభుత్వాలు పనిచేస్తాయా?: హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): "చిన్నారులు, వృద్ధులపై క్రూరంగా దాడి చేస్తున్న శునకాలను హైదరాబాద్ నుంచి బయటకు తరలించరా? అలా తరలించడం లాభదాయకం కాదంటే ఎలా? ప్రభుత్వాలు లాభాల కోసం పనిచేయవుకదా?" అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు నిలదీసింది. హైదరాబాద్ నగరంలో శునకాల ఆగడాలకు కళ్లెం వేయడానికి.. నగరం బయట షెల్టర్లు ఏర్పాటు చేయాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. శునకాల దాడి అంశంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావు ధర్మాసనం మంగళవారం మరోమారు విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలను వినిపిస్తూ.. హైదరాబాద్ వెలుపల షెల్టర్ల ఏర్పాటు సాధ్యం కాదని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. "సాధ్యం కాదంటే ఎలా? కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేసినా.. శునకాల దాడులు కొనసాగుతున్నాయి. దీనికి ఏదో ఒక పరిష్కారం ఉండాలి కదా? నిపుణులతో మాట్లాడి.. పరిష్కారాలతో రావాలనే మా ఆదేశాలపై మీరు శ్రద్ధ వహించడం లేదు" అని వ్యాఖ్యానించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

డిగ్రీ కాలేజీల బంద్ విరమణ

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీ-యింబర్స్‌మెంట్ బిల్లుల పెండింగ్‌ను నిరసిస్తూ మంగళవారం నుంచి కళాశాలల బంద్‌ను పాటించాలని తీసుకున్న నిర్ణయాన్ని డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు ఉపసంహరించుకున్నాయి. దాంతో రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీలు యథావిధిగా కొనసాగనున్నాయి. ఫీజుల పెండింగ్ అంశంపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి సమక్షంలో మంగళవారం చర్చలు జరిగాయి. ప్రభుత్వ పెద్దలతో చర్చించి సమస్య పరిష్కారానికి త్వరలోనే ఓ ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తానని చైర్మన్ కళాశాల యాజమాన్యాలకు హామీ ఇవ్వడంతో బంద్ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు.

పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం వద్దు

పాఠశాల నిర్వహణ సమయాల్లో తరగతి గదులు, పాఠశాల పరిసరాల్లో ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదని స్పష్టం చేస్తూ విద్యాశాఖ ఓ సర్క్యులర్ జారీ చేసింది. మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - కరీంనగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంతో పాటు, ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ ఆదేశాలు ఇచ్చింది.

జేఈఈ మెయిన్ దరఖాస్తులకు 'ఎడిట్' ఆప్షన్

జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షల కోసం చేసుకున్న దరఖాస్తుల్లో తప్పుల సవరణకు ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) అభ్యర్థులకు మరో అవకాశమిచ్చింది. దరఖాస్తుల్లో తప్పుల సవరణకు ఈ నెల 26, 27 తేదీల్లో ఎడిట్ ఆప్షన్‌ను అందుబాటులో ఉంచుతామని ప్రకటించింది.

స్నేహితులను మింగేసిన మృత్యువు

- రెండుచోట్ల రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

చేర్యాల/హవేళిఘణపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెదక్, సిద్దిపేట జిల్లాల్లో చోటుచేసుకున్న రెండు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు చనిపోయారు. రెండుచోట్లా బైక్ మీద వెళుతూ మృత్యు ఒడిలోకి జారిపోయిన వారు ఎప్పుడూ కలిసిమెలిసి ఉండే స్నేహితులే. వివరాలిలా ఉన్నాయి.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కట్కూరు గ్రామానికి చెందిన ఏనుగుల కరుణాకర్ (38), దూసరి సాయిలు (32) వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇద్దరి పొలాలు సోలామైల్ సమీపంలో పక్కపక్కనే ఉండటంతో ఒకరికొకరు సహాయం చేసుకుంటూ మంచి స్నేహితులయ్యారు. మంగళవారం రాత్రి ఇద్దరూ కలిసి తమ పిల్లలకు స్కూలు బ్యాగులు కొనడంతో పాటు ఇతర పనుల కోసం బైక్‌పై చేర్యాలకు వచ్చారు. పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా ముస్త్యాల శివారు ప్రగతి హాస్టల్ సమీపంలో మూలమలుపు వద్ద కారు ఢీకొని ఇద్దర్నీ కొంతదూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. మరో ఘటనలో.. మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలం జక్కన్నపేట శివారులో బైక్ అదుపు తప్పి మామిళ్ల మహేష్ (24), శీల ప్రభాకర్ (22) చనిపోయారు. వీరిద్దరి ఇళ్లు పక్కపక్కనే కావడంతో స్నేహితులయ్యారు. ఏ పని చేయాలన్నా ఎక్కడికెళ్లినా కలిసి వెళ్లేవారు. మంగళవారం మెదక్-సర్దన మార్గం మీదుగా జక్కన్నపేట నుంచి మెదక్ వెళ్లి వస్తుండగా ఫరీద్‌పూర్ చెరువు మూలమలుపు వద్ద వారి బైక్ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రభాకర్ అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన మహేష్‌ను మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతను ఆస్పత్రిలో అతను చనిపోయాడు. ఇద్దరూ తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కూమారులు కావడంతో ఆ రెండు కుటుంబాల వారు విలపిస్తున్న తీరు గ్రామస్థులను కంటతడి పెట్టించింది. ప్రభాకర్‌కు భార్య సౌందర్య ఉంది.

సురేశ్‌రాజ్ లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

లొంగిపోయిన అతనికి జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారు. లగచర్లలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయకుమార్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డిపై రైతులు, గ్రామస్థులు దాడి చేయడం వెనక సురేశ్ రాజ్ కీలకంగా వ్యవహరించాడన్న అభియోగం ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ నెల 11న లగచర్ల ఘటన చోటుచేసుకోగా.. అప్పటి నుంచి సురేశ్ రాజ్ పరారీలో ఉన్నాడు. అతని ఆచూకీ కోసం వారం రోజులుగా నాలుగు పోలీసు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అతను పోలీసుల కళ్లుగప్పి నేరుగా కోర్టులో లొంగిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా, ఇదే కేసులో ఏ-38 నేరెళ్ల హనుమంతు, ఏ-41 నీరటి సురేశ్‌ను మంగళవారం కోర్టులో హాజరు పరచగా వారికీ 14 రోజుల రిమాండ్ విధించారు. పోలీసులు ముగ్గురు నిందితులనూ సంగారెడ్డి జిల్లా జైలుకు తరలించారు. కాగా.. సురేశ్ రాజ్‌ను కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఇదే కేసులో ఏ-1గా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని కస్టడీ కోరుతూ పోలీసులు వేసిన పిటిషన్ బుధవారం విచారణకు రానుంది. ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టైన వారి సంఖ్య 28కి చేరుకుంది. జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులపై దాడిని రాజకీయ కుట్రగా నిర్ధారించుకున్న పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సురేశ్ రాజ్ సెల్‌ఫోన్‌ను విశ్లేషిస్తే ముఖ్యమైన సమాచారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

వారం రోజులు ఎక్కడున్నాడు?

లగచర్ల ఘటన తర్వాత పరారీలో ఉన్న సురేశ్ రాజ్ వారం రోజుల పాటు ఎక్కడెక్కడ తిరిగాడు, ఎవరెవరినీ కలిశాడనేది చర్చనీయాంశంగా మారింది. అతనికి ఎవరు ఆశ్రయం కల్పించారనే విషయాన్ని పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినా చిక్కకుండా ముప్పుతిప్పలు పెట్టిన సురేశ్ రాజ్ తన ఫోన్ కాకుండా వేరే ఫోన్, సిమ్ కార్డులు ఉపయోగించినట్లు తెలుస్తోంది. అతను హైదరాబాద్‌లోనే షెల్టర్ తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. సురేశ్‌రాజ్‌ను పోలీసులు విచారణ చేస్తే లగచర్ల ఘటన సూత్రధారులతో పాటు అతనికి ఎవరు ఆశ్రయం ఇచ్చారనే విషయం తెలుస్తుందని అంటున్నారు.


లగచర్ల ఘటనలో నిందితులు హనుమంతు, నీరటి సురేశ్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రైతులతో మాట్లాడేందుకు రావాలని చెప్పి..

ఫార్మా ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూ సేకరణపై ప్రజాభిప్రాయ సేకరణకు ఈ నెల 11న లగచర్ల వచ్చిన జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడి వెనక సురేశ్‌రాజ్‌ను కీలక పాత్రధారిగా పోలీసులు తమ విచారణలో గుర్తించారు. ఆ రోజు ప్రజాభిప్రాయ సేకరణకు లగచర్ల శివారులో సమావేశం ఏర్పాటు చేయగా, రైతులు ఎవరూ హాజరు కాలేదు. అదే సమయంలో అక్కడికి వచ్చిన సురేశ్ రాజ్ రైతులందరూ లగచర్లలో ఉన్నారని, అక్కడికే వచ్చి వారితో మాట్లాడాలంటూ కలెక్టర్‌ను కోరాడు. దాంతో ఆయన ఇతర అధికారులతో కలిసి వెళ్లారు. అధికారులు తమ వాహనాల నుంచి దిగి వెళుతున్న సమయంలో వారిపై దాడి చోటుచేసుకుంది. అధికారులపై దాడి చేసేలా అక్కడి రైతులను, ప్రజలను ఉసిగొల్పడంలో కీలకంగా వ్యవహరించాడన్న అభియోగాన్ని సురేశ్ రాజ్ ఎదుర్కొంటున్నాడు.

రేవంత్ రెడ్డీ.. గుర్తుపెట్టుకో..!
రాకెట్ వేగంతో తిరిగొస్తా: సురేశ్ రాజ్

'రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో.. రాకెట్ వేగంతో తిరిగి వస్తా.. రైతుల పక్షాన పోరాటం చేస్తా' అని లగచర్ల నిందితుడు సురేశ్ రాజ్ అన్నాడు. మంగళవారం అతనికి కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం సంగారెడ్డి కోర్టుకు తరలిస్తున్న సమయంలో అక్కడున్న మీడియాను చూసి ఈ వ్యాఖ్యలు చేశాడు.

లగచర్ల ఘటనపై రాష్ట్రపతి కార్యాలయం ఆరా!: అపాయింట్‌మెంట్ కోరిన బీఆర్ఎస్

న్యూఢిల్లీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనపై రాష్ట్రపతి కార్యాలయం ఆరా తీసినట్లు తెలిసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ నేతృత్వంలో 15మంది మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అపాయింట్‌మెంట్ కోరారు. దాడికి సంబంధించిన వివరాలను ఇవ్వాలని రాష్ట్రపతి కార్యాలయం బీఆర్ఎస్‌ను కోరినట్లు తెలిసింది. ఫార్మా విలేజ్‌కు భూసేకరణ విషయంలో లగచర్ల గ్రామస్థులపై పోలీసులు ప్రవర్తించిన తీరును, వార్త కథనాలను రాష్ట్రపతి కార్యాలయానికి బీఆర్ఎస్ అందించినట్లు సమాచారం. కాగా, సత్యవతి రాథోడ్ మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గిరిజన నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి సర్కార్ గిరిజనులపై తన ప్రతాపం చూపిస్తోందన్నారు. లగచర్ల దారుణాలను బయటి ప్రపంచానికి తెలియకుండా చేస్తోందని ఆరోపించారు.

లగచర్ల వెళుతున్న నాయకులను అడ్డుకున్న పోలీసులు

బొంరాస్‌పేట్/హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): లగచర్ల, రోటిబండ గ్రామాలకు వెళుతున్న పీవోడబ్ల్యూ బృందాన్ని, గిరిజన, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. తుంకిమెట్ల వద్ద తమను అడ్డుకున్న పోలీసులతో పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై అందరి పోరాటాల తోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని గుర్తుంచుకోవాలని చెప్పారు. గిరిజన, ప్రజాసంఘాల నేతలను పోలీసులు లగచర్ల గ్రామ సరిహద్దు వద్ద అరెస్టు చేశారు. వారిని బొంరాస్‌పేట్ పీఎస్‌కు తరలించగా అక్కడ వారు నిరసన తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయ విభేదాలను లగచర్ల సమస్యతో ముడిపెడుతూ కక్ష సాధింపులకు పాల్పడటం తగదన్నారు. లగచర్లకు వెళ్లకుండా మహిళా సంఘ నేతలను పోలీసులు అడ్డుకోవడం అక్రమమని, ప్రజాపాలన ఒట్టిదేనని రేవంత్ ప్రభుత్వం నిరూపించుకుంటోందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కమిటీ పేర్కొంది.

గవర్నర్‌ను కలిసిన ఉద్యోగుల జేఏసీ

లగచర్లలో ప్రభుత్వ అధికారులపై రైతుల ముసుగులో దాడి చేసిన, దాడికి ప్రేరేపించిన వారిపై కఠిన చర్యలకు ఆదేశించాలని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి నేతృత్వంలో ఉద్యోగులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు. వారు మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. అధికారులపై దాడులు రాష్ట్రంలో ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు.

పట్నం నరేందర్ రెడ్డిని ప్రత్యేక విచారణ ఖైదీగా గుర్తించండి
జైలు అధికారులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో ఏ-1గా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని ప్రత్యేక విచారణ ఖైదీగా గుర్తించి వసతులు కల్పించాలని చర్లపల్లి జైలు అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నరేందర్ రెడ్డికి తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నందున ప్రత్యేక వసతి కల్పించాలని, ఇంటి భోజనం స్వీకరించేందుకు అనుమతించాలని కోరుతూ ఆయన భార్య శృతి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది సామల రవీందర్ వాదనలు వినిపించారు. దీంతో పిటిషనర్ భర్తకు ప్రత్యేక వసతి కల్పించడంతో పాటు ఇంటి భోజనం అనుమతించాలని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

మీ స్థాయెంత? మీ బతుకెంత?

- రేవంత్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి
- మోదీని విమర్శించడంపై ఈటల ఆగ్రహం



హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): "మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో మోదీ ఏంది? గీదీ ఏంది? అంటరా? మీ స్థాయి ఎంత? మీ బతుకెంత?" అని సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉట్టికి ఎగరలేనమ్మ ఆకాశానికి ఎగిరినట్లుగా రేవంత్ వైఖరి ఉందని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ఎన్ని హామీలిచ్చారు? ఎన్ని అమలు చేశారు? అనే అంశాల మీద అబిడ్స్ చౌరస్తాలోనైనా, సచివాలయంలోనైనా చర్చకు రావాలని రేవంత్‌కు సవాల్ చేశారు. హామీల అమలను ప్రజాక్షేత్రంలో నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటానని స్పష్టం చేశారు. మహారాష్ట్ర వెళ్లి రేవంత్, హామీల అమలుపై పచ్చి అబద్ధాలు చెప్పారని విమర్శించారు. మహిళా సంఘాలకు పది లక్షల వడ్డీలేని రుణం ఇస్తామని హామీ ఇచ్చిన మీరు దానిని నిలబెట్టుకున్నారా? పెళ్లి చేసుకున్న ఆడ బిడ్డలకు తులం బంగారం ఇచ్చారా? బెల్టుషాపులు రద్దుచేస్తామని హామీ ఇచ్చారు? రద్దు చేశారా? అని నిలదీశారు. 8 నెలలుగా లగచర్లలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే రేవంత్ దాచిపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఫార్మాసిటీ కోసం తమ భూములు ఇవ్వబోమని చెప్పిన రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని వారి భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తూ రేవంత్ శాడిస్టులా వ్యవహరిస్తున్నరని మండిపడ్డారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈటల మాట్లాడారు. రేవంత్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో కిరాణ కొట్లు కూడా బెల్టుషాపులుగా మారాయని ధ్వజమెత్తారు. పిల్లలు మద్యానికి బానిసలుగా మారుతుండటంతో తల్లిదండ్రులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. గుడి, బడి పక్కనే విచ్చలవిడిగా మద్యంషాపులకు అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. మూసీకి ఇరువైపులా విలువైనటువంటి భూములను లాక్కొని.. మల్టీనేషనల్ కంపెనీలకు ఇచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. కాగా ధైర్యం ఉంటే ఎన్ని హామీలు అమలు చేశారనేది సీఎం రేవంత్ చెప్పాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కాకులు పోయి గద్దలు వచ్చినట్లుగా కాంగ్రెస్ పాలన ఉందని మండిపడ్డారు.

లగచర్ల ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు

లగచర్ల ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్‌సీ)కు ఫిర్యాదు చేసినట్లు ఈటల తెలిపారు. కస్టడీలో పోలీసులు రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలు పెట్టారని పేర్కొన్నారు. అధికార పార్టీ నేతలు, పోలీసుల చర్యలతో స్థానికులు భయాందోళనలో ఉన్నారన్నారు. కమిషన్, ఒక బృందాన్ని లగచర్లకు పంపించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దీనిపై కమిషన్ కూడా సానుకూలంగా స్పందించిందని ఈటల తెలిపారు.

సగం పోలీసు స్టేషన్లలో సీసీ కెమెరాల్లేవు

- స.హ.చట్టం సమాధానంలో వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సగానికి పైగా పోలీసు స్టేషన్లలో సీసీ కెమెరాలు లేవు. వాటి ఏర్పాటు ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. ప్రతి పోలీసు స్టేషన్‌లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలు నత్తనడకన సాగుతోంది. రాష్ట్రంలో 376 పోలీసు స్టేషన్లలోనే సీసీ కెమెరాలు ఉన్నాయి. మరో 396 స్టేషన్లలో ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు విషయమై సమాచార హక్కుచట్టం కింద యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ వ్యవస్థాపకుడు రాజేంద్ర పల్నాటి అడిగిన ప్రశ్నకు జవాబుగా డీజీపీ కార్యాలయ అధికారులు వివరాలు ఇచ్చారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.